www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 6-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 160

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: తదియ మ. 3.02 తదుపరి చవితి, నక్షత్రం: హస్త ఉ. 9.25 తదుపరి చిత్త. వర్జ్యం: రా.6.28-8.16, దుర్ముహూర్తం: ఉ.8.32-9.21, మ.12.37-1.26, అమృతఘడియలు: తె.5.19 మొదలు, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.05, సూర్యాస్తమయం: 6.20

వరంగల్

Warangal |Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వెంటిలేటర్‌పై ఏచూరి

ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స



హైదరాబాద్, సెప్టెంబరు 5 : సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోగ్యం విషమంగా ఉంది. న్యూమోనియాతో బాధపడుతున్న ఆయన ఆగస్టు 19న ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం ఏచూరి ఆరోగ్యం కాస్త ఆందోళనకరంగా ఉందని, వెంటిలేటర్‌పై చికిత్స చేస్తున్నామని ఎయిమ్స్ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తు

- స్కూల్ నుంచి వర్సిటీ దాకా..
- విభాగాధిపతులకు నెలనెలా కరెంటు బిల్లులు
- దీనికోసం ప్రత్యేకంగా పోర్టల్
- ఆర్థిక శాఖతో అనుసంధానం
- ప్రతి నెలా బడ్జెట్ కేటాయింపు

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, ఐటీఐలు, డిగ్రీ, పీజీ కాలేజీలు, విశ్వవిద్యాలయాలు, పాలిటెక్నిక్‌లు, ఎస్సీ/ఎస్టీ/బీసీ/మైనారిటీ

మిగతా 3వ పేజీలో...



శాశ్వత నివాసితులు స్థానిక కోటాకు అర్హులే!

- వారికి 'వరుసగా నాలుగేళ్ల' నిబంధన వర్తించదు
- వైద్యవిద్య కౌన్సెలింగ్‌కు అవకాశమివ్వండి
- విద్యార్థి స్థానికతపై ప్రస్తుతం మార్గదర్శకాల్లేవు
- దీనిపై తాజాగా నిబంధనలు/మార్గదర్శకాలివ్వండి
- కొత్త మార్గదర్శకాల మేరకే వైద్య విద్యలో ప్రవేశాలు
- జీవో 33 కేసులో హైకోర్టు కీలక తీర్పు



హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదో తరగతి నుంచి వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివిన వాళ్లే.. రాష్ట్రంలో వైద్య విద్యకు స్థానిక కోటాలో అర్హులంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలపై హైకోర్టు గురువారం కీలక తీర్పునిచ్చింది. తెలంగాణలో శాశ్వత నివాసితులకు ఈ నిబంధన వర్తించదని పేర్కొంటూ.. 'తెలంగాణ మెడికల్ అండ్ డెంటల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్-2017'కు జీవో 33 ద్వారా ప్రభుత్వం తెచ్చిన సవరణ, రూల్ 3(ఏ)ని పునర్నిర్వచించింది. శాశ్వత నివాసులు

మిగతా 14వ పేజీలో...

హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో జరుగుతున్న ప్రపంచ ఏఐ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు



ఏఐ విప్లవానికి హైదరాబాద్ రెడీ!

- కృత్రిమ మేధ కేంద్రంగా ఫ్యూచర్ సిటీ.. ఈ రంగంలో బలమైన పునాది వేస్తాం
- పరిశ్రమలకు హైదరాబాద్ దేశంలోనే ఉత్తమం.. ఈనాటి అత్యుత్తమ ఆవిష్కరణ ఏఐనే
- ప్రపంచ ఏఐ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో భవిష్యత్తుకు బలమైన పునాది వేయనున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే అందుకు అవసరమైన చాలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఏఐపై తమ ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదన్నారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో కృత్రిమ మేధపై నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో గురువారం తొలిరోజు ముఖ్యమంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలో ఏఐకి సంబంధించి 25 అంశాలతో రూపొందించిన రోడ్ మ్యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, దేశంలో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్ తరహాలో మరే నగరమూ సిద్ధంగా లేదన్నారు. పరిశ్రమల ఏర్పాటులో ఉన్న సవాళ్లను స్వీకరించడమే కాకుండా ఆయా రంగాలకు భవిష్యత్తును సృష్టిస్తామని

మిగతా 13వ పేజీలో...

అందరికీ ఏఐ!

- మూడేళ్లలో కోటి మందికి కృత్రిమ మేధపై అవగాహన
- వచ్చే విద్యాసంవత్సరం నుంచే విద్యార్థులకు పాఠాలు
- 5 లక్షల మందికి ఉద్యోగాల శిక్షణ.. ఉపకార వేతనాలూ..
- ప్రభుత్వ సేవల్లో వినియోగం.. ఉత్పాదకత 20% పెంపు
- ఏఐకి సలహా మండలి.. నేరుగా సీఎం ఆఫీసుకే రిపోర్టు
- 20 వేల ప్రభుత్వ టీచర్లకు ఏఐ సాంకేతికతలో శిక్షణ
- రోడ్ మ్యాప్ విడుదల చేసిన సీఎం రేవంత్

13

రూ. 84 లక్షల కోట్లు!

- 2036 నాటికి అంత విలువైన ఆర్థిక వ్యవస్థ సృష్టి
- భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- 'తెలంగాణ గ్రోత్ స్టోరీ'ని ఆవిష్కరించిన సీఎం

14



ఏఐతో ఆయుర్దాయం పెంపు!

పదేళ్లలో సాధ్యమే.. ఒక్క ఏడాది పెరిగినా రూ.వేల కోట్ల సంపద సృష్టి

అమెరికా పారిశ్రామికవేత్త డాక్టర్ పీటర్ డియెమాండిస్ కీలకోపన్యాసం

13

పౌరసేవల్లో ఏఐ.. మెటాతో ఒప్పందం

గేమింగ్ కంపెనీ నాజారాతోనూ ఎంవోయూ

200 ఎకరాల్లో ఏఐ సిటీ నిర్మాణం

3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీయే లక్ష్యం: శ్రీధర్‌బాబు

దక్షిణ ఆర్‌ఆర్‌ఆర్ భూముల విలువ డబుల్!

- ఉమ్మడి మెదక్‌లో సేకరించే భూముల విలువ పెంపు
- ఈ నెల 1 నుంచే ధరణిలో అందుబాటులోకి
- కేసీఆర్ ఫాంహౌస్ ఉన్న ఎర్రవెల్లిలో రెట్టింపు పైగా..



హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగ్ రోడ్డులో భాగంగా దక్షిణ భాగంలో భూములను కోల్పోతున్న అన్నదాతలకు కొంతలో కొంత ఊరట! మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట రెవెన్యూ జిల్లాల మీదుగా వెళ్లే రోడ్డు మార్గం కోసం సేకరించనున్న భూముల రికార్డు విలువను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలోని ఓ రెండు సర్వేనంబర్ల భూముల రేట్లు రెట్టింపునకు పైగా పెరిగాయి! సంగారెడ్డి జిల్లా కలాబ్‌గుర్‌లోనూ ఇంతే. మెదక్ జిల్లా తూప్రాన్‌కు అతి సమీపంలో అత్యంత ఖరీదైన.. రెండు పంటలు పండే నాగులపల్లిలో సేకరించనున్న 105 ఎకరాల భూమి విలువ దాదాపుగా రెండింతలకు పైగా పెరిగింది. మొత్తమ్మీద ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం భూసేకరణ విషయంలో 'ఆంధ్రజ్యోతి' చెప్పిందే నిజమైంది. సౌత్ అలైన్‌మెంట్ పరిధిలో సేకరించనున్న

మిగతా 14వ పేజీలో...

మల్లన్నసాగర్.. భూకంప జోన్‌లో!

- అధ్యయనం లేకుండానే నిర్మించారు: కాగ్
- సుమోటోగా విచారణ చేపట్టిన ఎన్జీటీ
- 11న చెన్నై బెంచ్‌లో తదుపరి విచారణ

గురుపూజోత్సవానికి హాజరయ్యే తీరిక లేదా?

- సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్న
- ఖమ్మం వరద బాధితులకు 3 లారీల్లో నిత్యావసరాలు పంపిన బీఆర్ఎస్ నేత



హైదరాబాద్, సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించిన గురుపూజోత్సవానికి హాజరయ్యే తీరిక సీఎంకు లేదా ? అంటూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ప్రాధాన్యాల్లో

మిగతా 12వ పేజీలో...



ఘటనా స్థలిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

మళ్లీ పేలిన తూటా

- భద్రాద్రి జిల్లా బోనాలగుంట అడవిలో భారీ ఎన్‌కౌంటర్.. ఆరుగురు మావోయిస్టుల మృతి
- ఇద్దరు గ్రేహౌండ్స్ పోలీసులకు గాయాలు
- టేకులగూడెంలో మావోయిస్టు నేత జగన్ అంత్యక్రియలు పూర్తి.. భారీ ఎత్తున ప్రజలు

కరకగూడెం/మణుగూరు/కొత్తగూడెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా మరోమారు ఎరుపెక్కింది. కరకగూడెం మండల పరిధిలో రఘునాథపాలెం పంచాయతీ మోతె గ్రామ సమీపంలో బోనాలకుంట అడవిలో తుపాకీ తూటా పేలింది. గురువారం తెల్లవారుజామున కూంబింగ్‌లో ఉన్న గ్రేహౌండ్స్ పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు జిల్లాల

మిగతా 3వ పేజీలో...

ఆర్థిక సమస్యలపై 5 విపక్ష రాష్ట్రాల సదస్సు

- 12న నిర్వహిస్తున్న కేరళ సర్కారు
- తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆహ్వానం
- కేంద్ర పన్నుల్లో మెరుగైన వాటా లక్ష్యం

2

కోలుకుంటున్న ఖమ్మం

- నివాసాలకు చేరుతున్న బాధితులు.. వరద నష్టంపై ఇంటింటి సర్వే
- ఇంటికే నిత్యావసరాలు.. బ్యాంకు ఖాతాల సేకరణ.. నేడు 10 వేల సాయం



ఖమ్మంలో వరద ముంపునకు గురైన ఓ ప్రాంతంలో రోడ్లు ఊడుస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఖమ్మం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రాణాలు అరచేత పట్టుకుని.. కట్టుబట్టలతో వెళ్లిపోయినవారంతా తిరిగి ఇళ్లకు చేరుతున్నారు. వరద మిగిల్చిన నష్టాన్ని దిగమింగుకుని.. తమకు మిగిలిందేమిటో చూసుకుంటున్నారు. కాలూచేయీ కూడదీసుకుని నివాసాలను శుభ్రం చేసుకుంటున్నారు..! మున్నేరు ఉప్పెనతో కకావికలమైన ఖమ్మం క్రమంగా కుదుటపడుతోంది. బాధితులు కోలుకుంటున్నారు. వరద దెబ్బకు వేల ఇళ్లు నేలమట్టం కాగా, అదే స్థాయిలో తీవ్రంగా దెబ్బతిన్నాయి. సామగ్రి సర్వం కొట్టుకుపోయాయి. వేలాది ఎకరాల్లో పంటలు మునిగాయి. గత ఆదివారం పునరావాస కేంద్రాలకు వెళ్లినవారంతా ఇళ్లకు తిరిగి వచ్చారు. మున్నేరుకు ఆనుకుని ఉన్న బొక్కలగడ్డ, పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, మంచికంటినగర్, మోతీనగర్, కాల్వొడ్డు, ధంసలాపురం, రామన్నపేట, దానవాయిగూడెం, ప్రకాష్‌నగర్, ఖమ్మం రూరల్ మండలం పెద్ద తండా,

మిగతా 12వ పేజీలో...

ఇంటికన్నె వద్ద రెండో ట్రాక్ సిద్ధం

సికింద్రాబాద్-బెజవాడ రూట్లో నెమ్మదిగా నడుస్తున్న రైళ్లు

వరద బాధితులకు అండగా నిలవండి

బీమా కంపెనీలను కోరిన కేంద్ర ఆర్థికశాఖ

సర్వే పూర్తి కాగానే పరిహారం పంపిణీ

- ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం
- మున్నేరు బాధితులను ఆదుకుంటాం: మంత్రి తుమ్మల

12

అధైర్యపడొద్దు.. అందర్నీ ఆదుకుంటాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భరోసా
- ఖమ్మం రూరల్‌లో వరద బాధితులకు పరామర్శ

నిర్లక్ష్యంతో నష్టం జరిగితే సీఈలదే బాధ్యత!

- ప్రతి ప్రాజెక్టు గేట్లు, కాలువలను తనిఖీ చేయాలి
- చెరువులు, కాలువల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన జరపండి
- స్వల్పకాలిక టెండర్లు పిలిచి, పనులు చేపట్టండి: మంత్రి ఉత్తమ్
- ప్రాజెక్టుల నిర్వహణకు నిధులివ్వాలని అధికారుల విజ్ఞప్తి

14



భర్తతో కలిసి మీడియాతో బాధితురాలు

ఆదిమూలం.. వేధించారు!

- తిరుపతిలో హోటల్‌కు పిలిచి పలుమార్లు లైంగిక దాడి చేశాడు
- నా భర్త సూచనలతో వ్యవహారం మొత్తం పెన్ కెమెరాలో రికార్డ్ చేశా
- టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై ఆ పార్టీ మహిళా నేత ఆరోపణలు
- ఆధారాలు వెల్లడించిన బాధితురాలు
- బాబు సీరియస్.. ఎమ్మెల్యే సస్పెన్షన్

పంజాగుట్ట/తిరుపతి/అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏపీలోని తిరుపతి జిల్లా సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై అదే పార్టీకి చెందిన మండల స్థాయి మహిళా నాయకురాలు సంచలన ఆరోపణలు చేశారు. ఆదిమూలం తనపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డారని తెలిపారు. ఈ విషయం ఎవరికైనా చెబితే తనను, తన కుటుంబాన్నీ చంపేస్తానని బెదిరించారని ఆరోపించారు. తనకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని, లేకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని బాధితురాలు హెచ్చరించారు. ఈ మేరకు

మిగతా 3వ పేజీలో...

నందిగం సురేశ్ అరెస్ట్

- టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో అదుపులోకి
- హైడ్రామా మధ్య హైదరాబాద్‌లో పట్టివేత
- మంగళగిరికి తరలించిన పోలీసులు
- 2 వారాల రిమాండ్.. గుంటూరు జైలుకు..

3

స్వీపర్ పోస్టులకు 1.7 లక్షల దరఖాస్తులు

- వీరిలో 6వేలకుపైగా పోస్టు గ్రాడ్యుయేట్లు
- 40వేల మంది గ్రాడ్యుయేట్లు

చండీగఢ్, సెప్టెంబరు 5: హరియాణాలో నిరుద్యోగ తీవ్రతకు ఇదో నిదర్శనం. ప్రభుత్వ విభాగాలు, కార్పొరేషన్లలో స్వీపర్ పోస్టుల కోసం సుమారు 1.7 లక్షల దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసిన వారిలో ఉన్నత విద్యావంతులు ఉన్నారు. 6వేల మందికిపైగా పోస్టు గ్రాడ్యుయేట్లు, సుమారు 40వేల మంది గ్రాడ్యుయేట్లు అప్లికేషన్లు సమర్పించారు. స్వీపర్‌కు ఇచ్చే నెల జీతం రూ.15వేలు కావడం గమనార్హం. ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ సంస్థ అయిన హరియాణా కౌశల్ రోజ్‌గార్ నిగం లిమిటెడ్ (హెచ్‌కేఆర్‌ఎన్) ఆగస్టు ఆరో తేదీ నుంచి సెప్టెంబరు రెండో తేదీ వరకు స్వీకరించిన దరఖాస్తుల్లో ఈ విషయం వెల్లడయింది. పీజీ, బిజినెస్ స్టడీస్‌లో డిప్లొమో చేసిన మనీష్ కుమార్ కూడా ఈ పోస్టు కోసం దరఖాస్తు చేశారు. ప్రయివేటు సంస్థలు, పాఠశాలల్లో నెలకు రూ.10 వేలు మించి ఇవ్వడం లేదని, భవిష్యత్తులో రెగ్యులర్ ఉద్యోగం వస్తుందన్న ఆశ కూడా లేకపోవడంతో ఈ పోస్టు కోసం దరఖాస్తు చేసినట్టు చెప్పారు. స్వీపర్ అంటే రోజంతా చేయాల్సిన ఉద్యోగం కాదని, ఇతర పనులు చేసుకోవచ్చన్న ఉద్దేశంతో దీనిపై ఆశ పెంచుకున్నట్టు తెలిపారు. రోహతక్‌లోని సుఖ్‌పూర్ చౌక్ చెందిన సుమిత్ర మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం పొందేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని చెప్పారు. దాంతో చివరి ప్రయత్నం కింద ఈ పోస్టు కోసం దరఖాస్తు చేసినట్టు తెలిపారు.

తల్లిదండ్రుల చేతుల్లో పిల్లల యూట్యూబ్ నియంత్రణ

స్టేటస్ వీక్షణకు వాట్సా్ప్‌లో కొత్త ఫీచర్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: పిల్లల యూట్యూబ్ నియంత్రణ ఇకపై తల్లిదండ్రుల చేతుల్లో ఉండేలా యూట్యూబ్ సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని సాయంతో పిల్లల యూట్యూబ్ ఖాతాను తల్లిదండ్రుల అకౌంట్‌కు లింక్ చేయొచ్చు. యూట్యూబ్ ఫ్యామిలీ సెంటర్ పేరుతో తీసుకొచ్చిన ఈ ఫీచర్‌తో పిల్లలు ఏదైనా వీడియో అప్‌లోడ్ చేసినా, లైవ్‌స్ట్రీమింగ్ మొదలుపెట్టినా వెంటనే తల్లిదండ్రులకు ఈ మెయిల్ ద్వారా నోటిఫికేషన్ అందుతుంది. అలాగే యూట్యూబ్‌లో పిల్లలు అప్‌లోడ్ చేసే వీడియోలు, సబ్‌స్క్రైబ్ చేసే చానళ్లు, కామెంట్లు, పోస్టుల గురించి తల్లిదండ్రులకు తెలిసిపోతుంది. అంటే తల్లిదండ్రుల నియంత్రణలో పిల్లల యూట్యూబ్ అకౌంట్ ఉంటుందన్న మాట. తల్లిదండ్రులు తమ యూట్యూబ్ యాప్‌లో సెట్టింగ్స్‌లోకి వెళ్లి 'ఫ్యామిలీ సెంటర్ పేజ్'ను ఎంచుకుని ఈ ఫీచర్ యాక్టివేట్ చేసుకోవచ్చు. ఆండ్రాయిడ్, ఐఫోన్ వినియోగదారులు ఈ సేవలు వినియోగించుకోవచ్చు. మరోవైపు వాట్సాప్ మరో కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వినియోగదారుల కాంటాక్ట్స్‌లోని వారు స్టేటస్ పెట్టినట్లయితే.. వారి ప్రొఫైల్ పిక్చర్ చుట్టూ ఒక పచ్చని వలయం కనిపిస్తుంది. దానిపై నొక్కి వారి స్టేటస్‌ను వీక్షించవచ్చు.

లోకం తీరు





అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ మృదుల, ఉపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం

తెలుగు రాష్ట్రాల ఉపాధ్యాయులకు అందజేసిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నందవరం మృదుల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. అలాగే, తెలంగాణ నుంచి ఈ పురస్కారానికి ఎంపికైన తిరుమలాయపాలెం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు పీసర ప్రభాకర్‌రెడ్డి, దమ్మన్నపేట జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్, హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేట్ అధ్యాపకురాలు వనమాల స్వప్న కూడా అవార్డులు అందుకున్నారు. అదే విధంగా ఏపీలోని గుడివాడ ఎస్పీఎస్ మునిసిపల్ హైస్కూల్ ఉపాధ్యాయుడు విఎద్దె శ్రీనివాసరావు, ఉరందూర్ జడ్పీహైస్కూల్ ఉపాధ్యాయుడు సురేష్ కునాటి కూడా పురస్కారాలు స్వీకరించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వీరందరికీ అవార్డులు ప్రదానం చేశారు.



తాడూరి సంపత్‌కుమార్



వనమాల స్వప్న

ఆర్థిక సమస్యలపై 5 విపక్ష రాష్ట్రాల సదస్సు

- 12న నిర్వహిస్తున్న కేరళ సర్కారు

తిరువనంతపురం, సెప్టెంబరు 5: పదహారవ ఆర్థిక సంఘం చేయబోయే సిఫార్సుల్లో రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ పన్నుల్లో మెరుగైన వాటా కోసం చేసే ప్రయత్నాల్లో భాగంగా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కేరళ సర్కారు నిర్ణయించింది. సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి తమిళనాడు(డీఎంకే), తెలంగాణ(కాంగ్రెస్), కర్ణాటక(కాంగ్రెస్), పంజాబ్(ఆప్) రాష్ట్రాల ప్రభుత్వాలను ఆహ్వానించారు. ఈ విషయాన్ని కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్. బాలగోపాల్ గురువారం వెల్లడించారు. మొత్తం ఐదు రాష్ట్రాల్లో నాలుగు దక్షిణాది రాష్ట్రాలే. బీజేపీ పాలనలో ఉన్న కేంద్రంతో బేరమాడే శక్తిని పెంపొందించుకొనే ప్రయత్నంలో భాగంగా కేరళ ప్రభుత్వం విపక్ష పాలిత రాష్ట్రాలను ఒక్కతాటిపైకి తెచ్చేందుకు కృషి చేస్తోంది. గత ఏడాది కేరళ సర్కారు రుణ సేకరణపై కేంద్రం విధించిన పరిమితులను సవాలు చేస్తూ ఏకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ నెల 12న సమావేశం ఉంటుందని, ఆర్థిక సమాఖ్యవాదం అంశంపై జరిగే ఈ సమావేశాన్ని కేరళ ముఖ్యమంత్రి విజయన్ ప్రారంభిస్తారని బాలగోపాల్ తెలిపారు. తెలంగాణ నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కర్ణాటక నుంచి రెవెన్యూ మంత్రి కృష్ణ బైరెగౌడ, పంజాబ్ ఆర్థిక మంత్రి హర్‌పాల్‌సింగ్ చీమా, తమిళనాడు ఆర్థిక మంత్రి తంగం తెన్నరుసు, కేరళ విపక్ష నేత వీడీ సతీశన్ పాల్గొంటారని చెప్పారు. ఐదు రాష్ట్రాల ఆర్థిక కార్యదర్శులు, ఆర్థిక వ్యవహారాల నిపుణులు, కేంద్ర ప్రభుత్వ మాజీ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ కూడా హాజరవుతారన్నారు. భారత ఆర్థిక సమాఖ్యవాదం ప్రమాదంలో పడిన నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రాల మధ్య పన్నుల పంపిణీలో కేంద్రం అన్యాయమైన విధానాన్ని అవలంబిస్తోందని బాలగోపాల్ అన్నారు. కేంద్రం వసూలు చేస్తున్న పలు రకాల పన్నుల్లో రాష్ట్రాలకు వాటా ఇవ్వడం లేదని ప్రస్తావించారు.

హిందువులపై దాడులు మతపరమైనవి కాదు

- రాజకీయాలతో పెద్దగా చూపారని మోదీకి చెప్పా
- బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి యూనస్



ఢాకా, సెప్టెంబరు5: ఆందోళనల సందర్భంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడులు మతపరమైనవి కాదని.. ఈ అంశంలో భారత్ ప్రచారం చేసిన తీరు సరికాదని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ సారథి మొహమ్మద్ యూనస్ వ్యాఖ్యానించారు. షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్‌కు మద్దతుదారులుగా ఉన్న హిందువులపైనే దాడులు చోటుచేసుకున్నాయని, రాజకీయ కారణాలతో వాటిని పెద్దగా చూపారని పేర్కొన్నారు. ఇందులో అనేక కోణాలున్నాయని, ఇదే విషయాన్ని భారత ప్రధాని మోదీకి కూడా చెప్పానన్నారు. మైనారిటీల భద్రత తమ ప్రాధాన్యం అంశమని, పొరుగు దేశంతో తాము సత్సంబంధాలనే కోరుకుంటున్నామన్నారు. యూనస్ ఢాకాలో మీడియాతో మాట్లాడుతూ హసీనా భారత్‌లో ఉంటూ రాజకీయ వ్యాఖ్యలు చేయడాన్ని తప్పుబట్టారు. అప్పగించాలని కోరే దాకా మౌనంగా ఉంటే అది ఆమెకు రక్ష అని అన్నారు. లేదంటే ఇరు దేశాల సంబంధాలపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. హసీనా దురాగతాల గురించి విచారణ తప్పదన్నారు. అల్లర్ల బాధితులకు న్యాయం జరగాలంటే మాజీ ప్రధానిని స్వదేశానికి తీసుకురావడం తప్పనిసరి అని.. లేదంటే ప్రజలు క్షమించరన్నారు. కాగా, వివరాలన్నీ పరిశీలించాక అదానీతో కుదుర్చుకున్న విద్యుత్తు ఒప్పందంపై అవసరమైతే సమీక్ష చేస్తామని యూనస్ చెప్పారు. కాగా బంగ్లాదేశ్‌లో ఆందోళనలకు పాల్పడిన వారిని శిక్షించాలంటూ ఆగస్టు 13న హసీనా కోరారు. అమెరికాలో ఉంటున్న ఆమె కుమారుడు సజీబ్ వాజెద్ జాయ్ ట్విటర్ ఖాతా నుంచి ఈమేరకు ప్రకటన విడుదల చేశారు.

బైడెన్‌కు మోదీ ఫోన్

- బంగ్లాదేశ్‌లో హిందువుల భద్రతపై చర్చ

వాషింగ్టన్, సెప్టెంబరు 5: బంగ్లాదేశ్‌లో హిందువుల భద్రతపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో సంభాషించినట్లు తాజాగా వైట్ హౌస్ వెల్లడించింది. బంగ్లాదేశ్‌లో నెలకొన్న అనిశ్చితి పరిస్థితులపై వారిద్దరూ గతవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారని వైట్ హౌస్ అధికార ప్రతినిధి గురువారం మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా జో బైడెన్, మోదీ ప్రాంతీయ, అంతర్జాతీయ సమస్యల గురించి సమగ్రంగా చర్చించినట్లు చెప్పారు. ముఖ్యంగా బంగ్లాదేశ్ ప్రజల భద్రత, ప్రజాస్వామ్య సంస్థల భవిష్యత్ గురించి ఇద్దరు నేతలు ఆందోళన వెలిబుచ్చారన్నారు. కాగా, ఇదివరకు కూడా బైడెన్, మోదీ ఫోన్ కాల్ మాట్లాడుకున్నారని భారత్ తెలిపింది.

సెమీకండక్టర్ల తయారీకి సింగపూర్ సహకారం

ఆ దేశ ప్రధానితో నరేంద్ర మోదీ భేటీ

- హెల్త్‌కేర్, ఇతర రంగాలపైనా ఒప్పందాలు
- ప్రతి దేశానికి స్ఫూర్తిదాయకం సింగపూర్: మోదీ



సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో ముచ్చటిస్తున్న మోదీ

సింగపూర్ సిటీ, సెప్టెంబరు 5: భారత్‌లో సెమీకండక్టర్ల తయారీకి సింగపూర్ సహకరించనుంది. గురువారం ఈ మేరకు సెమీకండక్టర్ల తయారీలో సహకారంతోపాటు.. నాలుగు కీలక అంశాలపై ఇరు దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ ఒప్పందాలతో భారత్, సింగపూర్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం బలపడతాయని అభిప్రాయపడ్డారు. సెమీకండక్టర్ల రంగంతోపాటు.. కనెక్టివిటీ, డిజిటలైజేషన్, హెల్త్‌కేర్ అండ్ మెడిసిన్, స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి, ఇరు దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు జరిగాయని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ భేటీ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. తాజా ఒప్పందంతో భారతదేశ 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'కి భారీ ప్రోత్సాహం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. "ఆర్థిక సంబంధాల విషయంలో.. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను మరింత విస్తరించాలని ఈ భేటీలో నిర్ణయించాం. 160 బిలియన్ డాలర్ల(రూ.1.34 లక్షల కోట్లు) పెట్టుబడితో భారత్‌కు సింగపూర్ ప్రధాన ఆర్థిక భాగస్వామి. రక్షణ, సముద్ర వనరులు, విద్య, కృత్రిమ మేధ, ఫిన్‌టెక్, శాస్త్రసాంకేతిక రంగాల్లో ఇప్పటికే ఉన్న సహకారంపైనా చర్చించాం" అని వ్యాఖ్యానించారు. అనంతరం తమ భేటీ వివరాలను ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అంతకుముందు ఇరువురు ప్రధానులు సెమీకండక్టర్ల కంపెనీని సందర్శించారు. రెండ్రోజుల సింగపూర్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ.. సింగపూర్ అధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నంతో భేటీ కానున్నారు. సీనియర్ మంత్రి లీ సియన్ లూంగ్ ఇచ్చే విందులో పాల్గొననున్నారు. కాగా.. గురువారం సాయంత్రం మోదీ సింగపూర్‌కు చెందిన దిగ్గజ కంపెనీల సీఈవోలతో భేటీ అయ్యారు.

స్వచ్ఛభారత్‌తో మెరుగైన ప్రజారోగ్యం

శిశు మరణాలు భారీగా తగ్గాయి: మోదీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: స్వచ్ఛభారత్ మిషన్‌తో పరిశుద్ధ భారత్ కల సాకారమవుతోందని.. ప్రజారోగ్యం మెరుగవుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లు నిర్మించడంతో నవజాత శిశు, పిల్లల మరణాలు భారీగా తగ్గాయని చెప్పారు. ఈ విషయాన్ని తాజాగా ఓ అధ్యయనం వెల్లడించిందని.. తనకు ఎంతో సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. 'ప్రజారోగ్యాన్ని కాపాడటంలో స్వచ్ఛ, సురక్షితమైన పారిశుద్ధ్యమే కీలకం. భారత్ ఇందులో ముందున్నందుకు సంతోషంగా ఉంది' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ కారణంగా భారత్‌లో శిశు మరణాలు తగ్గాయంటూ 'నేచర్' అనే బ్రిటిష్ జర్నల్ ప్రచురించిన కథనాన్ని ఆయన పంచుకున్నారు. అమెరికాలోని ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. 2014లో చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమం ద్వారా దేశమంతటా మరుగుదొడ్ల నిర్మాణం అనూహ్యంగా పెరిగిందని.. దీంతో ఏటా 60 వేల నుంచి 70 వేల నవజాత శిశు, పిల్లల మరణాలు తగ్గాయని వారు వెల్లడించారు. మెరుగైన పారిశుద్ధ్యంతో 5-30 శాతం వరకు పిల్లల మరణాలు రేటును తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు.

అఘాడీలో లుకలుకలు

- రాహుల్ సభకు ఉద్ధవ్ డుమ్మా

సాంగ్లి, సెప్టెంబరు 5, ఆంధ్రజ్యోతి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మహారాష్ట్ర పర్యటనలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాలకు శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాకరే డుమ్మా కొట్టారు. సాంగ్లిలో రాహుల్ నిర్వహించిన బహిరంగ సభకు కూడా ఉద్ధవ్ గైర్హాజరయ్యారు. ఒకరోజు పర్యటనలో భాగంగా రాహుల్ ఇటీవల కన్నుమూసిన నాందేడ్ ఎంపీ వసంత్ చవాన్ కుటుంబ సభ్యులను తొలుత పరామర్శించారు. ఆ తర్వాత సాంగ్లిలో మాజీ మంత్రి పతంగ్ రావ్ కదం విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సాంగ్లిలో నిర్వహించిన బహిరంగ సభలో రాహుల్ ప్రసంగించారు. సభకు ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ సహా పలువురు కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. అయితే కార్యక్రమానికి హాజరుకాలేనని గతవారమే ఉద్ధవ్ చెప్పారని పతంగ్ రావ్ కదం తనయుడు, కాంగ్రెస్ ఎమ్మెల్యే విశ్వజిత్ కదం చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల వేళ జరిగిన ఈ సభకు ఉద్ధవ్‌తో పాటు ఆయన పార్టీ నేతలెవ్వరూ హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. నవంబరు 2019 నుంచి 2022 జూన్ వరకూ శివసేన(యూబీ టీ), ఎన్సీపీ (ఎస్పీ), కాంగ్రెస్ సంయుక్తంగా మహావికాస్ అఘాడీగా ఏర్పడి మహారాష్ట్రలో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. మరోవైపు త్వరలో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో కూటమి తరఫున సీఎం అభ్యర్థి ఎవరనేది తేల్చాలని ఉద్ధవ్ పట్టుబడుతున్న నేపథ్యంలో ఆయన గైర్హాజరు చర్చనీయాంశమైంది.



న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవాల్లో పాల్గొన్న తెలుగు ప్రజలు

న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో తెలుగు సౌరభాలు

సాంస్కృతిక ఉత్సవాన్ని నిర్వహించిన టీఎల్‌సీఏ

న్యూయార్క్, సెప్టెంబరు 5: న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్స్ స్క్వేర్ తెలుగు సంప్రదాయాలు, సంస్కృతికి వేదికగా మారింది. ఉభయ తెలుగు రాష్ట్రాల సాంస్కృతిక వారసత్వం అమెరికా వాసులను ఆకట్టుకొంది. ఉత్తర అమెరికాలో గత 53 ఏళ్లుగా ఇండియన్-అమెరికన్ తెలుగు వారి వికాసానికి కృషి చేస్తున్న తెలుగు లిటరసీ అండ్ కల్చరల్ అసోసియేషన్ (టీఎల్‌సీఏ) సంస్థ వారాంతం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించింది. ఆ సంస్థ టైమ్స్ స్క్వేర్‌లో సాంస్కృతిక ఉత్సవాన్ని నిర్వహించడం ఇదే ప్రథమం. యువతీయువకులు, మహిళలు సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. కూచిపూడి నృత్యం, కలంకారీ చిత్రాలు, కలంకారీ దుస్తులు, శిల్పాలు సహా 35 రకాల ప్రదర్శనలు ఇందులో ఉన్నాయి. టైమ్స్ స్క్వేర్‌కు వచ్చిన వారంతా వీటిని తిలకించారు. రెండు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాలకు ప్రాతినిధ్యం ఉండేలా కార్యక్రమాన్ని రూపొందించారు. కొత్త తరం వారికి తెలుగు భాష, సంస్కృతులపై అవగాహన కలిగించేందుకే ఈ ఉత్సవాన్ని నిర్వహించినట్టు టీఎల్‌సీఏ అధ్యక్షుడు కిరణ్ రెడ్డి పర్వతాల చెప్పారు. న్యూయార్క్ సిటీ మేయర్ కార్యాలయంలోని అంతర్జాతీయ వ్యవహారాల విభాగం డిప్యూటీ కమిషనర్ దిలీప్ చౌహాన్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీఎల్‌సీఏ చేస్తున్న కృషిని అభినందించారు.

భారత్ మధ్యవర్తిత్వంతో శాంతి చర్చలకు సిద్ధం

- ఉక్రెయిన్‌తో యుద్ధంపై రష్యా అధినేత పుతిన్
- చర్చలకు తాను సిద్ధమేనని ప్రకటన



మాస్కో, సెప్టెంబరు 5: ఉక్రెయిన్‌పై రెండున్నరేళ్లుగా యుద్ధం చేస్తున్న రష్యా.. శాంతి చర్చల్లో భారత్ మధ్యవర్తిత్వం వహించగలదని అభిప్రాయపడింది. భారత్‌తోపాటు.. బ్రెజిల్, చైనాల వల్ల మధ్యవర్తిత్వం సాధ్యమవుతుందని పేర్కొంది. ఈ మేరకు రష్యా అధినేత పుతిన్ వ్లాదివాస్తోక్‌లో జరుగుతున్న తూర్పు ఆర్థిక ఫోరం సదస్సు సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఓ ఆంగ్ల పత్రిక విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. "యుద్ధం మొదలైన తొలి వారం తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో కుదిరిన ప్రాథమిక ఒప్పందాన్ని ఉక్రెయిన్ అమలు చేయలేదు. నిజానికి ఆ ఒప్పందంతో ఉక్రెయిన్ అధ్యక్షుడి ప్రతినిధి సంతృప్తి వ్యక్తం చేశాకే.. సంతకం చేశారు. అయితే.. అమెరికా, ఐరోపా ఒత్తిడి కారణంగా ఉక్రెయిన్ ఆ ఒప్పందాన్ని అమలు చేయడం లేదు. ఆ ఒప్పందం ఆధారంగానే భవిష్యత్ చర్చలుంటాయి. ఉక్రెయిన్‌తో చర్చలకు మేం సిద్ధంగానే ఉన్నాం. అయితే.. అసంబద్ధ డిమాండ్ల ఆధారంగా చర్చలు జరపలేం" అని పుతిన్ వివరించారు. క్రెమ్లిన్‌లో పుతిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ కూడా ఇలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేశారు. "శాంతి ప్రక్రియలో భారత్ కీలకం. భారత ప్రధాని మోదీ-పుతిన్ మధ్య నిర్మాణాత్మక, స్నేహపూర్వక సంబంధాలున్నాయి. మోదీకి రష్యా, ఉక్రెయిన్, అమెరికాతో సంబంధాలున్నాయి. భారత్ వల్ల శాంతి చర్చలు సాధ్యం" అని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికా ఎన్నికలపై పెస్కోవ్ మాట్లాడుతూ ట్రంప్‌తో పోలిస్తే కమలాహ్యారిస్‌ను అంచనావేయడం తేలికని పేర్కొన్నారు. పుతిన్ కూడా అమెరికా ఎన్నికల్లో కమలాహ్యారిస్‌కు మద్దతిస్తానని ప్రకటించారు. కాగా.. 2022 ఫిబ్రవరి 24న మొదలైన రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకకపోవడంతో.. ఇరువైపులా ప్రాణ, ఆస్తినష్టం జరుగుతూనే ఉంది. అయితే.. ఇదివరకే భారత ప్రధాని మోదీ అటు రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యి.. చర్చలే శాంతికి మార్గమని సూచించిన విషయం తెలిసిందే..!

ఇండియా అంటే ఇష్టం లేకుంటే ఇక్కడ వ్యాపారం వద్దు

వికీపీడియాను ఉద్దేశించి ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: భారతదేశ చట్టాలను అమలు చేయనందుకు ఆన్‌లైన్ ఉచిత విజ్ఞాన సరస్వం వికీపీడియాపై గురువారం ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. "మీకు భారత్ అంటే ఇష్టం లేకపోతే ఇక్కడ వ్యాపారం చేయకండి. మీ సైట్‌ను మూసివేయాలని ప్రభుత్వానికి చెబుతాం" అని వ్యాఖ్యానించింది. ఆ సంస్థకు కోర్టు ధిక్కరణ నోటీసు జారీ చేసింది. వికీపీడియాలో తమ సంస్థకు చెందిన సమాచారంలో తప్పులు ఉన్నాయని 'ఏఎన్ఐ' వార్తా సంస్థ అభ్యంతరం తెలిపింది. తమను 'ప్రభుత్వ ప్రచార పరికరం'గా అభివర్ణించడాన్ని తప్పుపట్టింది. ఇందుకు రూ.2 కోట్ల పరిహారం చెల్లించాలంటూ పరువు నష్టం దావా వేసింది. ఈ అభిప్రాయాన్ని ముగ్గురు పొందుపరిచారని, కానీ నిజానికి వారు ఆ సంస్థ ఎడిటర్లు కాదంటూ ఏఎన్ఐ కోర్టు దృష్టికి తెచ్చింది. వారి వివరాలు ఇవ్వాలని కోర్టు ఆదేశించినా ఇంత వరకు స్పందించలేదు. తమది భారత్‌కు చెందిన సంస్థ కాదని, అందువల్ల కొన్ని పత్రాలు అందకపోవడంతో తాము పూర్తి వివరాలు ఇవ్వలేకపోయామని వికీపీడియా తెలిపింది. ఈ వాదనతో ఏకీభవించని న్యాయమూర్తి జస్టిస్ నవీన్ చావ్లా వికీపీడియాపై ఘాటు వ్యాఖ్యలు చేస్తూ కోర్టు ధిక్కరణ నోటీసు జారీ చేశారు.

బుడమేరుకు ఆర్మీ బృందం

- గండ్లు పూడ్చేందుకు రాక
- జగన్ ప్రభుత్వం వాటిని వదిలేసింది
- ఆ గండ్ల నుంచే విజయవాడకు వరద
- 'ప్రకాశం'ను పటిష్ఠపర్చడంపై దృష్టి
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు



వరద బాధితులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బుడమేరు వాగుకు పడిన గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూడ్చడానికి ఆర్మీ బృందం వస్తున్నట్లు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గురువారం రాత్రి విజయవాడ కలెక్టరేట్ ఆవరణలో మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు తమ నైపుణ్యం జోడించడానికి ఆర్మీ నిపుణులు వస్తున్నారని తెలిపారు. 'బుడమేరు వరదను మళ్లించడానికి మేం గతంలో చేపట్టిన పనులను జగన్ ప్రభుత్వం 2020లో రద్దు చేసింది. ఆ వాగుకు పడిన గండ్లను పూడ్చకుండా వదిలివేసింది. దీంతో ఆ గండ్ల నుంచి వరద విజయవాడ నగరంపై పడింది. మామూలుగా బుడమేరుకు ఏడెనిమిది వేల క్యూసెక్కుల వరద వచ్చేది. కానీ రెండు రోజుల్లో అతి భారీగా నలభై సెంటీమీటర్ల వర్షం కురవడంతో ఏకంగా 30 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. ఇంత వర్షం కురవడం మామూలు విషయం కాదు. ఇటువంటి పరిణామాల్ని ఎలా ఎదుర్కోవాలో సాంకేతిక నిపుణులతో మాట్లాడుతున్నాం. పదిహేను లక్షల క్యూసెక్కుల వరదను కూడా తట్టుకొనేలా ప్రకాశం బ్యారేజీని ఎలా పటిష్ఠపర్చాలన్నది చర్చిస్తున్నాం' అని చంద్రబాబు వివరించారు.

కన్నీరు పెట్టిన ముఖ్యమంత్రి

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సీఎం చంద్రబాబు ఇక్కడి ప్రజల కష్టాలు చూసి తీవ్రంగా చలించిపోయారు. మధురానగర్, దేవీనగర్ తదితర వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న సమయంలో బాధితుల వేదన విని.. బాబు కన్నీటి పర్యంతమయ్యారు. ఇళ్లన్నీ నీళ్లలో నానుతుండటం.. విలువైన వస్తువులు ఎందుకూ పనికిరాకుండా రోడ్డుపై కొట్టుకు వచ్చి పడి ఉండటం చూసి ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్క కుటుంబాన్నీ తన కుటుంబంగా భావించి ఆదుకుంటానని వారికి భరోసా ఇచ్చారు.

బెజవాడకు మళ్లీ వర్షం టెన్షన్

అల్ప పీడనం ప్రభావంతో మళ్లీ వర్షాలు ఉంటాయని వాతావరణ నిపుణుల నుంచి వస్తున్న హెచ్చరికలు విజయవాడను భయపెడుతున్నాయి. విజయవాడ నగరంలో వరద నీరు వేగంగా తగ్గిపోతోంది. కొన్ని ప్రాంతా ల్లో మాత్రం ఇంకా మూడు, నాలుగు అడుగుల ఎత్తున నిలబడి ఉంది. గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి ఈ ప్రాంతాల్లో నీటి నిల్వ ఒక అడుగు పెరిగినట్లు గుర్తించారు. ఎగువన ఖమ్మం జిల్లాలో కూడా ఈ వర్షం భారీగా ఉంది. దీంతో మళ్లీ వరద వచ్చి విజయవాడను ఇబ్బంది పెడుతుందేమోనన్న ఆందోళన అధికార యంత్రాంగంలో కనిపిస్తోంది. బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన అల్ప పీడనం ప్రభావంతో రాబోయే మూడు రోజులు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

చంద్రబాబుకు తప్పిన పెనుముప్పు

విజయవాడ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పెను ప్రమాదం నుంచి త్రుటిలో బయటపడ్డారు. వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు గురువారం ఆయన విజయవాడలోని మధురానగర్, దేవీనగర్ ప్రాంతాలకు వెళ్లారు. దేవీనగర్ ప్రాంతంలో బుడమేరు ప్రవాహ ఉధృతిని పరిశీలించేందుకు అక్కడే ఉన్న రైల్వే బ్రిడ్జిపైకి ఎక్కారు. అయితే, సీఎం బ్రిడ్జిపై ఉన్న సమయంలోనే సింగిల్ ట్రాక్‌పైకి ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకువచ్చింది. ఈ విషయాన్ని ముందుగా గుర్తించలేకపోయిన అధికారులు.. రైలు శబ్దం వినిపించగానే హడలెత్తిపోయారు. ఆ వెంటనే హుటాహుటిన అప్రమత్తమై.. సీఎం చంద్రబాబును బ్రిడ్జికి ఉన్న ర్యాంపుపైకి తీసుకువచ్చారు. అక్కడే ఉన్న లైన్‌మెన్ ఎర్రజెండా చూపించడంతో రైలు డ్రైవర్ వేగాన్ని తగ్గించి ముందుకు సాగారు. అయితే, సీఎం నిలబడిన ప్రదేశానికి 3 అడుగుల దూరం నుంచి రైలు వెళ్లిపోయింది. ఆ తర్వాత భద్రతా సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

బిట్‌కాయిన్ పేరుతో దగా

- డాలర్లు పోగేయొచ్చని అమాయకులకు ఎర
- ఏజెంట్లుగా ఎక్సైజ్ ఎస్సై, సివిల్ కానిస్టేబుల్
- వందల మందిని చేర్పించిన ప్రభుత్వ టీచర్లు
- కోట్లలో పెట్టుబడులు పెట్టిన అమాయకులు
- నిర్మల్ జిల్లాలో భారీ దందా.. నిందితుల అరెస్ట్



నిర్మల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): చట్టబద్ధత లేని యూబిట్ కాయిన్ చైన్ వ్యాపారం కలకలం రేపుతోంది. ఇందులో నిర్మల్ జిల్లాకు చెందిన కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సూత్రధారులుగా వ్యవహరిస్తూ అమాయకులను బలి చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం అందిన ఫిర్యాదుల మేరకు నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ప్రత్యేక చొరవ తీసుకొని ఈ యూబిట్ కాయిన్ చైన్‌దందా గుట్టును రట్టు చేశారు. పలువురు ఏజెంట్లను అరెస్టు చేశారు. ఓ ఎక్సైజ్ ఎస్సైతో పాటు రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి, కానిస్టేబుల్ మరో ఇద్దరు టీచర్లు వందల మందిని ఈ దందాలో రూ.లక్షల పెట్టుబడులు పెట్టించారని విచారణలో తేలింది. గొలుసుకట్టు పద్ధతిలో ఈ దందాను కొనసాగిస్తున్నారు. మొదట రూ. 50వేల పెట్టుబడి పెట్టిన వారికి డాలర్లరూపంలో కాయిన్‌లు వస్తాయి. ఈ పెట్టుబడికి ప్రతీ నెల వడ్డీ రూపంలో వీరి ప్రత్యేక ఖాతాలో జమ అవుతున్నట్లు చూపుతున్నారు. దీంతో పాటు సభ్యులు మరో ఐదుగురిని చేర్పిస్తే వారికి మరింత ఆదాయం వస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఇలా పెద్ద సంఖ్యలో సభ్యులను చేర్పించిన వారికి యూబిట్ కాయిన్ సంస్థ స్టార్ రేటింగ్‌లు ప్రకటిస్తుండటం విశేషం. ఫైవ్ స్టార్ పొందిన వారు ఈ దందాలో సీనియర్లుగా చెలామణి అవుతూ జిల్లా అంతటా సభ్యులను చేర్పించారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్, కామారెడ్డి లాంటి పట్టణాల్లో కూడా వీరు నెట్‌వర్క్‌ను విస్తరించినట్లు చెబుతున్నారు. అయితే ఈ చైన్ దందాలో చివరకు ఎవరు చెల్లింపులు చేస్తారనే విషయంపై స్పష్టత లేకన్నా.. అమాయకులు రూ.లక్షలు పెట్టుబడి పెడుతున్నారు.

ఉద్యోగులను నమ్మి పెట్టుబడులు..

నిర్మల్ జిల్లాలోని కడెం మండలానికి చెందిన టీచర్లు, ఓ కానిస్టేబుల్‌తో పాటు నిర్మల్‌కు చెందిన ఓ ఎక్సైజ్ ఎస్‌ఐ ఈ దందాకు సూత్రధారులుగా ఉన్నట్లు తేలింది. ఫిర్యాదులు రావడంతో జిల్లా ఎస్పీ జానకీ షర్మిల సూత్రధారుల సెల్‌ఫోన్లు, ఆర్థిక కార్యకలాపాలపై నిఘా పెట్టారు. దీంతో గుట్టు రట్టయ్యింది. వీరితో పాటు మరో 40మంది టీచర్లు కూడా వందల మందిని సభ్యులుగా చేర్పించి వారిచేత రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టించారని తెలుస్తోంది. అయితే ఈ పెట్టుబడులన్నీ తిరిగి రావడం కష్టమేనని నిపుణులు పేర్కొంటున్నారు.

స్టేట్ సైబర్ క్రైం ఆరా..

నిర్మల్‌లో పెద్ద ఎత్తున కొనసాగుతున్న యూబిట్ కాయిన్ దందాపై రాష్ట్ర సైబర్ క్రైం పోలీసులు నిఘా పెట్టినట్లు సమాచారం. నిర్మల్ ఎస్పీ పంపిన నివేదిక ఆధారంగా సైబర్ క్రైం ఉన్నతాధికారులు కొద్ది రోజుల్లోనే రంగంలోకి దిగి ఈ దందాపై ఆరా తీయనున్నట్లు సమాచారం.

నందిగం సురేశ్ అరెస్టు

- టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో అదుపులోకి..
హైదరాబాద్‌లో పట్టుకుని మంగళగిరికి తరలింపు
- రెండు వారాల రిమాండ్.. గుంటూరు జైలుకు తరలింపు


నందిగం సురేష్‌ను గుంటూరు జైలుకు తరలిస్తున్న పోలీసులు

మంగళగిరి సిటీ: ఏపీలోని బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పారిపోయే యత్నంలో ఉన్న ఆయనను గురువారం హైదరాబాద్‌లో వెంబడించి మంగళగిరి రూరల్ పోలీసులు పట్టుకున్నారు. మంగళగిరి కోర్టులో హాజరు పర్చగా జడ్జి రెండువారాల పాటు రిమాండ్ విధించారు. దీంతో సురేశ్‌ను గుంటూరు జైలుకు తరలించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో నందిగం సురేశ్‌తో పాటు పలువురు వైసీపీ నేతలపై కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఇదే కేసులో సురేశ్‌ను అరెస్టు చేశారు. మరో వైసీపీ నేత, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని కూడా పోలీసులు అరెస్టు చేశారని తెలిసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ నందిగం సురేశ్, లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాశ్, తలశిల రఘురాం సహా 14 మంది వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిన వెంటనే, వారందరి అరెస్టు కోసం పోలీసులు బుధవారం రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. అరెస్టు భయంతో సురేశ్ సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేసుకుని హైదరాబాద్ వెళ్లిపోయారు. సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా బుధవారం రాత్రి ఆయన హైదరాబాద్‌లో ఉన్నట్టు పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. కాగా, ఇదే కేసులో నిందితులుగా ఉన్న మరో 68 మంది గుంటూరు జిల్లా కోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ ఇప్పటికే పూర్తయింది. శుక్రవారం జిల్లా కోర్టులో వారి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై కోర్టు తీర్పు వెల్లడించనుంది. మరోవైపు చంద్రబాబు ఇంటిపై జరిగిన దాడి కేసులో పరారీలో ఉన్న నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం.

ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

- నల్లగొండ జిల్లా చిట్యాల పొలాల్లో దింపిన పైలట్

చిట్యాల, సెప్టెంబరు 5: భారత వాయుసేనకు చెందిన హెలికాప్టర్ సాంకేతిక లోపంతో గురువారం నల్లగొండ జిల్లా చిట్యాల శివారులోని పొలాల్లో అత్యవసరంగా ల్యాండ్ అయింది. భారత వాయుసేనకు చెందిన చెందిన రెండు హెలికాప్టర్లు రెండు రోజుల క్రితం విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం అక్కడికి వెళ్లాయి. గురువారం విజయవాడ నుంచి హైదరాబాద్ హకీంపేటలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు తిరిగి బయలుదేరాయి. నల్లగొండ జిల్లా చిట్యాల శివారుకు సమీపానికి చేరుకున్న సమయంలో హెలికాప్టర్ ఇంజన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో పైలట్ చిట్యాల శివారులోని ఓ వ్యవసాయక్షేత్రంలో ల్యాండ్ చేశారు. ఆ సమయంలో హెలికాప్టర్‌లో ముగ్గురు సిబ్బంది ఉన్నారు.

గురుకుల పార్ట్ టైం టీచర్ల పోరుబాట !

- అర్ధాంతరంగా ఉద్యోగాల నుంచి తొలగింపుతో ఆందోళన

జగిత్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పని చేసిన పార్ట్ టైం టీచర్లు పోరుబాట పట్టారు. దాదాపు ఎనిమిదేళ్లుగా ఉపాధ్యాయులుగా పని చేస్తున్న తమను అర్ధాంతరంగా విధుల నుంచి తొలగించడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, మూడు నెలల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పార్ట్‌టైం టీచర్లుగా పని చేసిన వారు సుమారు 6,200 మంది ఉన్నారు. ఈ ఉపాధ్యాయులకు నెలకు రూ.18 వేలు వేతనంగా ఇస్తారు. అయితే, ముందస్తు సమాచారం లేకుండా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల మౌఖిక ఆదేశాలు జారీ చేసి పార్ట్‌టైం టీచర్లను ఇటీవల విధుల నుంచి తొలగించారు. ఇలా, విధుల నుంచి తప్పించడంపై పార్ట్‌టైం టీచర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయానికి నిరసనగా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పార్ట్ టైం ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

'మేడిగడ్డ అవినీతి' కేసు వచ్చే నెల 17కు వాయిదా

భూపాలపల్లి/కృష్ణకాలనీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ వద్ద నిర్మించిన లక్ష్మీబ్యారేజీ కుంగడానికి అవినీతే కారణమంటూ దాఖలైన ప్రైవేటు పిటిషన్ అక్టోబరు 17వ తేదీకి వాయిదా పడింది. భూపాలపల్లికి చెందిన సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి వేసిన ఈ పిటిషన్‌ను భూపాలపల్లి జిల్లా కోర్టు గురువారం విచారించింది. కేసులో ప్రతివాదులుగా పేర్కొన్న మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా ప్రాజెక్టు నిర్మాణ సంస్థల అధిపతులు, ఇంజనీర్లను సెప్టెంబరు 5న హాజరవ్వాలని పేర్కొంటూ గత నెల 3న కోర్టు సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే హరీశ్ తరఫున హుజూరాబాద్‌కు చెందిన ఓ మహిళా న్యాయవాది, మేఘా నిర్మాణ సంస్థ అధిపతి కృష్ణారెడ్డి తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది నర్సింహారెడ్డి హాజరయ్యారు. కేసులో వాదనల అనంతరం విచారణ వాయిదా వేయాలంటూ జిల్లా జడ్జి నారాయణబాబును వారు కోరడంతో.. ఆయన వాయిదా వేశారు. కాగా, మేడిగడ్డ బ్యారేజీ అవినీతి కేసులో రాజీ పడేది లేదని, న్యాయ పోరాటం కొనసాగిస్తానని పిటిషనర్ రాజలింగమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. రూ.35 వేల కోట్ల ప్రాజెక్టుకు రూ.లక్ష 35 వేల కోట్లకు వ్యయం పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని.. ఆ నిధులను మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావుతో పాటు ఆరుగురు అధికారుల నుంచి రికవరీ చేసే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.

కారుణ్య మరణమే శరణమా?

- 23 ఏళ్లుగా చికిత్సలేని జబ్బుతో బతుకీడుస్తున్నాను
- 70 ఏళ్ల నా తల్లికి ఇక భారం కాదల్చుకోలేదు
- ప్రభుత్వమే ఆదుకోవాలి.. లేదా చావనివ్వాలి
- నల్లగొండ జిల్లా చిట్యాల వాసి ఆవేదన


గోపాల్‌కు సపర్యలు చేస్తున్న తల్లి

నల్లగొండ, సెప్టెంబరు 5: ఆ తల్లి వయసు 70 ఏళ్లు! ఆమెకు 44 ఏళ్ల కుమారుడు! 23 ఏళ్లుగా! కండరాలు చచ్చుబడిపోయి.. కాళ్లు, చేతులు పనిచేయక పూర్తిగా మంచం పడితే.. పొద్దున ముఖం కడిగించడం మొదలు.. కాలకృత్యాలకు తీసుకెళ్లడం.. స్నానం చేయించడం.. అన్నం తినిపించడం.. అన్నీ అతడికి ఆ తల్లే చేస్తోంది! మస్క్యులర్ డిస్ట్రఫీ (కండరాల క్షీణత) అనే ఏమాత్రం నయం కాని జబ్బుతో ఆ కుమారుడు బాధపడుతున్నాడు. తల్లితో ఇక సేవలు చేయించుకోవడం తనకు ఇష్టం లేదని.. తనను ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం తనకు సాయంగా ఓ మనిషిని కేటాయించాలని.. లేదంటే కారుణ్య మరణానికి అనుమతించాలని వేడుకుంటున్నాడు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం జిల్లా మండలం నేరడ గ్రామానికి చెందిన జంపాల గోపాల్ పరిస్థితి ఇది. పంథొమ్మిదో యేట అతడు వ్యాధి బారిన పడటంతో శరీరంలో ఉన్న కండరాలన్నీ చచ్చుబడిపోయాయి. కుమారుడు స్వస్థత పొందుతాడనే ఆశతో తల్లి అంజమ్మ ఊర్లో ఉన్న మూడు గుంటల భూమిని విక్రయించింది. అప్పులూ చేసింది. తనకు, తన కుటుంబానికి సహాయం చేయడానికి పెద్ద మనసున్న దాతలెవరైనా ముందుకు రావాలని గోపాల్ వేడుకుంటున్నాడు. ఏపీలో అమలవుతున్న మాదిరిగా తనకు రూ.15వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. మంచానికే పరిమితమైన తనను తన కుటుంబాన్ని ఆదుకోవడం కోసం సాయం చేయాలని (ఫోన్ పే, గూగూల్ పే-8341175190/ కెనరా బ్యాంకు చిట్యాల బ్రాంచ్, అకౌంట్ నంబర్ 066510106036, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ సీఎన్ఆర్‌బీ 0000665) విజ్ఞప్తి చేస్తున్నాడు.

భద్రాద్రి జిల్లాలో.. మళ్లీ పేలిన తూటా

(మొదటి పేజీ తరువాయి)

డివిజన్ కమిటీ చెందిన ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఇద్దరు గ్రేహౌండ్స్ పోలీసులు-- వంశీ, సందీప్ సైతం ఎదురుకాల్పుల్లో గాయపడ్డారు. వీరిద్దరినీ భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ కాల్పుల నుంచి మాసయ్య అనే మావోయిస్టు దళ సభ్యుడు తప్పించుకున్నట్లు పోలీసులు తెలిపారు. అతణ్ని పట్టుకునేందుకు గ్రేహౌండ్స్ బలగాలు కూంబింగ్‌ను ముమ్మరం చేశాయి. "ఇరువర్గాల మధ్య గంట పాటు హోరాహోరీ కాల్పులు జరిగాయి. మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు ఆగిపోయాక.. గ్రేహౌండ్స్ దళాలు గాలింపు చేపట్టాయి. అక్కడ ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి" అని పోలీసులు వివరించారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ మణుగూరు డివిజన్ ఏరియా కార్యదర్శి, ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా రాయగూడెంకు చెందిన లచ్చన్న అలియాస్ కుంజా వీరయ్య ఛత్తీస్‌గఢ్‌లోని కంబాడుకు చెందిన ఆయన భార్య పూనెం తులసి, ఏపీలోని జగ్గారం గ్రామానికి చెందిన మణుగూరు ఏరియా దళ కమాండర్ రాము, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గంగాల్, దుర్గేశ్, కోసీ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఆరుగురిపై భారీగా రివార్డు ఉన్నట్లు చెప్పారు. ఘటనాస్థలి నుంచి రెండు ఏకే 47, ఒక ఎస్ఎల్ఆర్, ఒక 303 రైఫిల్, ఒక పిస్టల్, వీటి మేగజీన్లు, లైవ్ రౌండ్లు, కిట్‌బ్యాగులు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. స్పెషల్ పార్టీ పోలీసులకు అందిన సమాచారం మేరకు గ్రేహౌండ్స్ బలగాలు కూంబింగ్ ప్రారంభించినట్లు తెలుస్తోంది. కాగా.. తెల్లవారుజామునే హోరాహోరీ కాల్పులతో అడవి దద్దరిల్లింది. ఏజెన్సీ గ్రామాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఘటనాస్థలిని ఎస్పీ రోహిత్‌రాజ్, కొత్తగూడెం ఓఎస్డీ పంకజ్ పరితోష్ పరిశీలించారు. కరకగూడెం ప్రాంతంలో భారీగా పోలీసులు మోహరించారు. ఉదయం ఘటనను కవర్ చేసేందుకు వెళ్లిన మీడియాను పోలీసులు అడ్డుకున్నారు.



జగన్ అంతిమయాత్రలో బూటకపు ఎన్‌కౌంటర్ల ఫ్లెక్సీతో పౌరహక్కుల నేతలు

విప్లవ ద్రోహుల పనే: మావోయిస్టు పార్టీ

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రఘునాథ పాలెం ఎన్‌కౌంటర్ విప్లవ ద్రోహులు అందించిన సమాచారంతో జరిగిందని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ ఆరోపించింది. ఈ మేరకు ఆజాద్ పేరుతో గురువారం ఓ ప్రకటన విడుదలైంది. ఈ ఎన్‌కౌంటర్‌కు కాంగ్రెస్ పార్టీ బాధ్యత వహించాలని స్పష్టం చేసింది. ఈ ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఈ నెల 9న జిల్లా బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ప్రకటించింది.

జగన్‌ది కచ్చితంగా బూటకపు ఎన్‌కౌంటరే: ప్రజాసంఘాలు

కాజీపేట, సెప్టెంబరు 5: ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు నేత జగన్ అలియాస్ రణదేవ్ దాదా అంత్యక్రియలు గురువారం ఆయన స్వగ్రామమమైన హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెంలో పూర్తయ్యాయి. బంధువులు, గ్రామస్థులు, రాజకీయ, ప్రజా, పౌరహక్కుల నాయకులు, మావోయిస్టు సానుభూతిపరులు భారీగా తరలివచ్చి, ఏసోబుకు నివాళులర్పించారు. మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేశ్, దాస్యం వినయ్‌భాస్కర్, తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య కూడా టేగులగూడెం చేరుకుని ఏసోబుకు నివాళులర్పించారు. అంతిమయాత్రకు హాజరైన మాజీ మావోయిస్టు భారతక్క, మావోయిస్టు బంధుమిత్రుల కమిటీ సహాయ కార్యదర్శి శాంతక్క, పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, తెలంగాణ ప్రజాఫ్రంట్ జనగామ జిల్లా అధ్యక్షుడు పాకాల వెంకన్న మీడియాతో మాట్లాడారు. ఏసోబుది కచ్చితంగా బూటకపు ఎన్‌కౌంటరేనని, ఈ ఎన్‌కౌంటర్‌ను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తు

(మొదటి పేజీ తరువాయి)

గురుకులాలు, హాస్టళ్లు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు పూర్తి ఉచితంగా విద్యుత్తును సరఫరా చేయనుంది. రాష్ట్రంలో 30,200 ప్రభుత్వ పాఠశాలలు, 450 ప్రభుత్వ జూనియర్ కాళాశాలలు, 268 ఎస్సీ గురుకులాలు, 183 ఎస్టీ గురుకులాలు, 265 బీసీ గురుకులాలు, 204 మైనారిటీ గురుకులాలు, 26 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తును అందించాలన్న ప్రతిపాదన గత జూన్‌లో రాగా గురువారం ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్‌రాస్ ఉత్తర్వులిచ్చారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తు సరఫరా కోసం డిస్కమ్‌లు ప్రత్యేక వెబ్‌పోర్టల్‌ను రూపొందించనున్నాయి. ఈ పోర్టల్‌లో విద్యాసంస్థలు ఏ విభాగాధిపతి పరిధిలోకొస్తే ఆ విభాగాధిపతి ఆ పోర్టల్‌లోకి లాగిన్ అయి.. తమ శాఖ పరిధిలోని విద్యా సంస్థల వివరాలను వెబ్ పోర్టల్‌లో చేర్చాలి. విద్యాసంస్థల జాబితాను ఆయా శాఖల కార్యదర్శులు పోర్టల్‌లో ఆమోదించాలి. విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్తు సరఫరా చేసినా, ప్రతినెలా క్రమం తప్పకుండా మీటర్ రీడింగ్ తీసి సంబంధిత అధికారికి కరెంట్ బిల్లులు అందిస్తారు. ఆయా విద్యాసంస్థలు ఏ మేరకు కరెంట్‌ను వినియోగించాయి? వినియోగానికి సంబంధించిన సమగ్ర వివరాలు, చెల్లింపులు, బకాయిలు.. విద్యాసంస్థలు, మండలాలు, జిల్లాల వారీగా సంబంధిత శాఖలకు అందుబాటులో ఉంటాయి. డిస్కమ్‌లు తయారుచేసే పోర్టల్‌ను ఆర్థిక శాఖతో అనుసంధానం చేస్తారు. ఆర్థిక శాఖ ప్రతినెలా కేటాయింపులు చేస్తూ బడ్జెట్ విడుదల చేయనుంది. ఉచిత విద్యుత్తు దుర్వినియోగం కాకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది.



విద్యా సంస్థ	విభాగాధిపతి
ప్రభుత్వ పాఠశాలలు	పాఠశాల విద్యాశాఖ సంచాలకులు
జూనియర్ కళాశాలలు	ఇంటర్ బోర్డు డైరెక్టర్
డిగ్రీ/పీజీ కాలేజీలు	కళాశాల విద్యా కమిషనర్
ఐటీఐలు	ఉపాధి కల్పన, శిక్షణ శాఖ కమిషనర్
విశ్వవిద్యాలయాలు	ఉపకులపతులు
వైద్య కళాశాలలు	వైద్య విద్యాశాఖ డైరెక్టర్
పాలిటెక్నిక్ కళాశాలలు	సాంకేతిక విద్యాశాఖ కమిషనర్
బీసీ సంక్షేమ వసతి గృహాలు	బీసీ సంక్షేమశాఖ సంచాలకులు/కమిషనర్
బీసీ గురుకులాలు	బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ
ఎస్సీ హాస్టళ్లు	ఎస్సీ అభివృద్ధి శాఖ సంచాలకులు/కమిషనర్
ఎస్సీ గురుకులాలు	ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ
ఎస్టీ హాస్టళ్లు	గిరిజన సంక్షేమశాఖ కమిషనర్/సంచాలకులు
ఎస్టీ గురుకులాలు	ఎస్టీ గురుకుల విద్యాలయాల సంస్థ
మైనారిటీ గురుకులాలు	మైనారిటీ విద్యాలయాల సంస్థ

ఆదిమూలం.. వేధించారు!

(మొదటి పేజీ తరువాయి)

గురువారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆమె తన భర్తతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొన్ని ఫొటోలు, వీడియోలు, మొబైల్ కాల్ లిస్ట్ వంటి ఆధారాలను రిలీజ్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. "ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి ఆదిమూలం టీడీపీలో చేరారు. చంద్రబాబు ఆయనకు టికెట్ ఇచ్చారు. దీనిని నేను తీవ్రంగా వ్యతిరేకించా. అయినా బాబు ఆదేశాల మేరకు ఇతర నాయకులను కలుపుకొని ఆదిమూలంను గెలిపించాం. ఒకే పార్టీకి చెందిన వాళ్లం కావడంతో నా ఫోన్ నెంబర్ తీసుకున్నారు. అప్పటి నుంచి వేధించడం ప్రారంభించారు. రాత్రి సమయాల్లో ఫోన్లు చేసి.. తనతో గడపడానికి హోటల్‌కు రావాలని ఒత్తిడి చేసేవారు. పలుమార్లు తిరస్కరించా. దీంతో నన్నునా కుటుంబ సభ్యులను అంతుచూస్తానని బెదిరించారు. ఆయన వేధింపులు భరించలేక మాట్లాడదామనే ఉద్దేశంతో జూలై 6న తిరుపతిలోని ఓ హోటల్ గదికి వెళ్లా. అక్కడే నాపై ఆదిమూలం అత్యాచారం చేశారు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించారు. దీంతో గతిలేని పరిస్థితిలో ఆయనకు లొంగిపోవాల్సి వచ్చింది. అలా నాపై మూడుసార్లు లైంగిక దాడికి పాల్పడ్డారు. అర్ధరాత్రులు ఫోన్లు చేస్తుడడంతో నా భర్త గట్టిగా నిలదీశారు. దీంతో జరిగిన విషయం చెప్పా. నా భర్త సూచనతో పెన్‌కెమెరా పట్టుకుని హోటల్‌కు వెళ్లా. ఆ గదిలో పెన్ కెమెరాపెట్టి ఆదిమూలం బాగోతాన్ని రికార్డ్ చేశా" అని బాధితురాలు వివరించారు. ఆదిమూలం వేధింపులు పెరగడంతో ఆయనను దూరం పెట్టానని, విషయం మొత్తాన్నీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు వివరిస్తూ లేఖ రాసినట్టు చెప్పారు. తన వద్ద అన్ని సాక్ష్యాలూ ఉన్నాయని తెలిపారు. రోజుకో అమ్మాయితో ఆదిమూల ఎంజాయ్ చేసేవారని, ఇలా ఎంతోమందిని టార్చర్‌చేశారని బాధితురాలు ఆరోపించారు. ఆదిమూలం బారి నుంచి మహిళలను కాపాడాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. తనకు, తన కుటుంబానికి న్యాయం చేయాలని, లేకపోతే సామూహిక ఆత్మహత్యలే శరణ్యమని అన్నారు.

నాపై కుట్ర చేశారు: ఎమ్మెల్యే

మహిళా నాయకురాలి ఆరోపణలతో సత్యవేడు ఎమ్మెల్యే అజ్ఞాతంలోకి వెళ్లారు. ఓ చానెల్ ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడుతూ.. మార్ఫింగ్ చేసిన వీడియోలతో తనపై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. "నేను తప్పు చేయలేదు. నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా నిలబడిన రమేశ్‌బాబుతో పాటు పార్టీలోని మునుస్వామి యాదవ్, గిరిబాబు, బాలరాజు తదితర నాయకులు పన్నిన కుట్ర"అని అన్నారు.

ఆదిమూలంపై సస్పెన్షన్ వేటు

కోనేటి ఆదిమూలంపై సొంత పార్టీ తెలుగు మహిళా నేత చేసిన లైంగికవేధింపుల ఆరోపణల నేపథ్యంతో గంటల వ్యవధిలోనే టీడీపీ అధిష్ఠానం తీవ్రంగా స్పందించింది. ఆదిమూలంపై పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఈ వ్యవహారంపై పార్టీపరంగా విచారణకు కమిటీ వేసింది. కాగా, గురువారం సీఎం చంద్రబాబు విజయవాడలో వరదపై సమీక్ష జరుపుతున్నప్పుడు ఈ వ్యవహారం ఆయన దృష్టికి వచ్చింది. 'వీరిని ప్రజలు గెలిపించింది ఎందుకు? వీరు చేస్తోందేమిటి? వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయండి' అని సీఎం వ్యాఖ్యానించారు. ఆరోపణల తీవ్రత దృష్ట్యా వివరణ కోరాల్సిన అవసరం కూడా లేదన్నారు. దీంతో వెంటనే ఆదిమూలంపై సస్పెన్షన్ వేటు వేశారు.

జైనూరు ఘటన.. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ

పోలీసు ఉన్నతాధికారుల నిర్ణయం.. జైనూరులోనే అదనపు డీజీ, ఐజీ మకాం

- మరో 2 రోజులు ఇంటర్నెట్ బంద్, 144 సెక్షన్ కొనసాగింపు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఆసిఫాబాద్ జిల్లా జైనూరులో గిరిజన మహిళపై ఆటో డ్రైవర్ అత్యాచార యత్నం కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇప్పటికే నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. బాధితురాలికి గాంధీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కేసు తీవ్రత దృష్ట్యా డీఎస్పీ నేతృత్వంలోని ప్రత్యేక బృందం ఈ కేసును దర్యాప్తు చేస్తోంది. మరోవైపు, బుధవారం జైనూరులో ఇరు వర్గాల మధ్య ఘర్షణ నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అల్లర్లలో పాల్గొన్న ఇరు వర్గాల వ్యక్తులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. జైనూరుతోపాటు ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ మండలాల్లోనూ 144 సెక్షన్ విధించారు. పికెటింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. జైనూరు నుంచి ఆసిఫాబాద్, ఉట్నూరు వైపు ఎవరూ వెళ్లకుండా, జైనూరులో ఇళ్ల నుంచి బయటికి రాకుండా ఆంక్షలను విధించారు. సోషల్ మీడియాను కట్టడి చేసేందుకు మరో రెండు రోజులు ఇంటర్నెట్ సేవలు నిలిపివేయాలని నిర్ణయించారు. మరోవైపు.. అదనపు డీజీపీ (శాంతి, భద్రతలు) మహేశ్ భగవత్, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి జైనూర్‌లోనే మకాం వేశారు. మహేశ్ భగవత్ ఇరువర్గాల పెద్దలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఆదివాసీ మహిళపై దాడి జరగడం బాధాకరమని, ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని కోరారు.అల్లర్లలో జరిగిన ఆస్తి నష్టంపై నివేదిక అందించేందుకు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించినట్లు తెలిపారు. కాగా, జైనూరు ఘటనను నిరసిస్తూ కెరమెరి, వాంకిడి, సిర్పూర్(యు), తిర్యాణి మండలాల్లోనూ ఆదివాసీలు బంద్‌కు పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి, కాసిపేటలో నిరసన తెలిపారు. జైనూరు వెళ్లేందుకు యత్నించిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, సిర్పూరు ఎమ్మెల్యే హరీశ్‌బాబును పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు.


జైనూరు మార్గంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

మంత్రి సీతక్కతో బీజేపీ నేతల వాగ్వాదం

గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని మంత్రి సీతక్క రెండోసారి పరామర్శించేందుకు వచ్చారు. బాధితురాలి కుటుంబీకులతో మాట్లాడి.. వైద్యం, ఇతర ఖర్చుల నిమిత్తం రూ.లక్ష చెక్కును అందజేశారు. కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుతుందని, ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. మంత్రి తిరిగి వెళ్తున్న సమయంలో ఆమె కారును బీజేపీ మహిళా నేత శిల్పారెడ్డి, కార్యకర్తలు అడ్డుకునేందుకు ప్రయత్నించి వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు ఎంసీహెచ్ భవనం ముందు నుంచి మంత్రిని బయటికి పంపించారు. సీతక్క స్పందిస్తూ.. బీజేపీ నేతలు లేనిపోని ఆరోపణలు చేస్తూ, విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. జైనూరు ఘటన నిందితులను రక్షించేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం హేయమని ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ విమర్శించారు. జైనూరు ఘటనను విశ్వ హిందూపరిషత్ ఖండించింది. స్థానిక పోలీసు యంత్రాంగం నిందితులకే వత్తాసు పలకడం బాధాకరమని మండిపడింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సమస్య, నిర్మూలన

ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం నాడు జరిగిన 'ఎన్‌కౌంటర్'లో ఒక అగ్ర నేతతో సహా తొమ్మిదిమంది మావోయిస్టులు చనిపోయారు. దీనితో ఆ రాష్ట్రంలో ఈ సంవత్సరారంభం నుంచి జరుగుతున్న భద్రతా దళాల చర్యల్లో మరణించినవారి సంఖ్య 150 దాటింది. చాలా కాలం పాటు సాపేక్షంగా ప్రశాంతంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో కూడా ఈ మధ్య 'ఎన్‌కౌంటర్లు' తిరిగి ప్రారంభమయ్యాయి. గురువారం నాడు ఖమ్మం జిల్లాలో ఆరుగురు మావోయిస్టులు పోలీసు, భద్రతాదళాల కాల్పుల్లో చనిపోయారు. ఇవి రెండూ ఒక క్రమంలో జరిగిపోయిన సంఘటనలు మాత్రమే. ఈ సందర్భం నుంచి మొత్తం దృశ్యాన్ని చూడగలిగితే, సంక్షోభ తీవ్రత అర్థమవుతుంది. ఈ తొమ్మిదినెలల కాలంలో జరిగిన సంఘటనల్లో చనిపోతున్నవారిలో సాయుధులెందరో, నిరాయుధులెందరో, అమాయకులెందరో అన్న ప్రశ్నలు వినిపిస్తూనే ఉన్నాయి. అవకాశం దక్కినప్పుడు మావోయిస్టులు కూడా ప్రతిఘటన పేరుతో ఏదో హత్యాకాండకు పాల్పడతారు. హతులు ఎవరైనా, మరణ వార్తలు, ఛిద్రమైన మృతదేహాల ముఖచిత్రాలు ఎవరికీ ఆహ్లాదకరంగా, ఆహ్వానించదగినవిగా ఉండవు.

మావోయిస్టు 'సమస్య'ను 2026 నాటికి పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ మధ్య కూడా వాగ్దానమో, ఉద్ఘాటనో చేశారు. దేశంలో అశాంతి కలిగిస్తుందనుకుంటున్న ఒక అంశాన్ని చక్కబరచాలన్నది అమాత్యుడిగా ఆయన బాధ్యత కావచ్చు. కానీ, సమస్య అని చెబుతున్నదాన్ని సరిగా అర్థంచేసుకున్నారా లేదా అన్నది ప్రజలకు, సమాజానికి ముఖ్యం. ప్రభుత్వం, దాని ప్రతినిధులు ఒక క్లిష్ట పరిస్థితి కారణాలను సరిగా గుర్తించలేకపోతే, దానికి అనుసరించే పరిష్కార మార్గాలు కూడా పొరపాటువే అవుతాయి. ఒక్కోసారి, 'సమస్య' కంటె మించినవి అవుతాయి. రెండేళ్లు, మూడేళ్లు అని వ్యవధి విధించుకోవడం దాదాపు అరవై ఏళ్ల నుంచి భారతదేశపు హోంమంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు చేస్తూనే వచ్చారు. ఏ పరిస్థితీ అకారణంగా, అకస్మాత్తుగా జనించదు. కారణాలను వదిలివేసి, వాటి ప్రతిస్పందనలను నిర్మూలిస్తే, సమస్య కొనసాగుతూనే ఉంటుంది. నక్సలిజానికి కానీ, మావోయిజానికి కానీ, వ్యవస్థల వైఫల్యంలో, పాలనలలోని అప్రజాస్వామికతలలో, కొరతలలో సానుకూలతలు ఏర్పడ్డాయి. రాజ్యం, దాని రాజకీయ నాయకత్వం తమ స్వయంకృతాల వల్ల ఏర్పడిన సంక్షోభాన్ని చక్కదిద్దే పనిని భద్రతా యంత్రాంగానికి అప్పజెబుతున్నవి. ఫలితంగా హింస, ప్రతిహింస, మరింత హింస అనే చక్రం నిరంతరంగా కొనసాగుతూ వస్తున్నది.

ఘర్షణాత్మక వాతావరణం నిరంతరంగా కొనసాగడం, అందులో ప్రాణనష్టం జరగడం ప్రజాస్వామ్యాన్ని కోరుకునేవారిని తీవ్రంగా బాధిస్తుంది. బాధించాలి. కానీ, దేశవ్యాప్తంగా ప్రధాన రాజకీయ స్రవంతిలో ఈ పరిస్థితిపై ఒక మౌనం, నిశ్శబ్ద అంగీకారం నెలకొనడం బాధాకరం. ఆయుధధారులై, ప్రభుత్వంతో తలపడుతున్నవారు నిర్బంధచర్యలు ఎదుర్కొనడం అనివార్యమనుకున్నా, పెద్ద సంఖ్యలో అమాయక ఆదివాసులు సానుభూతిపరులుగా, ఆశ్రయదాతలుగా అనుమానితులై హతులవుతున్నారన్న వార్తలు కూడా భారతీయ పౌరసమాజాన్ని పెద్దగా కదలించలేకపోతున్నాయి. మావోయిస్టులను 'ఏరివేయడానికి' భద్రతా దళాలు అనుసరిస్తున్న పద్ధతుల గురించి కూడా ఆందోళనకరమైన వార్తలు వింటున్నాము. ప్రభుత్వాలకున్న కర్తవ్యాలేమైనా, వాటిని చట్టబద్ధంగా మాత్రమే నెరవేర్చాలి. నక్సల్ ప్రభావం ఉధృతమైన సమయాల్లో, అది శాంతిభద్రతల సమస్య మాత్రమే కాదంటూ అవసరార్థం సూక్తులు వల్లించే రాజకీయవాదులు, ఈ సమయంలో మాత్రం మౌనం వహించడం న్యాయం కాదు. కల్పించుకోవాలి. పారదర్శకత కోసం ప్రయత్నించాలి. ఉద్రిక్తతను ఉపశమింపజేసి సంప్రదింపుల అవకాశాలను అన్వేషించాలి. దేశంలో అనేకచోట్ల నిషిద్ధ బృందాలతో కేంద్రం చర్చలు జరుపుతున్నది. మావోయిస్టులతో కూడా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక సారి చర్చల ప్రయత్నం జరిగింది. యూపీఏ ప్రభుత్వ హయాంలో జాతీయస్థాయిలో కూడా స్వామి అగ్నివేశ్ ఆధ్వర్యంలో కొంత ఆలోచన సాగింది. ఎక్కడో జరుగుతున్న గాజా విధ్వంసం విషయంలో అయినా కలవరం వ్యక్తం చేయగలుగుతున్న పక్షాలు, మన దేశంలోనే, మన మధ్యనే ఒక ఆదివాసీ రాష్ట్రంలో జరుగుతున్న అవాంఛనీయ పరిణామాలను ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కాదు. మావోయిస్టులు కూడా భారతదేశంలోని సకలపక్షాలనూ ఉద్దేశించి, సంభాషించాలి. పరిస్థితిని మెరుగుపరచడానికి మార్గాలను అన్వేషించవలసిందిగా పౌరసమాజాన్ని గట్టిగా అభ్యర్థించాలి. కాల్పుల విరమణకు తమవైపు నుంచి చేయగలిగిన ప్రతిపాదనలను ప్రజల ముందు బహిరంగపరచాలి.


ఆదివాసీల గురించి గొప్పగా చెబుతారు. వారికి నాగరిక ఫలితాలు ముట్టజెప్పి, జనజీవన స్రవంతిలోను, ప్రధాన మతాలలోనూ కలుపుకోవాలని చూస్తారు. కానీ, వారికి ఉన్న సామాజిక, రాజకీయ పలుకుబడి అతి స్వల్పం. వారి ప్రాణాలకు పెద్ద విలువలేదు. వారికి అండగా తక్కిన సమాజం అంతా నిలబడితే గనుక, వారు మాత్రం నక్సలైట్ల వెనుక ఎందుకు సమీకృతులవుతారు? అన్ని రకాలుగా అణగారిపోయి, అప్రధానులైపోయిన ఆదివాసులను గుట్టుచప్పుడు కాకుండా బాధించడం సాధ్యపడితే, నాగరికత, సభ్యత, ప్రజాస్వామికత అంటూ గొప్పలు చెప్పుకోవడం ఎందుకు?

నిజాయితీకి నిలువెత్తు సంతకం

'అది ఒక దయ్యాలమేడ – శిధిల సమాజాల జాడ
మనుష్యులను పీక్కుతినే – రాబందుల రాచవాడ
ఎటుచూస్తే అటు చీకటి – ఎటుకన్నా శిధిలాలే'

నిజాం పరిపాలిత హైదరాబాద్ సంస్థానం ఒక చీకటిరాజ్యం. నిరంకుశమైన రాజరిక వ్యవస్థ. దుర్మార్గమైన భూస్వామ్య పాలనావ్యవస్థ. వెట్టిచాకిరి, నిరక్షరాస్యత, దుర్భర దారిద్ర్యం. ప్రజలకు వాక్, సభా, పత్రికా స్వాతంత్ర్యాలు నిషేధింపబడిన అప్రజాస్వామిక, ఆటవికరాజ్యం. మాతృభాషలో చదువుకునే అవకాశం లేదు. పరిపాలనా వ్యవస్థంతా ఉర్దూ భాషలోనే కొనసాగిన నిర్బంధ విధానం. వేలాది ఎకరాల భూమిపై ఆధిపత్యం గల జమీందార్లు, జాగీర్‌దార్లు, మక్తాదార్లు ఒకవైపు; సెంటు భూమి కూడా లేకుండా వెట్టిచాకిరి చేస్తూ, 'దొరా! కాల్మొక్త! గులాపోన్ని బాంచెన్!' అంటూ ప్రాణాలనూ, మానాలనూ అరచేతిలో పెట్టుకుని బతికిన సామాన్య ప్రజానీకం మరోవైపు.

ఇలాంటి చీకటిరాజ్యంలో నల్లగొండ జిల్లాలోని భువనగిరికి సమీపాన ఉన్న బొల్లేపల్లి గ్రామంలో 1908 జూన్ 4న భూస్వామ్య దంపతులైన వెంకట్రామమ్మ– రావి గోపాలరెడ్డిలకు పుట్టిన బిడ్డ నారాయణరెడ్డి. ప్రాథమిక, మాధ్యమిక విద్య స్వంత గ్రామంలో, భువనగిరిలో పూర్తిచేసుకున్న నారాయణరెడ్డి, హైదరాబాద్‌లోని నిజాం కళాశాల నుంచి ఇంటర్‌మీడియట్ ఉత్తీర్ణుడయ్యాడు. ఆ తరువాత చదువుకు స్వస్తి చెప్పి, సామాజిక, రాజకీయ ఉద్యమాల వైపు ఆకర్షితుడయ్యాడు. 'ఆంధ్రమహాసభ' వ్యవస్థాపకుల్లో ఒకడిగా సంస్థాన ప్రజల సాంస్కృతిక చైతన్యాన్ని మేల్కొల్పడం ప్రారంభించాడు. జాతీయోద్యమంలో గాంధీ సత్యాగ్రహం పంథాపట్ల ఆకర్షితుడై 1930లో తన 22వ ఏట హైదరాబాద్ సంస్థానంలో తొలిసారిగా సత్యాగ్రహ ఉద్యమాన్ని నిర్వహించాడు.



నిబద్ధ కమ్యూనిస్టు, నిరాడంబర మానవుడు రావి నారాయణరెడ్డి. దేశ ప్రజల సంపూర్ణ విశ్వాసాన్నీ, ప్రేమాభిమానాలనూ పొందిన ఉదాత్తనాయకుడు.

1941లో చిలుకూరులో జరిగిన ఆంధ్రమహాసభకు రావి నారాయణరెడ్డి అధ్యక్షత వహించాడు. 1944 నాటి భువనగిరి మహాసభల నాటికి ఆంధ్రమహాసభలో అతివాద యువకుల ప్రాబల్యం పెరిగింది. మహాసభ ప్రాంగణమంతా అరుణపతాకాలతో రెపరెపలాడింది. సహజంగానే ఆంధ్రమహాసభ తీర్మానాలలోనూ, కార్యక్రమాల రూపకల్పనలోనూ మార్పులొచ్చాయి. 1944 తర్వాత హైదరాబాద్ సంస్థానంలోని మారుమూల గ్రామాలకు సంఘం కార్యక్రమాలు విస్తరించాయి. ప్రజలు సంఘంగానూ, సంగంగానూ, గుత్పల సంఘంగానూ దీన్ని పరిగణించారు, ఆదరించారు, మమేకమయ్యారు. ఆంధ్రమహాసభలోనే అంతర్భాగంగా కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేయడంలో మిగతా వారితో పాటు రావి నారాయణరెడ్డి ప్రముఖపాత్ర వహించాడు.

ఈ నేపథ్యంలో 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం లభించింది. నిజాం నవాబు మాత్రం 'ఆజాద్ హైదరాబాద్' అన్నాడు. సంస్థానం ఒక స్వతంత్ర దేశంగా కొనసాగుతుందనీ, భారత్‌లోనో, పాకిస్తాన్‌లోనో విలీనం కాబోదనీ ప్రకటించాడు. సంస్థాన విముక్తికోసం ఆంధ్రమహాసభ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చింది. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్‌లు పోరాట ప్రకటనపై సంతకాలు చేశారు. సంస్థానం అట్టుడికిపోయింది. ప్రజలు చేతికి దొరికిన ఆయుధాలతో వీరాభిమన్యులై పోరాడారు. చరిత్రాత్మకమైన విమోచనోద్యమం ఇక్కడి ప్రజల ప్రతిఘటన చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. వేలాది గ్రామాలు విముక్తమయ్యాయి. భూస్వాములు ఊళ్లొదిలి హైదరాబాద్ నగరానికి పారిపోయారు. లక్షలాది ఎకరాల భూమి పేదప్రజలకు పంచారు. ఇదంతా ఒక ఉజ్వల ఇతిహాసం. ఈ మహోద్యమానికి నాయకత్వం వహించిన సేనాని రావి నారాయణరెడ్డి.

అరణ్య, అజ్ఞాతవాసాలు గడిపిన నారాయణరెడ్డిని ప్రభుత్వం అరెస్ట్ చేసి, జైల్లో పెట్టింది. సాయుధపోరాట విరమణ తర్వాత 1951 డిసెంబర్‌లో పెరోల్‌పై బయటికొచ్చిన రావి నారాయణరెడ్డి 1952లో జరిగిన సాధారణ ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గం నుంచి అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు. అప్పటి ప్రధానమంత్రి అభ్యర్థి నెహ్రూకి లభించిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు పొంది, ప్రజల ప్రీతిపాత్రుడిగా గౌరవ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయిన రావి నారాయణరెడ్డి శాసనవేదికలపై బలమైన గళాన్ని వినిపించాడు. 1967 తరువాత రాజకీయ పదవులకూ, పార్టీ పదవులకూ దూరంగా ఉంటూ కొత్త నాయకత్వాన్ని ఆహ్వానిస్తూ ఒక గొప్ప ఆదర్శాన్ని నెలకొల్పాడు.


నిరాడంబర జీవితం, నిబద్ధ కమ్యూనిస్టు వ్యక్తిత్వం, నిజాయితీకి నిలువెత్తు సంతకంగా బతికిన రావి నారాయణరెడ్డి, 1991 సెప్టెంబర్ 7న తుదిశ్వాస విడిచాడు. దేశ ప్రజల సంపూర్ణ విశ్వాసాన్నీ, ప్రేమాభిమానాలనూ పొందిన ఆ మహానాయకుడు నేడు మన మధ్య లేడు. కానీ ఆయన జ్ఞాపకాలు, ఆదర్శాలు, లక్ష్యాలున్నాయి. ఆయన కలలుగన్న సోషలిస్టు సమాజ నిర్మాణానికి పునరంకితం కావడమే ఆయనకు మనం అర్పించగల నిజమైన నివాళి.

● ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ

(రేపు రావి నారాయణరెడ్డి వర్ధంతి)

చిత్తశుద్ధి లేని 'శివ' పూజలేల?

దైవీకరణ రాజకీయాల (నాయకులను దైవసమానంగా ఆరాధించడం)లో దైవాంశ సంభూతులు ఉంటారు. మన మధ్య ఉన్నా లేదా కీర్తిశేషులు అయినా వారిని పల్లెత్తు మాట అనడానికి వీలులేదు. మరి ఆ నేతల స్మృతికి అపచారం జరిగితే సహించడమనే ప్రసక్తే లేదు. మన సువిశాల భారతదేశంలో ప్రతి రాష్ట్రంలోను ఆ బాల గోపాలం ఆరాధనకు పాత్రులవుతున్న మహాపురుషులు ఉన్నారు. ఎన్నటికీ వారి కీర్తికాంతులు మసకబారవు; యశోతేజస్సు వెలవెలబోదు. మహారాష్ట్ర అంటే మనకు గుర్తుకువచ్చేదెవరు? ఛత్రపతి శివాజీ. అవును, ఆయన మహారాష్ట్రీయుల మహోన్నత ఆరాధ్యవీరుడు. పరిపాలకుడుగా సైతం ఆయన వారికి ప్రాతఃస్మరణీయుడు.



మహారాష్ట్రలో ఈ ఏడాది ప్రథమార్ధంలో 500 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. గత పాతికేళ్లుగా ఆ రాష్ట్రంలో ఈ రైతు విషాదం పునరావృతమవుతూనే ఉంది. ఆ అభాగ్యుల పూర్వీకులే ఒకనాడు మహావీరుడు ఛత్రపతి శివాజీ సైనికులుగా ఆయన ఘన విజయాలకు బాసటగా నిలిచారు. మరి శివాజీ బృహత్ శిలా ప్రతిమలు ప్రతిష్ఠించడంకంటే నేటి రైతుల తలసరి ఆదాయాన్ని పెంచడమే ఆ మహోదాత్త నాయకుడి స్మృతిని సమున్నతంగా గౌరవించుకోవడం కాదూ? మహారాష్ట్ర పాలకవర్గాలు, నాయక గణాలు ఈ వాస్తవాన్ని ఎందుకు విస్మరిస్తున్నాయి?

సరే, నేనూ నా సొంత శివాజీ మహారాజ్ పాఠం నేర్చుకున్నాను. అది 1990ల నాటి మాట. ముంబై విమానాశ్రయానికి పునఃనామకరణం విషయమై ప్రజల్లో తర్జన భర్జనలు జరుగుతున్న సందర్భమది. భారత పౌర విమానయాన చరిత్ర పథనిర్దేశకుడు అయిన జెఆర్‌డి టాటాకు ఆ గౌరవం దక్కాలని నేను నా కాలమ్‌లో నొక్కి చెప్పాను. వెన్వెంటనే శివసేన నాపై విరుచుకుపడింది. ఆ పార్టీ అధికార పత్రిక నా ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఒక ఆగ్రహపూరిత సంపాదకీయం రాసింది. ముంబై విమానాశ్రయానికి మరాఠా విప్లవవీరుడి పేరిటే పునఃనామకరణం చేయాలని, ఆ గౌరవానికి మరెవ్వరి పేరునైనా పరిశీలించడం సైతం శివాజీ స్మృతికి అపచారం చేయడమే అవుతుందని తెగేసి చెప్పింది. నేను రాసిన వ్యాసాన్ని ఉపసంహరించుకోకపోతే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవలసివస్తుందని బెదిరిస్తూ మా కార్యాలయానికి ఫోన్ కాల్స్ వచ్చాయి.

మూడు దశాబ్దాల నాడు నేను నేర్చుకున్న పాఠం నేడు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని వెన్నాడుతోంది, ఇబ్బంది పెడుతోంది, చికాకుపరుస్తోంది. సింధు దుర్గ్‌లో కొత్తగా ప్రతిష్ఠించిన శివాజీ మహరాజ్ విగ్రహం ఇటీవల కూలిపోయింది. ప్రజలు కలతచెందారు. భావోద్రేకం బద్దలయింది. రాజకీయులు, ఊహించిన విధంగానే ప్రతిస్పందించారు. పాలక, ప్రతిపక్ష నేతలు పరస్పరం నిందించుకున్నారు. వాగ్యుద్ధాలకు దిగారు. శివాజీ విగ్రహం ఎందుకు కూలింది? మహారాష్ట్ర ప్రభుత్వం తొలుత ఆ పాపాన్ని భారత నావికాదళానికి అంటగట్టడానికి ప్రయత్నించింది. అయితే మరింత నష్టం జరగకముందే నేవీపై తన అభియోగాన్ని ఉపసంహరించుకున్నది. శివాజీ ప్రతిమ కూలిన చోటే మరో బృహత్ శివాజీ విగ్రహాన్ని నెలకొల్పుతామని ప్రజలకు వాగ్దానం చేసింది. విపక్షాలు సంయమనం పాటిస్తాయా? నిరసన ప్రదర్శనలను కొనసాగించాయి. విగ్రహ నిర్మాణంలో ప్రభుత్వం అవినీతికి పాల్పడడం వల్లే ఆ ప్రతిమా భంగం సంభవించిందని ఆరోపించాయి. మరి అసెంబ్లీ ఎన్నికలు ఆసన్నమైన తరుణమిది. కనుక విగ్రహ పతనం రాజకీయీకరణ కావడం అనివార్యం. ఈ భావోద్వేగ అంశం కాకపోతే మరేది రాజకీయ ప్రయోజనాలకు తోడ్పడుతుంది కనుక?

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2002 గుజరాత్ ఊచకోతల నాటి నుంచి నేటి దాకా ఎప్పుడైనా బహిరంగంగా క్షమాపణలు చెప్పడం మీరు విన్నారా? కన్నారా? సింధ్ దుర్గ్‌లో శివాజీ విగ్రహం కూలిపోయిన వైనంతో ఆయనకు మరో గత్యంతరం లేకపోయింది. ఆ సంఘటనపై ఆయన బహిరంగంగా విచారం వ్యక్తం చేశారు. అవును మరి, పోయిన డిసెంబర్‌లోనే కదా మహా ఆర్భాటాల మధ్య ఆయన ఆ బృహత్ విగ్రహాన్ని ఆవిష్కరించింది! అసలు ఆ శిలా శివాజీని తొలుత 6 అడుగుల నిడివిలో ఉంచాలని ఉద్దేశించారు. అయితే ఆకస్మికంగా అది 35 అడుగుల విగ్రహంగా రూపుదాల్చింది. ఆ బృహత్ విగ్రహ నిర్మాణానికి సరైన సామగ్రి ఉపయోగించారా? దర్యాప్తు జరిగితీరవలసిన విషయమిది. విగ్రహ నిర్మాణం వేగంగా జరిగింది. ఎందుకు? జాతీయ నాయకత్వాన్ని ఆకట్టుకోవాలనే ఆరాటమే సుమా! ఈ హడావుడిలో నిర్మాణ కార్యక్రమంపై సరైన పర్యవేక్షణను ఉపేక్షించారు. అవినీతి జరిగిందా? ప్రశ్న అనవసరం. సరైన దర్యాప్తే అసలు బాగోతాన్ని వెల్లడించగలదు.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

పరస్పర ఆరోపణలు, అభిశంసనల ఆవలకు దృష్టి సారించండి. మహా శక్తిమంతుడు అయిన మొగల్ చక్రవర్తిని ఎదిరించి నిలిచిన ఆ మహానాయకుడి శిలావిగ్రహం మట్టి బొమ్మలా కూలిపోయిన వైనంపై నిశితంగా ఆలోచించండి. మన పరిపాలనా పద్ధతి, మరీ ముఖ్యంగా రాజకీయ వ్యవస్థ ప్రాధాన్యతల గురించి ఆ కూలిన ప్రతిమ చెప్పుతున్నదేమిటి? మహారాష్ట్ర వ్యాప్తంగా, సువిశాల భారతావనిలో మరెన్నో చోట్ల చిన్న, పెద్ద శివాజీ విగ్రహాలు వేల సంఖ్యలో ఉన్నాయి. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ప్రతి పల్లె, పట్టణంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ఒక సాధారణ దృశ్యం. అలాగే మహారాష్ట్రలోని ప్రతి పట్టణంలోని ముఖ్య కూడలిలో అంబేడ్కర్ విగ్రహం మీకు తప్పక కనిపిస్తుంది. ఒక ఆరాధ్య నాయకుడి వారసత్వాన్ని స్వాయత్తం చేసుకునేందుకు ఆ గౌరవనీయుడి విగ్రహాన్ని నెలకొల్పడం లేక ఒక స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయడం పాలక పార్టీలకు ఒక సులభ మార్గమయిపోయింది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి అధికారానికి వచ్చినప్పుడు అంబేడ్కర్ విగ్రహాల ప్రతిష్ఠాపన, స్మారక చిహ్నాల ఏర్పాటు ఆమె ప్రభుత్వ ప్రధాన వ్యాపకంగా వర్ధిల్లింది. భక్తిప్రపత్తులతో బాబా సాహెబ్‌ను కొలిచే అభిమాన గణాలతో మమేకమవ్వాలని బహుజన్ సమాజ్ పార్టీ అభిలషించింది. అయితే ఆ మహా దేశభక్తుడు, ప్రజాస్వామ్య దార్శనికుడు జాతి జీవనంలో సుస్థిరపరిచిన రాజ్యాంగ విలువలు, సంప్రదాయాలను పాటించడాన్ని మాయావతి పార్టీ మరచిపోయింది.

మహారాష్ట్రలో సైతం శివాజీ మహరాజ్ బృహత్ విగ్రహాలను (పన్ను చెల్లింపుదారుల సొమ్ముతో) నిర్మించేందుకు నాయకులు ఒకరిని మించి మరొకరు పోటీ పడుతుండడం కద్దు. మరి అంతే జరూరుగా నాణ్యమైన పాఠశాలల ఏర్పాటు, సకల సదుపాయాలు ఉన్న ఆస్పత్రుల నిర్మాణ ఆవశ్యకత గురించి కనీస మాత్రంగానైనా ఆలోచించే నేతలు ఎంత మంది? ఉదాహరణకు ముంబై తీరరేఖకు దూరంగా అరేబియా సముద్రంలో శివాజీ మహరాజ్ స్మారక చిహ్నాన్ని నెలకొల్పాలని 2004లో నాటి కాంగ్రెస్– ఎన్‌సిపి సంకీర్ణ ప్రభుత్వం ప్రతిపాదించింది. తదాది ఎన్నో ప్రభుత్వాల ఉత్థానపతనాలు జరిగాయి. ప్రతి ప్రభుత్వమూ, న్యూయార్క్‌లోని స్టాట్యూ ఆఫ్ లిబర్టీకి దీటుగా ముంబైకి అభిముఖంగా అరేబియా సముద్రంలో శివాజీ స్మారక చిహ్నాన్ని నిర్మిస్తామని చెబుతూ వస్తోంది.

మహారాష్ట్ర ఆర్థిక సర్వే 2023–24 ప్రకారం రాష్ట్ర రుణభారం రూ.7 లక్షల కోట్లకు మించిపోయింది. ఆ అప్పులపై చెల్లిస్తున్న వడ్డీ రూ. 48,000 కోట్లకు పైగా ఉన్నది. మహారాష్ట్ర ఇప్పటికీ మన దేశంలో పారిశ్రామికాభివృద్ధిలో అగ్రగామి రాష్ట్రంగా ఉన్నది. జాతీయ దేశీయోత్పత్తికి అత్యధికంగా తోడ్పడుతున్నది కూడా మహారాష్ట్రే. అయితే వ్యవసాయ రంగంలో పురోగతి బాగా మందగించిపోయింది. గత ఏడాది రుతుపవనాలు దోబూచులాడడంతో పంటల దిగుబడులు పూర్తిగా దిగిసిల్లిపోయాయి. గ్రామీణ ప్రాంతాల ఆర్థికత పూర్తిగా కుదేలయిపోయింది. గ్రామీణుల దురవస్థలు మిక్కుటమయ్యాయి. ఫలితంగానే గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలలోని వెయ్యికి పైగా గ్రామాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించవలసిన అగత్యమేర్పడింది. రాష్ట్రంలో పలు భారీ నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం జరుగుతుండడంతో వాటి అంచనా నిర్మాణ వ్యయాలు బాగా పెరిగిపోయాయని డిసెంబర్ 2022లో కాగ్ నివేదిక ఒకటి వెల్లడించింది. 2024లో మొదటి ఆరు నెలల కాలంలో 500 మందికి పైగా రైతులు ఆత్మహత్యచేసుకున్నారు. గత పావు శతాబ్ది కాలంగా మహారాష్ట్రలో ఈ బలవన్మరణాల కథ పదే పదే పునరావృతమవుతూనే ఉంది.

చాలా కాలంగా ఉన్న వ్యవసాయక సంక్షోభానికి ఒక పరిష్కారాన్ని కనుగొనడానికి ఏ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది? ఇది సమాధానం లేని ప్రశ్నే. అన్నదాతల 'వ్యథలు' తొలగించడంపై దృష్టిని కేంద్రీకరించడం కంటే అరేబియా సముద్రంలో శివాజీ బృహత్ విగ్రహాన్ని నెలకొల్పుతామనే హామీ ఇవ్వడమే తేలిక కదా. తద్వారా పతాక శీర్షికలలో ఉంటూ ప్రజల మద్దతునూ పొందవచ్చు అనేది పాలక వర్గాల మనోగతంగా ఉన్నది. మరి పరిపాలనను చక్కదిద్ది దురవస్థల నుంచి రైతులను గట్టెక్కించేదెప్పుడు? ఈ అభాగ్య రైతుల ముత్తాతల ముత్తాతలే కాదూ మహాశక్తిమంతమైన మొగల్ చక్రవర్తి సేనలను ఛత్రపతి శివాజీ నేతృత్వంలో అరివీరభయంకరంగా ఎదుర్కొని విజయాలు సాధించి మరాఠా సామ్రాజ్యానికి పునాదులు వేసింది, శివాజీ మహరాజ్ శౌర్య సాహసాల ఘనతకు, పరిపాలనా దక్షతకు వెన్నుదన్నుగా నిలబడింది ఆ మట్టి మనుషులే కదా. మరి ఆ వీరుల వర్తమాన వారసుల తలసరి ఆదాయాన్ని పెంపొందించడానికి నేటి ప్రభుత్వాలు అంకితమవ్వడమే శివాజీ స్మృతిని సమున్నతంగా గౌరవించడమవుతుంది. అంతేగానీ ఆ మహా నాయకుడి పేరిట మరో స్మారకచిహ్నాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించడమనేది ప్రజా శ్రేయస్సుకు దోహదం చేసే పని ఎంతమాత్రం కాదు, కాబోదు.

శివాజీ విగ్రహం కూలిపోయినందుకు గుండెలు బాదుకుంటున్న రాజకీయవేత్తలను నేను ఒక ప్రశ్న అడగదలిచాను: రాజకీయ నైతికత, ప్రజా జీవితంలో విలువల పతనమవడం పట్ల కూడా మీరు పరితాపం చెందుతున్నారా? చెందనిపక్షంలో మన జాతి ఇతిహాసంలో ఒకే ఒక్కడు అయిన శివాజీ మహరాజ్‌కు నిజమైన వారసులమని చెప్పుకునే నైతిక అధికారం మీకు లేదుగాక లేదు.

తాజా కలం: శివాజీ మహరాజ్ విగ్రహ పతనం పట్ల ప్రధానమంత్రి సత్వరమే ప్రతి స్పందించి క్షమాపణలు చెప్పారు. అయితే ఆయనగానీ, మరే ఇతర సీనియర్ నాయకుడుగానీ ఇన్నాళ్లుగా అన్నదాతల ఆవేదనలో పాలుపంచుకున్నారా? అనేక సంవత్సరాలుగా పదే పదే సంభవిస్తున్న రైతన్నల ఆత్మహత్యలకు అనుతాపం చెందారా?

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్మరించుకుందాం

తెలంగాణ చరిత్రతోనూ, పోరాటంతోనూ సంబంధం లేని మతోన్మాదశక్తులు ఇవాళ తెలంగాణ చరిత్రకు మతం రంగును పులుముతున్నాయి. ప్రజలకు, ప్రజాపీడకులైన దొరలు, దేశ్‌ముఖ్‌లకు మధ్య జరిగిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ మతం రంగు అద్దుతున్నారు. తెలంగాణ సాయుధ పోరాట వాస్తవిక గాథ నేటి యువతరానికి తెలియాల్సి ఉంది. హైదరాబాద్ సంస్థానం ఏలుబడిలో ప్రజల మాతృభాషకు గౌరవం దక్కలేదు. ఉద్యోగాలు లేవు. భాషపట్ల వివక్ష కొనసాగింది. నిజాం తాబేదార్లకు ప్రజలు వెట్టిచాకిరీ చేయాల్సి వచ్చేది. వందల, వేల ఎకరాల భూములు ఆక్రమణకు గురయ్యాయి. మహిళలపై అఘాయిత్యాలు జరిగేవి. మాట వినకపోతే క్రూరమైన శిక్షలు విధించేవారు. ఈ కష్టాల కడలి నుంచి బయటపడాలని ఆలోచిస్తున్న క్రమంలో ఆంధ్రమహాసభ ఉద్యమం ప్రారంభమైంది. కమ్యూనిస్టు పార్టీ గ్రామాల్లో ప్రజలను సంఘటితం చేసి, భూస్వామ్య వ్యతిరేక పోరాటాన్ని నిర్మించింది. రైతుల పంటలను భూస్వాములు లాక్కుంటున్న తరుణంలో ప్రజలు తిరగబడ్డారు. చేతికి దొరికిన ఆయుధంతో దొరల గూండాలను తరిమికొట్టారు. అనంతరం 1947 సెప్టెంబర్ 11న కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చింది. ప్రజలు బందూకులు చేతబట్టి దొరలను గడగడలాడించారు. ఇలాంటి మహత్తరమైన సాయుధ పోరాట చరిత్రను అభాసుపాలు చేసి వక్రీకరించడం ద్వారా రాజకీయ లబ్ధిని పొందాలని చూస్తోంది బీజేపీ. ఈ మతోన్మాద శక్తులను ఓడించేందుకు జ్ఞానవంతమైన తెలంగాణ సమాజం ముందుకు రావాలి. హైదరాబాద్ నిర్మాత కులీ కుతుబ్ షా పుట్టుకే హిందూ ముస్లిం కలయిక. (కులీ కుతుబ్ షా తండ్రి ఇబ్రహీం కుతుబ్ షా, తల్లి భాగీరథి.) అలాంటి మత సామరస్య నేలలో మతం పేర చిచ్చులు రేపే వీరి మోసపూరితమైన కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలి. సెప్టెంబర్ 11–17 మధ్య తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్మరించుకుందాం. తెలంగాణను లౌకిక ప్రజాస్వామ్యం వైపు నడిపిద్దాం. ఈ ప్రచారోద్యమంలో లక్షలాదిగా భాగస్వాములుకండి.

– భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ), హైదరాబాద్ జిల్లా కౌన్సిల్

కుల గణన: పది పాక్షిక సత్యాలు

హంగేరియన్ సామాజిక శాస్త్రవేత్త, జ్ఞాన సామాజిక శాస్త్రానికి ఆద్యుడు అయిన కార్ల్ మ్యాన్‌హీమ్ (1893–1947) 'భావజాలం' అనే పదాన్ని ఒక ప్రత్యేకమైన అర్థంలో వాడుతుండేవారు. ఒక సమాజపు నిజమైన స్వభావాన్ని దాచిపెట్టే మిథ్యా విశ్వాసాలను 'భావజాలం' సూచిస్తుందని మ్యాన్‌హీమ్ అనేవారు. ఆయన ఆ పదానికి ఆపాదించిన అర్థం విస్తృత ప్రాచుర్యం పొందలేదు. అలాగే భావాలను వాటి సామాజిక ప్రాతిపదికలకు కుదించివేసేందుకు మ్యాన్‌హీమ్ సాగించిన కృషికి సైతం సహ సామాజిక శాస్త్రవేత్తలలో మినహా విశాల మేధో ప్రపంచంలో ఆమోదం, ఆదరణ లభించనేలేదు. భావజాలం గురించిన మాన్‌హీమ్ వ్యాఖ్యానానికి దృష్టాంతం కావాలా? కుల గణన (కులాల ప్రాతిపదికన జనాభా లెక్కలు) విషయమై ప్రస్తుతం మన సమాజంలో జరుగుతున్న చర్చే అందుకు సరైన ఉదాహరణ. ఉదారవాదులు, ప్రగతిశీల విద్యావంతులు అయిన భారతీయులతో కుల గణన విషయమై ఎప్పుడైనా చర్చించారా? నేను చాలాసార్లు చర్చించాను. ప్రతిసారీ దిగ్భ్రాంతిచెందాను, కలవరపడ్డాను. ప్రజల విశ్వాసాలను వారి యాదృచ్ఛిక సామాజిక మూలాలతో ముడిపెట్టే వైఖరులను నేను సుతరామూ ఇష్టపడను. వాటిని తీవ్రంగా వ్యతిరేకిస్తాను. అయితే కుల గణన అంశంపై సదరు గౌరవనీయులు తత్తరపాటుతో తమ అజ్ఞానాన్ని, అపోహలను బయటపెట్టుకోవడం, అహంకారాన్ని ప్రదర్శించడం నన్ను వ్యాకులపరిచింది. మన దేశంలో ప్రజాభిప్రాయాన్ని మలిచేవారు ఇప్పటికీ చాలవరకు అగ్రవర్ణాలవారే కదా అన్న వాస్తవాన్ని నేను జ్ఞాపకం చేసుకోవడాన్ని అనివార్యం చేసింది. కుల గణన పట్ల ఈ తరహా 'సైద్ధాంతిక' వ్యతిరేకత స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చే అనేక పాక్షిక విశ్వాసాలుగా పరిణమించింది. పాక్షికత! అవును, ప్రతి పాక్షిక అభిప్రాయంలోను రవంత సత్యం ఉన్నా సమాజ స్వతస్సిద్ధ స్వభావాన్ని మాటుపరిచే విధంగా ఆ మిథ్యా విశ్వాసాలు లోకంలో ప్రచలితమవుతున్నాయి. అవి అనేకమున్నాయని అన్నాను కదూ. అయితే వాటిలో పది మామూలు పాక్షిక సత్యాలను రేఖామాత్రంగా విశదీకరిస్తాను.

(1) 1931 అనంతరం భారత్ ఎన్నడూ కుల ప్రాతిపదికన జన గణన నిర్వహించలేదు. నిజమే. 1931 తరువాత జరిగిన జనాభా గణన ప్రక్రియలో గణకులు ప్రతీ వ్యక్తిని కులం గురించి ప్రశ్నించ లేదు. అయితే ఈ అపవాదు అనుచితమైనది. స్వతంత్ర భారత దేశంలో ప్రతి పదేళ్లకొకసారి నిర్వహిస్తున్న జనాభా గణనలో ప్రతిసారీ కులం ఏమిటని ప్రశ్నిస్తూనే ఉన్నారు. ప్రతిస్పందించిన పౌరుడు షెడ్యూల్డు కులాలకు చెందినవాడా లేక షెడ్యూల్డు తెగలకు చెందినవాడా అనే విషయాన్ని విధిగా నమోదు చేయడమూ జరుగుతోంది. అంతేకాదు ఎస్సీలలో ఏ నిర్దిష్ట ఉప కులం లేదా షెడ్యూల్డు తెగలలో ఏ నిర్దిష్ట ఉప తెగకు చెందినవారో కూడా స్పష్టంగా నమోదు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీల విద్యార్హతలు, ఆర్థిక స్థితిగతులపై ఆ ఉపకులాల/ తెగల నిర్దిష్ట వివరాల సమాచారం ఆధారంగానే అంచనాకు వస్తున్నారు.

(2) కుల గణన అనేది రాహుల్‌గాంధీ కొత్తగా చేస్తున్న

ఒక సమాజపు నిజమైన స్వభావాన్ని దాచిపెట్టే మిథ్యా విశ్వాసాలను 'భావజాలం' సూచిస్తుందన్న సామాజిక శాస్త్రవేత్త కార్ల్ మ్యాన్‌హీమ్ అభిప్రాయానికి, కుల గణన విషయమై ప్రస్తుతం మన సమాజంలో జరుగుతున్న చర్చే ఒక దృష్టాంతం. కులాల ప్రాతిపదికన జనాభా గణన పట్ల ఈ తరహా 'సైద్ధాంతిక' వ్యతిరేకత అనేక పాక్షిక విశ్వాసాలుగా పరిణమించింది. ప్రతి పాక్షిక అభిప్రాయంలోను రవంత సత్యం ఉన్నా సమాజ స్వతస్సిద్ధ స్వభావాన్ని మాటుపరిచే విధంగా ఆ మిథ్యా విశ్వాసాలు లోకంలో ప్రచలితమవుతున్నాయి.



(ఆమోదయోగ్యంకాని) డిమాండ్. వాస్తవమే. కుల గణన నిర్వహించి తీరాల్సిందేనని ఇటీవలి కాలంలో కాంగ్రెస్ పార్టీ వ్యక్తం చేస్తున్న రాజకీయ సంకల్పం చాల వరకు రాహుల్‌గాంధీ దృఢ విశ్వాసజనితమే. అయితే ఈ డిమాండ్‌లో కొత్త విషయం కానీ స్వార్థ ప్రయోజనాలు కానీ లేనేలేవు. కుల గణన నిర్వహించాలన్న సిఫారసు వాజపేయి ప్రభుత్వ కాలం నాటిది. సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ సెన్సస్ కమిషనర్, రిజిస్ట్రార్ జనరల్ ఆ సిఫారసు చేశారు. మే 2010లో లోక్‌సభ ఈ సిఫారసును సమగ్రంగా చర్చించి బీజేపీ సంపూర్ణ ఆమోదంతో దేశవ్యాప్తంగా జన గణనను నిర్వహించాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. 2018లో తదుపరి జనాభా గణనలో ఓబీసీ జనాభా లెక్కల సేకరణను కూడా చేర్చుతామని నాటి హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు. బిహార్‌లోని ఎన్డీఏ ప్రభుత్వంతో సహా సామాజిక న్యాయంపై పార్లమెంటరీ స్థాయీ సంఘం, ఇంకా నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ మొదలైన చట్టబద్ధ సంఘాలు కూడా అందుకు మద్దతు తెలిపాయి.

3) కుల గణన అనేది ఒక బృహత్తర కార్యం. దానివల్ల జనాభా లెక్కల సేకరణ జాప్యమవుతుంది. యథార్థమే. కులం ఏమిటి అన్న ప్రశ్నను సకల కులాలవారికి విధిగా వేయాలంటే ప్రస్తుతం జనాభా లెక్కల సేకరణకు అనుసరిస్తున్న అధికారిక నమూనాలో మార్పులు చేయవలసి వుంటుంది. అయితే ఇదేమీ పెద్ద పని కాదు.

(4) సిద్ధపరిచిన సమగ్ర కులాల జాబితా లేదు. అటువంటి జాబితాను రూపొందించడం అసాధ్యం. నిజమే. జనరల్ కేటగిరీకి చెందిన అన్ని కులాల, ఉప కులాల అధికారిక జాబితా లేదు. అయితే మన దేశ జనాభాలోని నాలుగింట మూడు వంతుల జనాభా– ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ– కు సంబంధించిన అటువంటి జాబితా సిద్ధంగా ఉన్నది. జనరల్ కేటగిరి విషయానికి వస్తే సంబంధిత పౌరుడు చెప్పిన కులం పేరును కచ్చితంగా నమోదు చేయాలి. భాష, మతం విషయంలో వలే అలా నమోదు చేసిన పేర్లను ఆయా కులాల వారీగా వర్గీకరించవచ్చు.

(5) ప్రతి కుల జనాభాలో ఎంత మంది వ్యక్తులు ఉన్నారో లెక్కించడమే కులగణన. సత్యం. కుల గణనలో వెల్లడైన వివరాలను ప్రచురించినప్పుడు అందరూ తొట్టతొలుత ఆసక్తి చూపేది ఆ విషయంపైనే అనడంలో సందేహం లేదు. అయితే కుల గణన నుంచి లభించేది అతి ముఖ్యమైన సమాచారం సంబంధిత కుల ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులు, విద్యార్హతలు. కులాల వారీగా స్త్రీ పురుషుల నిష్పత్తి, విద్యాస్థాయి, వృత్తి, ఎలాంటి గృహంలో నివసిస్తున్నారు, కుటుంబ ఆస్తులు, మంచినీరు, విద్యుత్, వంటగ్యాస్ సదుపాయాలు మొదలైన వాటికి సంబంధించిన సమాచారం అందుబాటులోకి వస్తుంది. కచ్చితమైన ఆధారాల ప్రాతిపదికన ప్రామాణిక సామాజిక విధానం రూపకల్పనకు అటువంటి సమాచారం తప్పనిసరి అని సుప్రీంకోర్టు నిర్దేశించింది.

(6) కుల గణనలో హిందూమతేతరులను మినహాయిస్తారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక కులాన్ని అనుసరించేలా కుల గణన నిర్బంధం చేస్తుంది. ఇదొక శుద్ధ అబద్ధం. ప్రతి మత సమూహంలోను కులాలు ఉన్నాయి. హిందూ, మతంలోనే కాకుండా ముస్లిం, క్రైస్తవ, సిక్కు మతాలలోనూ కులాలు ఉన్నాయి. బిహార్‌లో జరిగిన 'కుల గణన'లో ముస్లిం మతస్థులలో డజన్‌కు పైగా కులాలు ఉన్నట్టు వెల్లడయింది.

(7) ప్రస్తుత రిజర్వేషన్ కోటాలను మరింతగా పెంపొందించుకునేందుకే కుల గణనను డిమాండ్ చేస్తున్నారు. నిజం. కుల గణనను కోరుతున్నవారిలో అత్యధికుల ఉద్దేశం కూడా అదే. అందులో న్యాయవిరుద్ధమైనది ఏదీ లేదు. ఒక నిర్దిష్ట కుల జనాభా సంఖ్యకు అనుగుణంగా వనరులు, అవకాశాలలో ఆ కులస్తులకు తగు వాటా ఉందా, కొరవడిందా అనే విషయాన్ని కుల గణన ధ్రువీకరిస్తుంది. ఇతర విధానపరమైన విషయాలకు కూడా కుల గణన చాలా ముఖ్యం. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను సంబంధిత వర్గంలోని అన్ని కులాల వారికి సమానంగా విభజించాలా? ఓబీసీ కోటా నుంచి కొన్ని కులాలను మినహాయించాలా? ఎస్సీ ఎస్టీలలో సంపన్నశ్రేణిని పరిగణనలోకి తీసుకోవాలా? ఓబీసీలలో సంపన్న శ్రేణిని నిర్వచించడమెలా? 'అగ్ర కులాల'లో పేదరికం ఏ మేరకు ఉన్నది? సామాజిక అసమానతలను అర్థం చేసుకునేందుకు కులం అనేది ఒక కాలంచెల్లిన ప్రమాణమా? ఈ ప్రశ్నలకు సమాధానాలు కోరుతున్న రిజర్వేషన్ల వ్యతిరేకులు, అనుకూలురు అందరూ కులగణనను డిమాండ్ చేస్తున్నారు.



■ యోగేంద్ర యాదవ్

(8) ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కులగణన అవసరం కానీ జనరల్ కేటగిరీ కులాల వారికి అవసరం లేదు. వాస్తవమే. కుల వ్యవస్థ కాఠిన్యం, ప్రతికూలతలకు నష్టపోయిన కులాల వారికి వనరుల, ఆస్తుల, అవకాశాల అసమ పంపిణీ తీరుతెన్నులు, అది ఏ మేరకు జరుగుతోందో అర్థం చేసుకోవడమే కుల గణనకు ముఖ్యమైన ప్రేరణ. ఒక ప్రామాణికత (బెంచ్ మార్క్) లేకుండా ఈ ప్రతికూలతలు, నష్టాలను అంచనావేయలేము. అందుకు 'జనరల్' కేటగిరీ కులాల వారు పొందుతున్న సదుపాయాలను సంపూర్ణంగా పరిగణనలోకి తీసుకోవల్సి ఉన్నది. పౌరులు అందరికీ సమాన అవకాశాలు కల్పించాలన్న రాజ్యాంగ నిర్దేశాన్ని అమలుపరిచేందుకు సకల జీవన రంగాలలోని హిందూ అగ్రకులాల వారి ప్రత్యేక హక్కులు, సదుపాయాలను బహిర్గతపరచడం అత్యవసరం.

(9) కులతత్వ రాజకీయాలు పెచ్చరిల్లేందుకు, సామాజిక సంఘర్షణలు తీవ్రమయ్యేందుకు కులగణన దారితీస్తుంది. సత్యమే. అధికారిక రికార్డులలో కుల అస్తిత్వాన్ని నమోదు చేయడమంటే దాన్ని మరింత దృఢపరచడమే. అయితే దేశ జనాభాలో నాలుగింట మూడోవంతు మంది కుల అస్తిత్వాలు ఇప్పటికే అధికారిక రికార్డుల్లో నమోదయి ఉన్నాయన్న వాస్తవాన్ని మనం విస్మరించకూడదు.

(10) ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జరిగే జనాభా లెక్కల సేకరణలో కులాన్ని చేర్చడానికే కుల గణన పరిమితమవుతుంది. నిజమే. కుల గణన గురించి సామాన్య అవగాహన అది. అయితే కులాలవారీగా ఆస్తుల, సదుపాయాల, వనరుల, అవకాశాల, ప్రాతినిధ్యాల సమగ్ర జాబితాకు కులం ప్రశ్నను ఇతర సమాచార సేకరణ సంబంధిత సర్వేలలో కూడా చేర్చవలసి ఉంటుంది.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)




కాళోజీ కళాక్షేత్ర పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ప్రారంభానికి సిద్ధం చేయాలి

- కాళోజీ కళా క్షేత్రం పనులను పరిశీలించిన కలెక్టర్

బాలసముద్రం, సెప్టెంబరు 5: కాళోజీ కళాక్షేత్ర నిర్మాణ పనులను ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. గురువారం బాలసముద్రంలో నిర్మిస్తున్న కళాక్షేత్ర నిర్మాణ పనులను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, సంబంధిత అధికా రులతో కలిసి పనులు పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తి చేసిన పనులను అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి చెరువు చుట్టూ నిర్మాణాలు



చెరువులను చెరపట్టారు!

కబ్జా పర్వం- 2

- చెరిగిపోతున్న కాకతీయుల నాటి 'గొలుసుకట్టు' చరిత్ర
- నగరంలో 170కిపైగా చెరువులు, కుంటల భూముల అక్రమణ
- భద్రకాళి, కోటచెరువు, వడ్డెపల్లి, బంధం తటాకాలను ఆనుకుని 1,094 అక్రమ కట్టడాలు
- వేల కోట్ల విలువైన వందల ఎకరాలు హాంఫట్
- రియల్టర్లు, నేతల కనుసన్నల్లో యథేచ్ఛగా నిర్మాణాలు
- నగర శివారు గ్రామాల్లోనూ కబ్జా కోరుల కన్ను

170 — ఆక్రమణకు గురైన చెరువులు, కుంటలు

1094 — చెరువులు, కుంటలను ఆనుకుని నిర్మించిన అక్రమ కట్టడాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయుల కాలంలో వరంగల్ నగరంలో నిర్మించిన గొలుసుకట్టు చెరువుల చరిత్ర చెరిగిపోతుంది. కబ్జా కోరల్లో చిక్కి తల్లడిల్లుతున్నాయి. రియల్టర్లు, నేతల స్వార్థపూరిత ఆలోచనలకు తటాకాలు అవిరైపోతున్నాయి. వరంగల్ మహానగరంలో 170కి పైగా చెరువులు, కుంటలు ఉండగా, వీటిలో నగం మాయం కాగా, మిగిలి ఉన్న చెరువులు, కుంటల్లో దర్జాగా కబ్జాలు చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. నగరంలోని చారిత్రత్మక భద్రకాళి చెరువుతో పాటు బంధం చెరువు, వడ్డేపల్లి చెరువు, కోట చెరువుల్లోనే ఏకంగా 1,094 అక్రమ నిర్మాణాలను చేపట్టారు. ఇవే కాకుండా మిగతా చెరువుల, కుంటల్లో వందలాది ఎకరాల్లో వేలాది అక్రమ నిర్మాణాలతో వేల కోట్ల విలువైన భూముల్లో షాపింగ్ మాల్స్, ఫంక్షన్‌హాళ్లు, విద్యాసంస్థలు, అపార్ట్‌మెంట్లతో పాటు దర్జాగా వెంచర్లతో కబ్జారాయుళ్లు తిష్టవేశారు. ఇంతా జరుగుతున్న అధికారులు మాత్రం అక్రమాల వైపు కన్నెత్తి చూడకపోవడానికి ప్రధానకారణం నేతలు, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లే కారణమనే ప్రచారం జరుగుతోంది.

నగరంలో 170 చెరువులు, కుంటలు

కాకతీయరాజులు తమ పాలనలో వరంగల్ మహానగరంలో భారీగా గొలుసుకట్టు చెరువులు, కుంటలను ఏర్పాటు చేశారు. రాజధాని ప్రజలకు సాగు, తాగు నీటికి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ముందస్తుగా భారీగా జలాశయాలను తవ్వించారు. వరంగల్ నగరంలో ఇటీవల కాలంలో చుట్టు పక్కల గ్రామాలు విలీనం కావటంతో గ్రేటర్ వరంగల్ పరిధి మరింత పెరిగింది. గ్రేటర్ పరిధిలో 55 చెరువులు, 115కుంటలు, చిన్నచిన్న జలాశయాలున్నాయి. ఇవన్నీ కూడా నగరం విస్తరణ పరిసర ప్రాంతాల్లోనే ఉన్నాయి. చాలా చెరువుల కింద సాగు తగ్గి, వ్యవసాయేతర భూములుగా మారాయి. దీంతో చెరువుల శిఖం భూములు, చెరువుల కట్టల భూములపై కబ్జారాయుళ్ల కన్నుపడింది. ఎక్కడిక్కడ ఖాళీ జాగ కనిపిస్తే చాలు కబ్జాలు చేస్తు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు.

నగరంలోని చెరువుల్లో అక్రమాలు ఇలా..

చెరువు	అక్రమ నిర్మాణాలు	కూల్చి వేసినవి	నోటీసులు ఇచ్చినవి
భద్రకాళి చెరువు	249	108	91
చిన్నవడ్డేపల్లి చెరువు	329	08	110
బంధం చెరువు	366	07	125
కోట చెరువు	150	04	50
మొత్తం	1,094	127	376

చెరువు భూముల్లో దర్జాగా కబ్జాలు

నగరంలో భూములకు ధరలు పెరిగిపోవటంతో పాటు నగర నడిబొడ్డున నివాస యోగ్యమైన భూములు, వ్యాపారానికి అనుకూలమైన భూముల కొరత ఉండటంతో కబ్జారాయుళ్ల కళ్లు చెరువు భూములపై పడ్డాయి. ప్రధానంగా నగరంలో భద్రకాళి చెరువు 495.89ఎకరాల్లో విస్తరించింది. నగరం నడిబొడ్డున ఉండటంతో చెరువు నలుదిక్కుల ఖాళీ జాగా లేకుండా అక్రమించారు. 70ఎకరాల వరకు భూమి అక్రమణకు గురైందని ఫిర్యాదులు వస్తున్న అధికారులు దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ భద్రకాళి చెరువులో 249 అక్రమ కట్టడాలను నిర్మించారు. వందల కోట్ల విలువైన భూముల్లో అక్రమార్కులు పాగా వేశారని అధికారులు గుర్తించి, వీటిలో 108 అక్రమ కట్టడాలను ఇటీవల కూల్చి వేయగా, 91కట్టడాలకు నోటీసులు ఇచ్చారు. 28 అక్రమ కట్టడాలు చెరువులోనే మునిగిపోయాయి. అధికారులు గుర్తించని అక్రమ నిర్మాణాలతో పాటు మరికొన్నింటిపై రాజకీయ ఒత్తిళ్లు అధికంగా ఉండటంతో అధికారులు వెనుక్కి తగ్గారనే చర్చ జరుగుతుండగా,

మిగతా 8వ పేజీలో..

ఆక్రమణలపై మౌనమేల?

గ్రేటర్ వరంగల్ పరిధిలో చెరువుల, కుంటల శిఖం భూముల్లో తిష్ట వేసిన.. వేస్తున్న అక్రమా ర్కులకు అధికారులు నామ మాత్రంగా నోటీసు లు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలాల కబ్జాలతో పాటు చెరువు అక్రమ ణలపై కూడా అధికారు లది 'మౌనమే తమ మాట' అనే చందంగా ఉంద న్న ఆగ్రహం వ్యక్తమవుతోంది. బల్దియాలోని కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు కబ్జాకో రులకు సహకరించేలా వ్యవహరించటమే కాకుండా కోర్టుకు వెళ్లేలా ప్రోత్సాహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో టౌన్ ప్లానింగ్‌లో పని చేసి బదిలీపై వెళ్లిన ఓ అధికారి కనుసన్నుల్లో భారీగా అక్రమ కట్టడాలకు అనుమ తులు ఇచ్చారనే ప్రచారం జరుగుతుంది. నగరం లో వేల కోట్ల విలువైన భూములను కాపాడేందు కు నగర పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎంపీ, కలెక్టర్లు రంగంలోకి దిగితేనే కబ్జాల చెర నుంచి చెరువులకు విముక్తి కలుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



కాజీపేట బంధం చెరువు ఆనుకుని నిర్మించిన భవనాలు



వరంగల్ పరిధిలోని శాకరాసికుంట చుట్టూ పరిస్థితి..



వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 5: రేషన్ డీలర్లకు గౌరవం వేతనం ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు రేషన్ డీలర్లు గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బత్తుల రమేష్ బాబు మాట్లాడుతూ.. గోదాముల నుంచి ప్రతీ డీలర్‌కు కాంటా పెట్టి బియ్యం పంపిణీ చేయాలన్నారు. దుమ్ము, ధూళితో తరచూ అనారోగ్యం పాలవుతున్న రేషన్‌డీలర్ల కుటుంబాలకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని, బియ్య దిగుమతి చార్జీలు ప్రభుత్వమే భరించాలన్నారు. పండుగలను దృష్టిలో పెట్టుకుని రేషన్ డీలర్లకు ఏ నెల కమీషన్.. ఆ నెలలోనే విడుదలయ్యేటట్టు చూడాలని అదనపు కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా సివిల్ సప్లయి అధికారి పోలం ఉమారాణి, ఏఎస్‌వో కిష్టయ్యను కలిశారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని కలిసిన వారిలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలగాని మోహన్, జిల్లాలోని 14 మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ఉన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి

- గురుపూజోత్సవంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- జిల్లాలో 31 మందికి ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారం





గురుపూజోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారం పొందిన ఉపాధ్యాయులు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5: ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని నైపుణ్యాలను గుర్తించి అందుకు అనుగుణంగా వారికి బోధన చేస్తూ ప్రోత్సహించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సూచించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఎంపీ కావ్య.. ఆహుతులతో కలిసి ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అనంతరం డాక్టర్ కావ్య మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించేది ఉపాధ్యాయులేనన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారిని ఉన్నత శిఖరాలకు చేర్చాల్సిన బాధ్యతను గురువులే తీసుకోవాలని కోరారు. విద్యార్థులను సరైన మార్గంలో పెట్టాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధితో పాటు సమాజోద్ధరణ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్యాభివృద్ధి అవిరళ కృషి చేస్తున్నారన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విద్యారంగంలో జిల్లాను ముందంజలో ఉంచాలని, అందుకు ప్రభుత్వంతో పాటు స్థానిక ప్రజాప్రనిధులందరి సహకారం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు ఎంతోకాలం ఎదురుచూసిన బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించి టీచర్స్ ఫ్రెండ్లీ గవర్నమెంట్‌గా మారిందన్నారు.

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దుతారని, అందుకు తన జీవితమే ఉదాహరణగా చెప్పుకొచ్చారు. తాను డాక్టర్‌ను అవుతానని అనుకున్నానని, అయితే తనలోని నైపుణ్యాన్ని గుర్తించిన కొమురెల్లి అనే డ్రిల్లు మాస్టర్ తనను జాతీయస్థాయి హాకీ క్రీడాకారుడిగా తయారు చేశాడన్నారు. తన గురువును ప్రతీ నిత్యం గుర్తుంచుకుంటానన్నారు. అసెంబ్లీలో జీవో నెం.317 అంశాన్ని తానే లేవనెత్తానన్నారు. గత ప్రభుత్వం తప్పిదంతో కొంత మంది ఉపాధ్యాయులు ఆత్మహత్యలు చేసుకున్నారని, వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. విద్యార్థులను వ్యసనాలకు అలవాటు పడకుండా నైతికతతో కూడిన మానవీయ కోణంలో విద్యా బోధన చేయడానికి కృషి చేయాలన్నారు.

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడి నీడలోనే విద్యార్థి అభివృద్ధి పథంలో ఎదుగుతారన్నారు. సభావేదికపై ఉన్న వారంతా ఉపాధ్యాయులు మలిచినవారేనన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే కాకుండా మనందరిపై ఉందన్నారు. కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ.. విద్యాశాఖ జిల్లాకు ఉత్తమమైన సేవలను అందించాలన్నారు. డీఈవో దౌలాగర్ వాసంతి మాట్లాడుతూ.. జిల్లాలో విద్యారంగ అభివృద్ధిని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకుంటూ ప్రతీ సంక్షేమ పథకం ప్రభుత్వ పాఠశాలకు చేరే విధంగా తాము పాటుపడుతున్నామన్నారు. ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాను విద్యారంగంలో ముందువరుసలో ఉంచేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం 31మంది ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయుల సత్కారాలను ఆహూతుల చేతుల మీదుగా అందజేశారు. ప్రశంసాపత్రం, శాలువా, జ్ఞాపికతో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస, సెక్టోరల్ అధికారులు ఎ.శ్రీనివాస్, సునిత, ఎంఈవో రాంకిషన్ రాజు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన టేకులగూడెం

- ముగిసిన మావోయిస్టు నేత మాచర్ల ఏసోబు అంత్యక్రియలు
- అంతిమయాత్రకు హాజరైన ప్రజా, పౌర సంఘాల నాయకులు





అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు (ఇన్‌సెట్‌లో రోదిస్తున్న కుటుంబ సభ్యులు)

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట ధర్నా

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 5: జిల్లాలో పని చేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో హనుమకొండ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి, తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ గౌరవ అధ్యక్షుడు రాగుల రమేశ్ మాట్లాడుతూ.. 2023, 2024 లెప్రసీ డబ్బులు, పల్స్ పోలియో ఎన్‌డీడీ సర్వే చేసిన డబ్బులు ఇప్పటి వరకు ఆశాలకు ఇవ్వలేదన్నారు. మెడికల్ అండ్ హెల్త్ కమిషనర్ ఇప్పటికే పంపించామని చెబుతున్నా.. జిల్లా అధికారులు ఇవ్వకపోవడం సరైంది కాదని ఆయన విమర్శించారు. దేశవ్యాప్తంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు కె.పద్మ, సీహెచ్.రాజేశ్వరి, రజిత, కవిత, శ్రీవాణి, సూర్యకళ, కల్పన, రమాదేవి, సంధ్య, నవమణి, సుమలత, సునీత తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

బయ్యారం, సెప్టెంబరు 5 : వరద బాధితులకు గురువారం పోలీసులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని పట్టివాగు ప్రవాహంతో మొట్లతిమ్మాపురం గ్రామానికి వారం రోజులుగా రాకపోకలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీంతో ఎస్పీ ఎస్పీ సుధీర్‌రామ్ నాథ్ కేకన్ ఆదేశాలతో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి నేతృత్వంలో బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతితో పాటు పోలీస్ సిబ్బంది జేసీబీ వాహనం ద్వారా వాగుదాటి మొట్లతిమ్మాపురం గ్రామ ప్రజలకు నిత్యావసర సరుకులు, కురగాయలు పంపిణీ చేశారు. దాదాపు ఒక ట్రాక్టర్ నిండా సరుకులు తీసుకెళ్లి గ్రామ ప్రజలకు అందజేశారు. కొద్ది రోజులుగా తాము పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పోలీసులు సరుకులు పంపిణీ చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అనిల్, సతీష్, రజిని, కోటేశ్వర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బయ్యారంలో బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న పోలీసులు



వరంగల్ పోతననగర్‌లోని మోడ్రన్ దోబీఘాట్



వాషింగ్ మిషన్లు, ఐరన్ బాక్స్ టేబుళ్లు

మోడ్రన్ దోబీఘాట్‌పై పట్టింపేదీ?

- నిరుపయోగంగా పోతననగర్ దోబీఘాట్
- కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యం
- నిరుపయోగంగా విలువైన సామగ్రి
- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం
- నిర్వహణ బాధ్యతపై ఎటూ తేల్చని అధికారులు
- రజక సంఘాలకు అప్పగించాలని డిమాండ్



ల్యాండ్రోమార్ట్ పనులను ప్రారంభిస్తున్న కేటీఆర్, అధికారులు (ఫైల్)

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 5: అట్టహాసంగా ప్రారంభించిన వరంగల్ మోడ్రన్ దోబీఘాట్(ల్యాండ్రో మార్ట్) పది నెలలకే పనులకు నోచుకోకుండా పోయింది. పనులు మొత్తం పూర్తయినా బల్దియా, బీసీ వెల్ఫేర్ శాఖల మధ్య నెలకొన్న సమన్వయ లోపంతో ఎక్కడి పనులక్కడే అన్నట్టు విమర్శలు వస్తున్నాయి.

అధునాతన రీతిలో..

వరంగల్ పోతననగర్‌లో ఏర్పాటు చేసిన మోడ్రన్ దోబీఘాట్ అధునాతన సాంకేతికతతో రూపుదిద్దుకుంది. స్మార్ట్‌సిటీ నిధుల కింద ముందుగా రూ.1.10 కోట్లు మంజూరు చేయగా, తర్వాత మరో రూ.కోటితో షెడ్డుతో పాటు అక్కడ అన్ని సౌకర్యాలు, ప్రత్యేక పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. పోతననగర్‌లో ఏర్పాటు చేసిన మోడ్రన్ దోబీఘాట్‌కు ఇప్పటి వరకు రూ.2.50 కోట్ల వరకు ఖర్చు చేసినట్టు బల్దియా అధికారులు వెల్లడించారు. అందులో 30కిలోల వాషింగ్ మిషన్లు 9, 15కిలోల స్పిన్ మిషన్లు 9, 30కిలోల డ్రై మిషన్లు 12, 10 టేబుళ్లపై ఆర్వో స్ట్రీం వాటర్ టెక్నాలజీతో నడిచే 10 ఐరన్ బాక్సులతో పాటు పెద్ద పెద్ద టబ్బులు, కెమికల్ స్టోరేజ్ మిషన్లను ఏర్పాటు చేశారు. ఇంకా మోడ్రన్ దోబీ మిషన్లు, శారీ రోలింగ్ మిషన్లు, బెట్‌షీట్ ఏరన్ మిషన్లు ఏర్పాటు చేశారు. ఈ మిషన్ల ద్వారా డ్రైక్లీనింగ్, డ్రైవాష్, స్ట్రీం ఐరన్ వాష్, నార్మల్ వాష్, స్పిన్ వాష్, కెమికల్ వాష్, నాచురల్ వాష్‌ల పద్ధతిలో అన్ని రకాల బట్టలు శుభ్రం చేయవచ్చని తెలిపారు.

ఏకతాటిపైకి కుల సంఘం నాయకులు

వరంగల్ నగరంలో రజకుల అభివృద్ధి కోసం మోడ్రన్ దోబీఘాట్ ఏర్పాటు చేస్తున్నారని, ఇందులో రజకులైన ప్రతీ ఒక్కరు సభ్యులుగా ఉండవచ్చని ప్రజా ప్రతినిధులు, సంఘం నాయకులు తెలిపారు. ముందుగా ప్రాంతాల వారీగా ఉన్న రజక సంఘాల నాయకులను ఏక తాటిపైకి తెచ్చి తర్వాత వరంగల్ ట్రైసిటీస్ సమావేశం ఏర్పాటు చేశారు. సుమారు 500 నుంచి 600 మంది వరకు సభ్యులుగా చేర్చుకుని మడేలయ్య మోడ్రన్ దోబీఘాట్ సొసైటీగా ఏర్పడ్డారు. ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఒకరికొకరు చేరవేసుకుంటున్నారు. బస్వరాజు సారయ్యను సంఘానికి ముఖ్య సలహాదారుడిగా చేసుకుని, ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న సంఘాల నుంచి ఇద్దరు, ముగ్గురి చొప్పున తీసుకుని పెద్ద సంఘంగా ఏర్పడ్డారు. అయితే వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో నివసించే రజక కార్మికులు.. చేసిన పనికి తీసుకునే ధరలు విషయంలో కొంత వ్యత్యాసం ఉండడంతో కొందరు వెనక్కి తగ్గినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో అధికారులు సైతం ముందుకు రావడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా పక్కన పెడితే తక్కువ సమయంలో ఎక్కువ బట్టలు ఉతకడం, ఇస్త్రీ చేయడం, డ్రైక్లీనింగ్‌తో రజకులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అట్టహాసంగా..

2021లో వరంగల్ నగరంలో మోడ్రన్ దోబీఘాట్‌నే ఏర్పాటు చేసేందుకు సంఘం ప్రతినిధులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2022లో పనులు ప్రారంభమయ్యాయి. స్మార్ట్‌సిటీ ప్రత్యేక నిధులతో వరంగల్ పోతననగర్‌లో ల్యాండ్రో మార్ట్ (దోబీఘాట్) పనులు పూర్తి చేశారు. కాగా, పోతననగర్‌లోని దోబీఘాట్‌తో పాటు అలంకార్ జంక్షన్‌లో అభివృద్ధి పనులు, పాత సెంట్రల్ జైలు ముందు లైబ్రరీ, చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లను 2023 అక్టోబరు 6న అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. దోబీ కుల సంఘాల నాయకులు, కార్మికులను పిలిచి ఎక్స్‌పర్ట్స్ ట్రయల్ రన్ కూడా చేశారు. కానీ దోబీల ఆనందం ఎంతో సేపు ఉండలేకపోయింది. అదే రోజు వేసిన తాళం ఇప్పటికీ తెరుచుకోలేదు. బల్దియా, బీసీ వెల్ఫేర్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం కుల సంఘం నాయకులు నిర్లక్ష్యం చేయడం వల్లనే ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో రజకులకు ప్రత్యేక రుణాలు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి దోబీఘాట్ పనులు అప్పగించాలని సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఇంకా ప్రభుత్వ వసతి గృహాలు, ఆస్పత్రులు, స్కూళ్లు, రెస్టారెంట్ల బట్టలు కూడా కాంట్రాక్ట్ పద్ధతిలో ఇక్కడే ఉతికేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. రజకుల్లో చాలామంది పెద్ద పెద్ద చదువులు చదివిన వారు నిరుద్యోగులుగా ఉన్నారని ఇక్కడ సుమారు 200 మందికి రెండు షిఫ్టులలో పనికల్పించి ఉపాధి అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే సులువుగా విలువైన బట్టలు ఉతికే దోబీ ఘాట్ సామగ్రి శిథిలావస్థకు చేరుకుంటుందని రజక సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు లక్షల రూపాయలు సంపాదించి పెట్టే పరికరాలు తుప్పుపట్టి పనికి రాకుండా పోయే పరిస్థితి ఉందని,. బల్దియా అధికారులు బీసీ వెల్ఫేర్ అధికారులను పిలిచి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని రజక సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని యువకుడి ఆత్మహత్య

తొర్రూరు, సెప్టెంబరు 5 : భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం తొర్రూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... దంతాలపల్లి మండలం గున్నెపల్లికి చెందిన ఎస్.కె. షరీఫ్(28) తొర్రూరులో వెల్డింగ్ షాపులో కూలీ పనిచేస్తూ నివసిస్తున్నాడు. అతడికి ఇద్దరు కుమార్తెలు. మద్యానికి బానిసై తిరుగుతుండడంతో పది రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోగా మనస్థాపానికి గురై ఉరివేసుకొని చనిపోయాడు. తండ్రి జానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ట్రాక్టర్ డ్రైవర్..

డోర్నకల్, సెప్టెంబరు 5 : పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన డోర్నకల్ మండలం తోడేళ్లగూడెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం. తోడేళ్లగూడెంకు చెందిన దండుగుల వెంకన్న (45) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంత కాలంగా వెంకన్న మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఆయన భార్య ఎల్లమ్మ ఈనెల 4న అతన్ని మందలించడంతో ఇరువురి మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన వెంకన్న పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకన్న మృతి చెందాడు. మృతుడికి భార్య ఎల్లమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని తండ్రి నాగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానుకోట పట్టణంలో భారీ చోరీ

- 12 తులాల బంగారం, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.2లక్షల నగదు అపహరించిన దుండగులు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 5: జిల్లాకేంద్రంలో బుధవారం భారీ చోరీ జరిగి 12 తులాల బంగారం, 80 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.2 లక్షల నగదు గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయిన సంఘటన చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ పట్టణం శివారు కంకరమిల్లు సమీపంలో కాలనీకి చెందిన కాసోజు బ్రహ్మచారి పురోహితుడిగా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు చెప్పారు. తన భార్య అశ్వినికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో చికిత్స నిమిత్తం గత శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లానని, వర్షాలు రావడంతో మహబూబాబాద్‌కు రాకపోకలు బంద్ కావడంతో హైదరాబాద్‌లోనే ఉన్నట్లు చెప్పారు. బుధవారం సాయంత్రం తనభార్య అశ్విని తీసుకుని ఇంటికి వచ్చానని ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూసినట్లు చెప్పారు. బీరువాలో ఉన్న 12 తులాల బంగారం, 80 తులాల వెండి అభరణాలతో పాటు రూ.2. లక్షల నగదు కన్పించకపోవడంతో ఈ విషయాన్ని వెంటనే టౌన్ పోలీసులకు సమాచారం అందించినట్లు చెప్పారు. ఘటన స్థలానికి క్లూజ్‌టీం సభ్యులు చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఆపై వేలిముద్రలను సేకరించారు. ఈ విషయంపై బాధితుడు బ్రహ్మచారి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

జీవంజి దీప్తి తొలి గురువు కన్నుమూత

- ఆమెలోని క్రీడాకారిణిని గుర్తించిన వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు (ఫైల్)

పర్వతగిరి, సెప్టెంబరు 5: పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జీవంజి దీప్తి తొలి గురువు అయిన బియ్యాని వెంకటేశ్వర్లు(55) అనారోగ్యంతో బుధవారం రాత్రి కన్నుమూశారు. రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్వతగిరి మండలం కల్లెడలో నిర్వహిస్తున్న పాఠశాలలో 2000 సంవత్సరం నుంచి 2018 వరకు వ్యాయామ ఉపాధ్యాయుడిగా సేవలందించారు. ఆ సమయంలో పాఠశాల విద్యనభ్యసిస్తున్న దీప్తిలో దాగి ఉన్న క్రీడాకారిణిని గుర్తించిన వెంకటేశ్వర్లు ప్రత్యేక శిక్షణనిచ్చారు. పాఠశాల, కళాశాలస్థాయిల్లో ఆయన ఇచ్చిన శిక్షణతోనే దీప్తి పలు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించింది. అనంతరం సాయ్ అకాడమీలో శిక్షణ పొందింది. కాగా, పీఈటీ వెంకటేశ్వర్లు నాలుగేళ్లుగా పక్షవాతంతో బాధపడుతూ తన స్వగ్రామమైన బయ్యారం మండలంలోని ఇర్సులాపురంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యం విషమించి బుధవారం రాత్రి మృతిచెందారు.

కదిలిస్తున్న దీప్తి మాటలు



వెంకటేశ్వర్లుతో దీప్తి (ఫైల్)

ఇటీవల ఒక టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీప్తి తన మొదటి కోచ్ అయిన వెంకటేశ్వర్లు గురించి ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. 'వెంకటేశ్వర్లు సార్‌ది నిరుపేద కుటుంబం. నాలోని ప్రతిభను గుర్తించి ఆయన ఇచ్చిన ప్రత్యేక శిక్షణ నేను పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించగలిగా. ఒలింపిక్స్‌లో పాల్గొని మెడల్ సాధించిన తరువాత అది కళ్లారా చూసి చనిపోతానని సార్ అనేవారు' అంటూ దీప్తి ఆ ఇంటర్వ్యూలో తెలిపింది. కానీ యాధృచ్ఛికంగా నిజంగా ఆయన గతంలో దీప్తితో అన్నమాటలే నిజయమ్యాయి. దీప్తి పారాలింపిక్స్‌లో కాంస్యం గెలుచుకున్న మరుసటి రోజునే ఆయన కన్నుమూశారు. ఈ నేపథ్యంలో దీప్తి ఓ చానల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఈ వీడియో చూసి పలువురు కన్నీటి పర్యంతమవుతున్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల స్వీకరణ





ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి, కొంక అనురాధ, జి.వెంకటయ్య

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5: వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి రాష్ట్ర స్థాయి పలువురు ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు స్వీకరించారు. హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో కొంక అనురాధ, పి.సంపత్‌కుమార్, జి.వెంకటయ్య, డాక్టర్ ఎల్. కొమురారెడ్డి తదితరులు గురువారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులను స్వీకరించారు.



డాక్టర్ ఎల్.కొమురారెడ్డి

రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న వెంకట్రామిరెడ్డి, వాసం శ్రీనివాస్



పి.సంపత్‌కుమార్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మాజీ ఎంపీ కే. కేశవరావు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖా ధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ వాసం శ్రీనివాస్

హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడు డాక్టర్ వాసం శ్రీనివాస్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును గురువారం అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మాత్యు లు పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఇతర ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు.

మట్కా నిర్వాహకుడిపై కేసు నమోదు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 5: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్‌లో మట్కా నిర్వహిస్తున్న బండి రాజు నివాసంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ.32 వేలు స్వాధీనం చేసుకున్నారు. చిరువ్యాపారులను మోసం చేసి బెట్టింగ్ నిర్వహిస్తున్న బండి రాజును విచారణ నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు. మిల్స్‌కాలనీ పోలీసులు రాజుపై కేసు నమోదు చేసారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ ధృవీకరించారు.

వైన్‌షాపులో చోరీ

ధర్మసాగర్, సెప్టెంబరు 5: ధర్మసాగర్ మండల కేంద్రంలోని వైన్స్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం చోరీకి పాల్పడ్డారు. సిబ్బంది కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని శివ బాలాజీ వైన్స్‌షాపులో గురువారం తెల్లవారుజామున షాపునకు సంబంధించిన కిటికీలకు అమర్చిన గ్రిల్స్‌ను గడ్డపారల సహాయంతో దొంగలు తొలగించారు. ఆ తర్వాత షాపులోకి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.85,500తో పాటు రూ.2వేల విలువైన మద్యాన్ని అపహరించారు. షాపు యాజమాని శ్యాంసుందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విషజ్వరంతో యువకుడి మృతి



విజయ్ (ఫైల్)

కొత్తగూడ, సెప్టెంబరు 5: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని గాంధీనగర్‌కు చెందిన ఓ యువకుడు విషజ్వరంతో గురువారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ గ్రామానికి చెందిన మల్లెల విజయ్ (30) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. గురువారం ఆయనకు జ్వరం తీవ్రత ఎక్కువ కావడంతో వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ విజయ్ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య స్వర్ణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, విజయ్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

వరహాల గుట్టకు మహర్దశ

- ములుగు జిల్లాలో మరో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి
- కాకతీయుల కాలం నాటి కట్టడాల గుర్తింపు
- త్వరలో గుట్టపై 40 గుడారాలు.. క్రాఫ్ట్ ఫైర్ ఏర్పాటు
- రామప్ప సరస్సుకు కూతవేటు దూరంలో కొత్త శోభ



వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 5: కాకతీయుల కాలంనాటి రహస్య గుట్ట.. అక్కడ వజ్ర వైడూర్యాలు ఉన్నాయా? లేదంటే కాకతీయుల కాలంనాటి రహస్య స్థావరం ఉందా? రాజులుదాచిన ఖజానా ఏమైనా ఉందా? అనే ప్రశ్నలతో పాటు మేడారం సమ్మక్క-సారలమ్మలతో యుద్ధం జరిగిన సమయంలో కాకతీయ రాజులు ఇక్కడే సేద తీరినట్లు చెబుతుంటారు. ఇలా ఎన్నో అంతుచిక్కని ప్రశ్నలు దశాబ్దాలుగా ఆ గుట్టచుట్టు తిరుగుతూనే ఉన్నాయి. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప సరస్సుకు కూతవేటు దూరంలో కనిపించే ఆ కొండపైకి ఎక్కడానికి ఈ తరం వారెవరూ అంతగా ఆసక్తి చూపరు. కానీ పైకి ఎక్కిచూస్తే చుట్టుపక్కల గ్రామాలన్నీ కనిపిస్తాయని చరిత్రకారులు చెబుతున్నారు. కాకతీయుల కాలంలో ఎడ్లబండ్లపై గుట్టపైకి వెళ్లినట్టు ఇటీవల గుర్తించిన పలు ఆనవాళ్ల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం ఆ గుట్టపైకి ఎక్కాలంటే నడవాల్సిందే. కాకతీయుల కాలంలో రామప్ప సరస్సు ఆయకట్టు కింద కాకతీయ రాజులు తాము పండించిన ధాన్యం బందిపోట్లు లాక్కెళుతున్నారని, ధాన్యం రక్షణ కోసం గుట్టపై రహస్య స్థావరం ఏర్పరిచినట్లు కథనం ప్రకచారంలో ఉంది. దీనికి తగ్గట్లే ధాన్యం ఆరబోసేందుకు ఓ కల్లం ఏర్పాటు చేసిన ఆనవాళ్లు కూడా ఉన్నాయి.

గుట్టపై భారీ రాళ్ల గోడ

సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వరహాల గుట్ట పైభాగంలో రాళ్లతో భారీ ప్రహరీ నిర్మించారు. తాగునీటి బావి, పచ్చళ్లు నూరడానికి రోళ్లు, బండి చక్రాలు నడిచిన ఆనవాళ్లున్నట్టు చరిత్రకారులు చెబుతున్నారు. శిథిలమైన ఓ వినాయకుడి విగ్రహం కూడా గుట్టపై లభ్యమైనట్టు తెలుస్తోంది. హిందూ సంప్రదాయం ప్రకారం మొదటి పూజ వినాయకుడికి చేస్తాం కాబట్టి కాకతీ యులు కూడా ఇదే సంప్రదాయాన్ని పాటిస్తూ గుట్ట ప్రారంభ దారిలోనే వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్టు భావిస్తున్నారు. అంతే కాకుండా అంత ఎత్తులో ఉన్న గుట్టపై బావి నిర్మించి నీటిని తోడుకున్నారంటే చాలా కాలం ఇక్కడ నివసించి ఉన్నారని అర్థం చేసుకోవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇది నిర్మించింది కూడా రేచర్లే!

కాకతీయ సేనాని రేచర్ల రుద్రయ్య రామప్ప దేవాయాన్ని నిర్మించినట్టు చరిత్ర ద్వారా తెలుస్తుండగా అదేవిధంగా వరహాల గుట్టపై కాకతీయుల ఉన్నట్లు వారి అవసరాల కోసం అక్కడ అన్నీ నిర్మాణాలు చేసినట్టు భావిస్తున్నారు. కొందరు సైనిక స్థావరం కోసమని, మరికొందరు విలువైన సంపద, ఖజానా దాచుకోవడం కోసమని, ఇంకొందరు సమ్మక్క-సారక్కలతో యుద్ధం జరిగిన సమయంలో రాజులు సేద తీరడాకని, విలువైన ఆభరణాలు, ధాన్యం దాచుకోవడానికని గుట్టపై ఏర్పాట్లు చేసుకున్నారని చెబుతున్నారు. అందువల్లే ఈగుట్టకు వరహాలగుట్ట అనే పేరు వచ్చిందని భావిస్తున్నారు. కాకతీయులు నిర్మించిన ఈగుట్ట పైభాగంలో ఉన్న పురాతన సంపదనను కాపాడటంతో పాటు పర్యాటకులకు ఈ అందాలు, కాకతీయుల కాలం నాటి గుర్తులను చేరువ చేసేలా అభివృద్ధి చేయనున్నట్టు సమాచారం. మరో నెలరోజుల్లో ఈ గట్టుకు మహర్దశ వచ్చేలా చర్యలు తీసుకోబోతున్నట్టు తెలుస్తోంది.

గుట్టపై ప్రదేశంలో పర్యాటకుల కోసం గుడారాలు

అటవీశాఖ ఆధ్వర్యంలో రామప్ప సరస్సు సమీపంలో ఉన్న వరహాలగుట్టపై ఉన్న ఐదెకరాల ప్రదేశాన్ని పర్యాటక కేంద్రంగా తయారు చేసేందుకు ములుగు అటవీశాఖ అధికారి (డీఎఫ్‌వో) ఆదేశాలతో ములుగు ఫారెస్ట్ రెంజర్ డోలి శంకర్ ఆధ్వర్యంలో పర్యాటకులను ఆకర్షించే విధంగా పనులు మొదలయ్యాయి. ఈ నెలాఖరు కల్లా గుట్టపైకి పర్యాటకులను అనుమతించే అవకాశం కనిపిస్తోంది. అయితే కాలినడకన వెళ్లేందుకు మూడు మీటర్ల వెడల్పుతో గుట్టకు ఉన్న బండరాళ్ల తోనే దారి ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం రహదారి పనులు పూర్తి కావస్తుం డగా.. పనులు వేగంగా జరుగుతున్నాయి. గుట్టపై 50 గుడారాలు ఏర్పాటు చేసి వాటి ముందు భాగంలో పర్యాటకులను ఆకర్శించే విధంగా క్రాఫ్ట్ ఫైర్ (కట్టెలతో మంటలు) ఏర్పాటు చేయనున్నారు. రామప్ప సరస్సు సమీపంలోని వరహాల గుట్ట పర్యాటకంగా విరాజిల్లానుండటంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



వరహాల గుట్టపైకి వేస్తున్న కాలిబాట

సరస్సు నుంచి గుట్టపైకి రోప్‌వే ఏర్పాటు చేయాలి

పూల్యాల రామన్న, టూరిజం మార్కెటింగ్ ప్రచారకర్త



కాకతీయుల చరిత్రతో పాటు మనకు అంతుచిక్కని బోలెడు విషయాలు వరహాల గుట్ట పైభాగంలోనే కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలోనూ ఈ వరహాల గుట్ట గురించి కొందరికి మాత్రమే తెలుసు. ప్రభుత్వం, పురావస్తు, పర్యాటక శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటే అంతరించిపోతున్న కాకతీయుల చరిత్రను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు అందించే అవకాశం ఉంది. దీంతో పాటు గుట్టపైకి పర్యాటకులు వెళ్లేందుకు రామప్ప సరస్సు నుంచి గుట్టపైకి రోప్‌వే ఏర్పాటు చేస్తే పర్యాటక శాఖకు, ప్రభుత్వానికి నిజంగానే 'వరాలు' కురుస్తాయి.

ప్రకృతి వ్యవసాయానికి కేంద్రం ప్రోత్సాహం




తాళ్లపూసపల్లిలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, వ్యవసాయ డ్రోన్‌ను ఆపరేట్ చేస్తూ పరిశీలిస్తున్న గవర్నర్

- ఈ విధానంలో సాగు కోసం రూ.1500 కోట్లు కేటాయింపు
- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి
- కేసముద్రంలో సదస్సుకు హాజరు

కేసముద్రం, సెప్టెంబరు 5 : పర్యావరణాన్ని కాపాడుకుంటూ చేసే ప్రకృతి వ్యవసాయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఈ విధానంలో సాగు కోసం రూ.1500 కోట్లు కేటాయించిందని, సహజసిద్ధ విధానంలో పండిన ఉత్పత్తులను ఆహారంగా తీసుకున్న వారు ఆరోగ్యంగా ఉంటారని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లిలో గురువారం 'ప్రకృతి వ్యవసాయం'పై నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరయ్యారు. తొలుత గవర్నర్‌ను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఇంద్రసేనారెడ్డి తాళ్లపూసపల్లి, కల్వల గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలకు 'నమోడ్రోన్ దీదీ' పథకంలో భాగంగా మంజూరైన వ్యవసాయ డ్రోన్‌ల పనితీరును పరిశీలించారు. ఆ తర్వాత అభినవ్‌రెడ్డి ఫౌండేషన్ బాధ్యుడు సొల్లేటి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ శిక్షణ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ గత వారంలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో రైతు సంక్షేమం కోసం కీలక నిర్ణయాలు తీసుకున్నారని, భూసారం వివరాలతో కూడిన 'భూమి ఆరోగ్య కార్డు'ను రూపొందించేందుకు నిర్ణయించిందని వివరించారు. ఇటీవల గుజరాత్‌లో నిర్వహించిన గవర్నర్ల సమావేశంలో ప్రధాని మోదీ చొరవతో ప్రకృతి సాగు విధానంలోని పంట ఉత్పత్తులతో వండిన భోజనాన్ని వడ్డించారని చెప్పారు. తాను పని చేస్తున్న త్రిపుర రాష్ట్రంలో కూరగాయల మొక్కల ఆకులను సైతం వంటల్లో వినియోగిస్తూ విక్రయిస్తున్నారని తెలిపారు. వ్యవసాయంలో పశువులను వినియోగించే కుటుంబాలు సంతోషంగా ఉంటాయని అన్నారు.

భూ తాపంతోనే వరదలు

ప్రకృతి వ్యవసాయ నిపుణుడు విజయ్‌రామ్

పెరిగిన రసాయన మందుల వినియోగం, వాతావరణ కాలుష్యం, భూ తాపంతోనే వరదలు, ప్రకృతి విపత్తులు వస్తున్నాయని, ఇది ఆరంభమేనని.. భవిష్యత్తులో ఇంకా ఇలాంటివి వస్తాయని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు విజయ్‌రామ్ హెచ్చరించారు. ఈ సదస్సుకు శిక్షకుడిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సూక్ష్మపోషకాలు లేని ఆహారాన్ని తీసుకుంటున్నారని తద్వారా కాన్సర్, తదితర వ్యాధులు వస్తున్నాయని అన్నారు. ఏ జీవిని చంపకుండా అహింసా మార్గంలోనే ప్రకృతి వ్యవసాయ విధానం ఉంటుందని తెలిపారు. ప్రకృతి సాగు విధానంలో ఒక ఎకరంలో రూ.3 లక్షల ఆదాయాన్ని చూపుతానని వివరించారు. తాను పండించిన ఆహార ఉత్పత్తులతోనే తిరుపతిలో ప్రసాదం తయారు చేస్తున్నారని తెలిపారు.

ప్రకృతి ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

ప్రకృతి విధానంలో పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని సదస్సుకు హాజరైన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి కోరారు. 'నమో డ్రోన్ దీదీ' పథకంలో భాగంగా మహబూబాబాద్ జిల్లాకు మూడు వ్యవసాయ డ్రోన్‌లు ఇచ్చారని, తమ నర్సంపేట నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు కూడా డ్రోన్‌లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్‌డీవో అలివేలు, రాంమోహన్‌రెడ్డి, డీఏవో విజయనిర్మల, ట్రాన్స్‌కో డీఈ విజయ్‌కుమార్, తహసీల్దార్ టి.దామోదర్, ఏవో బి.వెంకన్న పాల్గొన్నారు.

వాయిదా పడిన ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ పరీక్షలు 9న

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 5: కాకతీయ యూనివర్సిటీ ఐదేళ్ల ఇండిగ్రేటెడ్ బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ పరీక్షలను సెప్టెంబరు 9న నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పీఎస్ఎల్ సౌజన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 2న జరగాల్సిన పరీక్షలు భారీవర్షాల కారణంగా వాయిదా పడిన విషయం విదితమే. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు గతంలో ప్రకటించిన షెడ్యూల్ మేరకు జరుగుతాయని వెల్లడించారు. పరీక్షల సమయంలో, పరీక్షల కేంద్రాల్లో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేశారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 5: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోమటిపల్లిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసారు. గురువారం పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు రూ.31వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, మూడు బైక్స్ స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకుని నలుగురిని విచారణ నిమిత్తం కేయూ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రాజు ధృవీకరించారు.

జూడో క్రీడాకారులకు చేయూత



క్రీడాకారులకు రవాణా చార్జీల టికెట్లను అందజేస్తున్న శ్రీనివాస్

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 5: జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సెప్టెంబరు 9నుంచి 12 వరకు చెన్నైలో నిర్వహించనున్న 4వ ఖేలో ఇండియా ఉమెన్స్ సబ్ జూనియర్స్, సీనియర్స్ సౌత్‌జోన్ టోర్నమెంట్‌లో పాల్గొననున్న జిల్లా జూడో క్రీడాకారులకు సీనియర్ క్రీడాకారుడు ఎల్.శ్రీనివాస్ రవాణాఖర్చులను అందించారు. వరంగల్ ఓ సిటీ క్రీడా మైదానంలో ఖేలో ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూడో శిక్షణ కేంద్రాన్ని గురువారం శ్రీనివాస్ సందర్శించి క్రీడాకారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలపై ఉన్న ఆసక్తితో ఒక సీనియర్ క్రీడాకారుడిగా ప్రతిభ కలిగిన పేద క్రీడాకారులకు చేయూతనందించేందుకు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ఖేలో ఇండియా ఆధ్వర్యంలో ఓసిటీ క్రీడా మైదానంలో శిక్షణ పొందుతున్న 10మంది క్రీడాకారిణులకు చెన్నైలో నిర్వహించనున్న సౌత్‌జోన్ పోటీలకు హాజరుకానున్న నేపథ్యంలో వారు క్రీడా పోటీలకు వెళ్లి రావడానికి రైల్వే రవాణా ఖర్చులను అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డీవైఎస్‌వో సత్యవాణి, ఖేలో ఇండియా జూడో కోచ్ జె.లింగమూర్తి డీఎస్‌ఏ కోచ్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన టేకులగూడెం

- ముగిసిన మావోయిస్టు నేత మాచర్ల ఏసోబు అంత్యక్రియలు
- అంతిమయాత్రకు హాజరైన ప్రముఖులు
- ఇది బూటకపు ఎన్‌కౌంటర్ : భారతక్క

కాజీపేట, సెప్టెంబరు 5: ఎర్ర జెండాలతో టేకులగూడెం ఎరుపెక్కింది. ఎర్రజెండాల సాక్షిగా ఎన్‌కౌంటర్‌లన్నీ బూటకమే అంటూ ఫ్లెక్సీల ద్వారా ప్రజాసంఘాల నేతలు ఎండగట్టారు. ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనంటూ మానవహక్కుల సంఘాల నిలదీత పోస్టర్‌లు టేకులగూడెంలో దర్శనమిచ్చాయి. ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ అలియాస్ రణదేవ్ దాదా అంతిమ సంస్కారాలు గురువారం రాత్రి ముగిశాయి. ఉదయం ఏసోబు పార్థీవదేహాన్ని స్వగ్రామమైన టేకులగూడెంకు కుమారుడు మాచర్ల మహేశ్ తీసుకువచ్చారు. గ్రామస్తులు,బంధువులు, మావోయిస్టు అభిమానులు, సానుభూతిపరులు తండోపతండాలుగా టేకులగూడెం వచ్చి ఏసోబు పార్థీవదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, దాస్యం వినయ్‌భాస్కర్, తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య చేరుకుని ఏసోబు పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కళాబృందాలతో అంతిమయాత్ర

జోహార్ ఏసోబన్న.. ఏసోబన్న ఆశయాలను కొనసాగిద్దాం.. నీ త్యాగం మరువం.. అంటూ కళాబృందాలు, ప్రజాసంఘాల నేతల నినాదాలతో టేకులగూడెం హోరెత్తింది. ఏసోబు అంతిమయాత్ర గురువారం ఉదయం 11:30 నిమిషాలకు ప్రారంభమైంది. కళాకారులు ఆటలాడుతూ, పాటలు పాడుతూ భారీ ర్యాలీతో అంతిమయాత్ర సాగింది. ఎస్సీ కాలనీ నుంచి ప్రారంభమైన ఈ అంతిమయాత్ర.. గ్రామంలోని అన్ని కాలనీల మీదుగా సాగింది. సాయంత్రం 5:30 నిమిషాలకు విప్లవ సంప్రదాయం ప్రకారం నివాళులర్పించి దహన సంస్కారాలు నిర్వహించారు. ఏసోబు కుమారుడు మాచర్ల మహేశ్ దహన సంస్కారాలు పూర్తిచేశారు. కాగా, ఈ అంతిమ యాత్రలో ఇంటెలిజన్స్ పోలీసులు పాల్గొని అంతిమ యాత్ర జరిగిన తీరు, హాజరైన వారి వివరాలు సేకరించినట్లు సమాచారం.



అంతిమయాత్రలో పాల్గొన్న కుటుంబీకులు

బూటకపు ఎన్‌కౌంటరే..

ఏసోబుది కచ్చితంగా బూటకపు ఎన్‌కౌంటరేనని మాజీ మావోయుస్టు భారతక్క ఆరోపించారు. అంతిమయాత్రకు హాజరైన ఆమె మాట్లాడుతూ.. మావోయిస్టులను పట్టుకుంటే పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించాలని, కానీ హత్య చేయడం దారుణమన్నారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బంధుమిత్రుల కమిటీ జాయింట్ సెక్రటరీ శాంతక్క, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమార స్వామి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జనగామ జిల్లా అధ్యక్షుడు పాకాల వెంకన్నలు మాట్లాడుతూ.. ఆదివాసీలను, గర్భిణులను బట్టలూడదీసి కాల్చడం పోలీసుల పాశవిక చర్యలు అన్నారు. బొగ్గు, ఇనుము బహుళ జాతీయులకు అంటగట్టడానికి ఖగార్ ఆపరేషన్ పేరుతో ఏసోబును బూటకపు ఎన్‌కౌంటర్ చేశారన్నారు. ఎన్‌కౌంటర్‌లన్నీ కేంద్ర ప్రభుత్వం చేసే హత్యలేనన్నారు. మూడోసారి అధికారం చేపట్టిన మోదీ, నితీష్, చంద్రబాబు నాయుడు అండతోనే ఈ ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నారు. ఇలాంటివి జరగకుండా ఇండియా కూటమి నేతలు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ఏసోబు ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేయాలని డిమాండ్ చేశారు.



ఏసోబు అంతిమయాత్రలో బూటకపు ఎన్‌కౌంటర్ల ఫ్లెక్సీతో పౌరహక్కుల నేతలు

తుది దశకు ట్రాక్ మరమ్మతులు

- ఇంటికన్నె వద్ద రెండు పట్టాలు సిద్ధం
- తెల్లవారుజామున డౌన్‌లైనుపై ట్రయల్‌రన్
- పాక్షికంగా రైళ్ల పునరుద్ధరణ.. కాషన్ ఆర్డర్‌తో రాకపోకలు

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 5: సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్‌లోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కేసముద్రం-ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య 418 కిలోమీటరు వద్ద వరద ప్రవాహానికి ట్రాక్ ధ్వంసమైన ప్రాంతంలో మరమ్మతు పనులు తుది దశకు చేరుకున్నాయి. చెన్నై-న్యూ ఢిల్లీ గ్రాండ్ ట్రంక్ లైనుగా పేరున్న ఈ ట్రాక్‌లో నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఈ మరమ్మతు పనులు దాదాపు పూర్తయ్యాయి. బుధవారమే అప్‌లైన్ సిద్ధమవగా గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయానికి డౌన్‌లైను మరమ్మతులు పూర్తిచేసి ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. దీంతో ఈ ప్రాంతంలో అప్ అండ్ డౌన్ లైన్లు రాకపోకలకు అందుబాటులోకి వచ్చాయి. ఉదయం నుంచి గోల్కొండ, కృష్ణా, ఈస్ట్‌కోస్ట్, అండమాన్, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లను అప్‌అండ్‌డౌన్ వైపుల నడిపించారు. అయితే మరమ్మతులు జరిగిన ప్రాంతంలో కాషన్ ఆర్డర్‌తో ఈ రైళ్లను నడపగా బుధవారం అప్‌లైనులో 5కిలోమీటర్ల వేగంతో వెళ్లగా, గురువారం 30 కిలోమీటర్ల వేగంతో వెళుతున్నాయి. ఇక తాజాగా అందుబాటులోకి వచ్చిన డౌన్‌లైనులో 5 కిలోమీటర్ల వేగంతోనే వెళుతున్నాయి. అయితే ఇక్కడ ట్రాక్ సిద్ధమైనప్పటికీ విజయవాడ రాయనపాడు ప్రాంతంలో రైల్వేట్రాక్ ముంపునకు గురికావడంతో ఈ మార్గంలో పలు రైళ్లను నడపడంలేదని తెలుస్తోంది. శుక్రవారం నుంచి డోర్నకల్, భద్రాచలం రోడ్, మణుగూరు ప్రాంతాల నుంచి సికింద్రాబాద్, బల్లార్ష ప్రాంతాలకు నడిచే రైళ్లను పునరుద్ధరించనున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఇంకా పూర్తిస్థాయిలో మరమ్మతుల కోసం రైల్వే సిబ్బంది ఈ ప్రాంతంలో పని చేస్తూనే ఉన్నారు. ఏదేమైనా వరద తాకిడికి పూర్తిగా తెగిపోయిన రైలుకట్టను నాలుగు రోజుల పాటు తీవ్రంగా శ్రమించి రెండు ట్రాక్‌లు అందుబాటులోకి తీసుకురావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





కేసముద్రం మండలం ఇంటికన్నె వద్ద మరమ్మతులు పూర్తి చేసుకొని సిద్ధమైన డౌన్ లైను

వరంగల్ మీదుగా పాక్షికంగా నడిచిన రైళ్లు

- నేటి నుంచి గోల్కొండ, శాతవాహన, ఇంటర్‌సిటీ

గిర్మాజీపేట, సెప్టెంబరు 5: భారీ వర్షాలు, వరదల కారణంగా ఇంటికన్నె-కేసముంద్రం, మహబూబాబాద్-తాళ్లపూసలపల్లి మధ్య ధ్వంసమైన రైల్వేట్రాక్‌ల పునరుద్ధరణ పనులు గురువారం ఉదయానికి పూర్తయి రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. కానీ గురువారం విజయవాడ-సికింద్రాబాద్ మార్గంలో వరంగల్ మీదుగా రైళ్లు మాత్రం పాక్షికంగా నడిచాయి. సికింద్రాబాద్ - గుంటూరు, సికింద్రాబాద్-విజయవాడ మధ్య నడిచే గోల్కొండ, ఇంటర్‌సిటీ, శాతవాహన రైళ్లు రద్దవగా.. ఈ రైళ్లు శుక్రవారం నుంచి యథాతథంగా నడవనున్నాయి. ఇక విశాఖపట్టణం-మహబూబ్‌నగర్, విశాఖపట్టణం - నాందేడ్, తిరుపతి - సికింద్రాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్, గూడూరు - సికింద్రాబాద్ సింహపురి ఎక్స్‌ప్రెస్, తిరుపతి-కరీంనగర్ ఎక్స్‌ప్రెస్, తాంబరం-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు గురువారం వరంగల్ మీదుగా వెళ్లాయి, అలాగే వరంగల్ మీదుగా వెళ్లాల్సిన కేరళ ఎక్స్‌ప్రెస్‌ను గురువారం కాజీపేట, సికింద్రాబాద్ మీదుగా దారి మళ్లించారు. అలాగే న్యూఢిల్లీ- చెన్నై, న్యూఢిల్లీ-విశాఖపట్టణం మధ్య నడిచే జీటీ, తమిళనాడు, ఏపీ ఏసీ రైళ్లను గురువారం రద్దు చేశారు. దూరప్రాంతాల నుంచి బుధవారం బయలుదేరిన కొన్ని రైళ్లు మాత్రమే గురువారం వరంగల్ మీదుగా వెళ్లాయి. శుక్రవారం నుంచి అన్ని రైళ్లు యథావిధిగా నడుస్తాయని గురువారం రాత్రి రైల్వే వర్గాలు వెల్లడించాయి.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2945	2700
పల్లికాయ (సూక)	5100	4500
పల్లికాయ (పచ్చిది)	4500	3400
పెసళ్లు	6833	4552
పత్తి	7665	5000
పసుపు (కాడి)	12759	10000
పసుపు (గోల)	12009	10009
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	18000	14000
వండర్‌హాట్ ఏసీ	15200	13000
యూఎస్341 ఏసీ	14500	11000
దేశీ ఏసీ	22000	20000
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

మట్టి విగ్రహాలనే పూజించాలి : ఎంపీ కావ్య

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 3: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య సూచించారు. గురువారం హనుమకొండ కనకదుర్గా కాలనీలోని స్వగృహంలో ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రి ఉత్సవాలను మట్టి విగ్రహాలు, ప్రతిమలు ప్రతిష్ఠించి పూజించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కొల్ల శరత్‌చంద్రారెడ్డి, సిహెచ్.సాగర్, నీలం యువరాజు, అరవింద్, రవి, ఉదయ్ పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలను అందజేస్తున్న ఎంపీ కావ్య

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 5: జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కాకతీయ యూనివర్సిటీలో ఘనంగా టీచర్స్ డే వేడుకలు జరిగాయి. కేయూ క్యాంపస్‌లోని విద్యా కళాశాల విభాగంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కాంస్య విగ్రహానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, విద్యా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రణధీర్‌రెడ్డిలు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజు, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఎడ్యుకేషన్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎన్.రాంనాథ్‌కిషన్, ప్రిన్సిపాల్ రణధీర్‌రెడ్డి, డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్, డాక్టర్ పోరిక రమేశ్ తదితరులు పాల్గొన్నారు. కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో గురువారం టీచర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.అమరవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి హాజరయ్యారు. మాజీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వెంకటరత్నం, రిటైర్డు ప్రొఫెసర్లు ఎ.శంకరయ్య, జి.కృష్ణమూర్తి, జి.నరసింహమూర్తి, వి.గంగాధర్, ఆర్.సుదర్శన్, పి.ఇంద్రాసేనారెడ్డి, చింతకింది రాజేశం, పి.వరలక్ష్మి, రాజేందర్ కట్ల తదితరులను ఘనంగా శాలువా, మెమొంటో అందచేసి సన్మానించారు. అలాగే కేయూ హిస్టరీ అండ్ టూరిజం విభాగంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. విభాగాధిపతి డాక్టర్ చిలివేరు రాజ్‌కుమార్ నేతృత్వంలో విద్యార్థులు, అధ్యాపకులను శాలువా, పుష్పగుచ్ఛం అందచేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మయ్య, డాక్టర్ ఆకులపల్లి కుమారస్వామి, డాక్టర్ కేవీఎస్ నరేందర్, పి.కృష్ణ సుమంత్, శ్రీధర్, నాగేశ్వర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

- బాలసముద్రం: హనుమకొండ బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల్ పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాతో సన్మానించి, బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించిన ఉపాధ్యాయులను పాఠశాల కరస్పాండెంట్ చిదురాల సోమరత్నం అభినందించారు.
- హసన్‌పర్తి: మండల కేంద్రంలోని సెయింట్‌మేరీస్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ హసన్‌పర్తి అధ్యక్షుడు ఇనుముల కృపాకర్ అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా జిల్లా నాయకత్వ సమన్వయకర్త లయన్ డాక్టర్ దివి అజిత్‌కుమార్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 35 మంది ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీస్ పోస్టర్ చైర్మన్ చెన్నూరు శ్రీనివాస్, జిల్లా యూత్ ఆక్టివిటీస్ చైర్మన్ గంగారపు రజనీకాంత్, క్లబ్ సభ్యులు శ్రీనివాస్, గోపరాజు యాదగిరి, తోట సంపత్, మారం సుధాకర్, డైరెక్టర్లు నారాయణరెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా పలువురు బోధనా సిబ్బందికి శాలువాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు డాక్టర్ ఈ.సుదర్శన్, డాక్టర్ ఎన్.శ్రీవాణి, కె.రవికిరణ్, ఏవో వేణుగోపాలస్వామి, కోఆర్డినేటర్స్ రూస్సీరాణి, సుచరిత, ఉమల్వరాతో పాటు అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీలు పాల్గొన్నారు.
- ఐనవోలు: పోటీ ప్రపంచంలో ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిలా అన్వేషించినప్పుడు మెరుగైన విద్య లభిస్తుందని ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా పున్నేలు ఏకశిల పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల సమర్పించి ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ మహ్మద్ బాబా అధ్యక్షతన గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ పాల్గొని మాట్లాడుతూ.. ఉపాధ్యాయవృత్తిని కొనియాడారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అన్ని వృత్తుల్లో ఉపాధ్యాయ వృత్తి గర్వించతగిందన్నారు. సమాజ పురోగతి ఉపాధ్యాయుల భుజస్కంధాలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కూనూరు రవికిరణ్, అకాడమిక్ ఇంచార్జి వి.అమర్‌నాథ్, స్టాఫ్ ఇంచార్జీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- ధర్మసాగర్: పెద్దపెండ్యాలలోని డీపీఎస్ వరంగల్, సీబీఎస్ పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో స్వయం పరిపాలన సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలు బోధించినట్టు పాఠశాల చైర్మన్ రవికిరణ్ తెలిపారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ రాజిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఇన్నారెడ్డి, పాఠశాల వైస్ ప్రెసిడెంట్ రాకేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.
- వరంగల్ ఎడ్యుకేషన్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాలలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమాజంలో అధ్యాపక వృత్తి అత్యంత ఆదర్శవంతమైనదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్ల రమేష్, అధ్యాపకులు ఫిరోజ్, శ్రీధర్‌కుమార్, భిక్షపతి, శ్రీదేవి, రమాదేవి, శేషు, వీరస్వామి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.
- జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని హంటర్‌రోడ్‌లోని జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం విజ్ఞాన పీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భుక్యా బాబురావు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రీమంతుల దామోదర్, చూరేపల్లి రవికుమార్, బాసని సురేష్, అబ్బు గోపాల్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ గంపా సతీష్, సిబ్బంది విజయలక్ష్మి, సునంద, ఆంజనేయులు, అశోక్, కస్తూరిబాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.



బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల్ పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం





సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, కేయూక్యాంపస్‌లోని విద్యా విభాగంలో టీచర్స్ డేలో పాల్గొన్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి తదితరులు

హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

వడ్డెపల్లి, సెప్టెంబరు 5: హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్‌పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ది హనుమకొండ డిస్ట్రిక్ట్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి ఎం. మధూకర్‌రావు అన్నారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మత్తురహిత సమాజ నిర్మాణంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ కంట్రోలర్ అథారిటీ (డీసీఏ) సూచించిన విధంగా ఎప్పటికప్పుడు హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్ విషయంలో ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ దుర్వినియోగం కాకుండా తమ సంస్థ కృషి చేస్తోందని చెప్పారు. ఔషధాల విక్రయాల సమయంలో పాత ప్రిస్క్రిప్షన్‌పై పదేపదే తాము మందులు ఇవ్వలేమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నేతలు లక్ష్మణ్, రాజమౌళి, ప్రభాకర్, రాజేందర్, వెంకటేశ్వర్లు, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సా స్మృతివనాన్ని అభివృద్ధి చేస్తాం

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట, సెప్టెంబరు 5: ఫాతిమా జంక్షన్‌లో ఫాతిమా విగ్రహం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో థెరిస్సా స్మృతివనాన్ని ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ జంక్షన్‌లో గురువారం మదర్‌థెరిస్సా 27వ వర్థంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై మదర్‌థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. మదర్‌థెరిస్సా ప్రపంచానికి ఆదర్శనీయం అన్నారు. ఆమె చూపిన మార్గంలో నడచినప్పుడే నిజమైన నివాళులన్నారు. అంతకుముందు బిషప్ ఉడుముల బాల, చర్చి ఫాదర్ కాసుమరెడ్డి, అనుకిరణ్, విగ్రహ కమిటీ కన్వీనర్ ఆర్.రాజ్‌మోహన్, చర్చి క వి ఎటీ అధ్యక్షుడు బొక్క దయాసాగర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్, ప్రొఫెసర్లు కూరపాటి వెంకటనారాయణ, తిరునహరి శేషు, డాక్టర్ అనీష్ సిద్దిఖీ, కార్పొరేటర్ మానస రాంప్రసాద్, మాజీ కార్పొరేటర్‌లు అబూబక్కర్, రావుల సదానందంలు హాజరై థెరిస్సా విగ్రహానికి నివాళులర్పించి, ఆమె చేసిన సేవలు కొనియాడారు.



మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే నాయిని

డిగ్రీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

▸▸ వర్సిటీలో ఆందోళనలు.. మద్దతు తెలిపిన విద్యార్థి సంఘాలు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 5: డిగ్రీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు కాకతీయ యూనివర్సిటీలో ఆందోళనలకు దిగారు. హనుమకొండ చౌరస్తా నుంచి కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం వరకు పెద్దఎత్తున నిరసన ర్యాలీ, ప్రదర్శనలు నిర్వహించారు. ప్లకార్డులను పట్టుకుని వర్సిటీ అధికారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. డిగ్రీలో ప్రతీ సెమిస్టర్‌కు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని, ఇటీవల పెంచిన డిగ్రీ ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాలలకు బడ్జెట్‌ను పెంచి నిధులు కేటాయించి కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాలల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. యూనివర్సిటీ పరిధిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణలు స్పందించాలని డిమాండ్ చేశారు. పరీక్షలు పూర్తైన నెల రోజుల్లోనే అన్ని వర్సిటీలు పరీక్షల ఫలితాలను విడుదల చేస్తుంటే.. కేయూలో మాత్రం ఫలితాల విడుదల అలస్యమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఏబీవీఎస్‌ఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఏబీఎస్‌ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ తెలిపారు. విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావడంతో వర్సిటీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటలు జరుగకుండా సెక్యూరిటీ సిబ్బంది జాగ్రత్తలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ విద్యార్థులు శరత్, రాహుల్, శివ, వర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



కేయూ పరిపాలన భవనం ఎదుట నిరసన చేస్తున్న విద్యార్థులు

చెరువులను చెరపట్టారు!

(5వ పేజీ తరువాయి)

గత ప్రభుత్వంలోని కీలక నేతల కనుసన్నుల్లోనే భారీగా ఆక్రమణలు జరిగాయనే ప్రచారం జరుగుతోంది. అలాగే వరంగల్ దేశాయిపేటలోని చిన్న వడ్డేపల్లి చెరువు 70.74ఎకరాల్లో విస్తరించి ఉంది. దీనిలో సుమారు 35ఎకరాలకు పైగా చెరువు భూమి కబ్జాకు గురైందనే చర్చ ఉంది. చెరువును ఆక్రమించుకుని 329 అక్రమ నిర్మాణాలు చేపట్టారు. వీటిలో కేవలం 8 అక్రమ కట్టడాలనే అధికారులు కూల్చివేసి, 110 కట్టడాలకు సంబంధించి నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకొన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంకా 211 అక్రమ నిర్మాణాలకు ఎలాంటి నోటిసులు ఇవ్వకపోవడం వెనుక మతలాబేంటీన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అక్రమార్కుల్లో కొందరు రెవెన్యూ అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని నిర్మాణాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఉన్నాయని అందుకే అధికారులు చిన్నవడ్డేపల్లి చెరువు అక్రమణపై దృష్టి పెట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా ఓ మాజీ ప్రజాప్రతినిధి అనుచరులే అధికంగా ఉండటంతో అక్రమ కట్టడాలపై అధికారులు ఫోకస్ చేయటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే కాజీపేట నిట్ వెనుకాల ఉన్న బంధం చెరువు సుమారు 65.20ఎకరాల్లో విస్తరించి ఉంది. దాదాపు ఈ చెరువులో 366 నిర్మాణాలు చేపట్టినట్టు అధికారులు గుర్తించారు. అయితే కేవలం ఏడు అక్రమ కట్టడాలనే కూల్చివేసిన అధికారులు, మరో 125 కట్టడాలకు నోటీసులు ఇచ్చారు. మిగతా 234 అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పేదలు నిర్మించుకున్న ఇళ్లను వదిలేసి, బడా బాబులు, నేతలు అక్రమించిన భూములనైనా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే పైడిపల్లి శివారులో హనమాన్ జంక్షన్ సమీపంలోని కోట చెరువు 172.40 ఎకరాల్లో విస్తరించి ఉండగా, ఇందులో 70ఎకరాలకు పైగా కబ్జాకు గురైనట్టుగా గుర్తించారు. ఈ చెరువు భూముల్లో 150 అక్రమ కట్టడాలు నిర్మించారు. అధికారులు నాలుగు అక్రమ నిర్మాణాలను తొలిగించి, 50మందికి నోటీసులిచ్చారు. మిగతా 96అక్రమ నిర్మాణలపై అధికారులు దాటవేత ధోరణిలో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ ప్రజాప్రతినిధితో పాటు మాజీ, తాజా కార్పోరేటర్లు కొందరు కీలకంగా వ్యవహరించారనే ప్రచారం ఉంది. ఇవే కాకుండా హనుమకొండలోని వడ్డేపల్లి చెరువు 556.32 ఎకరాల్లో విస్తరించి ఉండగా, దీనిలో 100 ఎకరాల వరకు భూమి ఆక్రమణకు గురైందని, చెరువు కట్టను అక్రమించుకుని హాల్స్ అపార్ట్‌మెంట్లు నిర్మించారని ఫిర్యాదులు అందినా అధికారుల మౌనమే చెరువుకు శాపంగా మారుతోందని చర్చ జరుగుతోంది. గత ప్రభుత్వంలో కీలక నేతతో పాటు హైదరాబాద్‌లోని ఓ మాజీ మంత్రి సహకారంతో కబ్జాకోరులు వందల కోట్ల భూముల్లో తిష్ట వేశారని తెలుస్తోంది. గోపాల్‌పూర్ చెరువు 16.11ఎకరాలకు పైగా ఉండగా, కేవలం రెండెకరాలు కూడా లేకుండా కబ్జాలకు దిగుతున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే ఉర్సు చెరువు, తిమ్మాపూర్ బెస్తం చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు, రంగాశాయిపేట చెరువులతో పాటు నగరంలోని, శివారులోని చెరువులు, కుంటల భూములను కబ్జారాయుళ్లు మింగేస్తున్నారనే ప్రచారం జరుగుతుంది.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఐనవోలు, సెప్టెంబరు 5: ఫ్యాషన్ డిజైన్ కుట్టు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. సిరి స్వచ్ఛంద సంస్థ పైడిపల్లి ఆధ్వర్యంలో నందనంలో మహిళలకు ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ అవసరాల కోసం మహిళల సంపాదన ఎంతో అవసరంగా మారిందని, ఈ శిక్షణ కేంద్రాన్ని వినియోగించుకోవాలన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తానని హామీ ఇచ్చారు. మహిళలకు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇప్పించడంపై సంస్థ డైరెక్టర్ డాక్టర్ పరికి సుధాకర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బండి సంపత్‌కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు మంజులయాదగిరి, బోయినపెల్లి శ్రీనివాస్‌రావు, మాజీ ఎంపీటీసీ లక్ష్మీకుమార్, అంగన్‌వాడీ టీచర్లు జానకిదేవి, రాజియబేగం, పులమ్మ, వాణి, సీసీ రమేష్‌బాబు, ఉమెన్స్‌క్లబ్ కోఆర్డినేటర్ కల్యాణి, నాయకులు పాల్గొన్నారు.



ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఐనవోలు, సెప్టెంబరు 5: గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జడ్పీ సీఈవో విద్యులత సూచించారు. గురువారం వనమాల కనపర్తి, కొండపర్తి గ్రామాల్లో వైద్య శిబిరాలను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో పులి వెంకటేశ్వర్లు, ఏపీవో కుమారస్వామి, కార్యదర్శి లక్ష్మణ్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్న లక్ష్యాన్ని రూపొందించుకోవాలి

ఇంజనీరింగ్ ఓరియంటేషన్‌లో రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 5: విద్యార్థుల లక్ష్యం ఉన్నతంగా రూపొందించుకోవాలని, వాటి సాధన కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కేయూ క్యాంపస్‌లోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ మొదటి ఏడాది విద్యార్థులకు ఓరియంటేషన్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాలలో ఉన్న వనరులను, అధ్యాపకుల నైపుణ్యాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మహేందర్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ చాడ రాధికారెడ్డి, డాక్టర్ ఇక్బాల్, ఏఆర్ నేతాజీ, సూపరింటెండెంట్ బొల్నేపాక ప్రభాకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, ఇతర అధ్యాపకులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 5: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 10 గంటలకు, న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, వడ్డెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు.

కాస్మెటిక్స్ చార్జీలను పెంచాలి

వడ్డెపల్లి, సెప్టెంబరు 5: సంక్షేమ హాస్టల్, గురుకుల, కేజీబీవీ విద్యార్థులకు డైట్ కాస్మెటిక్స్ చార్జీలను వెంటనే పెంచాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలో నిర్వహించిన డీబీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఈ విద్యాలయాల్లో కనీస సదుపాయాలు కరువై విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడి టీచర్లు, వార్డెన్లతో పాటు కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్ పాల్గొన్నారు.

నేడు జంతుశాస్త్ర విభాగంలో 'బయోటెక్నాలజీ' సదస్సు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 5: కాకతీయ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగంలో సెప్టెంబరు 6న శుక్రవారం 'బయోటెక్నాలజీ ఫర్ ఎకానమీ ఎన్విరాల్‌మెంట్ అండ్ ఎంప్లాయిమెంట్'అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు జంతుశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ షమిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయోగ్నోస్టిక్స్, కేయూ జంతుశాస్త్ర విభాగం సంయుక్తంగా నిర్వహించే సదస్సుకు సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎంవీ సుబ్బారావు, డాక్టర్ యాతిశ్, జే. ఆకార్ పాల్గొని ప్రసంగిస్తారని షమితా తెలిపారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

పోష్టికాహారంపై అవగాహన

రాంనగర్, సెప్టెంబర్ 5: తక్కువ బరువున్న పిల్లలకు పోష్టికాహారం అందించడంపై తల్లులు అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో స్వరూప సూచించారు. పోషణ మాసం సందర్భంగా గురువారం హసన్‌పర్తి మండలం చింతగట్టు గ్రామంలోని ప్రాథమి క ఆరోగ్య కేంద్రంలో బరువు తక్కువగా ఉన్న పిల్లలకు ఎలాంటి ఆహారం అందించాలనే విషయమై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో స్వరూప.. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్న పిల్లలకు అందించాల్సిన ఆహారంపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కల్పన, అంగన్‌వాడీ టీచర్లు ఎం.స్వప్న, పద్మ, శైలజ, స్వరూప, సరోజన, ఏఎన్ఎం గ్రేస్ మేరీ, ఆశావర్కరర్లు మాధవి, స్రవంతి, కవిత, లలితతో పాటు గర్భిణులు పాల్గొన్నారు.

రైల్వే సంఘ్ జోనల్ కమిటీ మెంబర్‌గా రాజ్‌కుమార్

కాజీపేట, సెప్టెంబరు 5: దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ జోనల్ మెంబర్‌గా కాజీపేటకు చెందిన లోకో రన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్‌ను నియమిస్తూ గురువారం సంఘ్ జాయింట్ సెక్రటరీ భరణిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు సంఘ్‌ను బలోపేతం చేస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో సంఘ్ గెలుపునకు కృషి చేస్తానన్నారు.

కార్పొరేటర్ ఎలకంటి రాములు మృతి

కాజీపేట. సెప్టెంబరు 5 : కాజీపేట 61వ డివిజన్ కార్పొరేటర్ ఎలకంటి రాములు (64) గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో చికిత్సపొందుతూ మృతి చెందాడు. రాములు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. రెండురోజుల క్రితం వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. రాములు గత ఎన్నికల్లో 61 డివిజన్‌లో బీఆర్ఎస్ తరుపున పోటీచేసి గెలిచారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల దృష్ట్యా ఈమధ్యే కాంగ్రెస్‌లో చేరాడు. రాములుకు కూతురు, భార్య ఉంది. ఈ మధ్యనే కూతురుకు వివాహం అయ్యింది. మృతదేహాన్ని శుక్రవారం కాజీపేట ప్రశాంత్‌నగర్‌లోని తరలించి అంత్యక్రియలు చేయనున్నట్లు బంధువులు తెలిపారు.

గంజాయి పట్టివేత

కాజీపేట, సెప్టెంబరు 5: కాజీపేట సోమిడి ఏరియాలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా నలుగురు వ్యక్తులు గంజాయితో పట్టుబడ్డారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. కాజీపేట సోమిడిలో నలుగురిని అదుపులోకి తీసకుని తనిఖీలు చేయగా వారి వద్ద 5 కిలోల గంజాయి ప్యాకెట్‌లు లభించాయన్నారు. పట్టుబడ్డవారిలో రేణికుంట్ల శంకర్, కావటి మేరీ, ఫ్రాన్సిస్ అర్పిత, వేల్పుల శ్యామ్‌లు ఉన్నారనీ, వీరంతా కాజీపేట విష్ణుపురికి చెందినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వీరిని అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ. లక్ష ఉంటుందని తెలిపారు.



హరేకృష్ణ

శ్రీకృష్ణుడి ఆంతరంగిక శక్తి.. రాధ

సత్యం సత్యం పునః సత్యం సత్యమేవ పునః పునః

వినా రాధా ప్రసాదేన మత్ప్రసాదో న విద్యతే

"ఓ నారదా! ఇది సత్యం, సత్యం. మళ్ళీ మళ్ళీ ఇదే సత్యం, ఇదే సత్యం అని చెబుతున్నాను. రాధ కృప లేనిదే... నా కృపను ఎవరూ పొందలేరు" అని నారద మహర్షికి స్వయంగా శ్రీకృష్ణుడు వివరించినట్టు 'నారద పురాణం' చెబుతోంది. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడితో సమానుడు కానీ, అధికుడు గానీ మరొకరు లేరు. బలంతో ఆయనను ఎవరూ జయించలేరు. అంతేకాదు, ఆయన బలవంతంగా నిర్వర్తించాల్సిన కార్యాలేవీ ముల్లోకాల్లోనూ లేవు. శ్రీకృష్ణుడు ఏది చేసినా... కేవలం ఆనందానుభూతికోసం, తన స్వీయ సంకల్పంతో మాత్రమే నిర్వహిస్తాడు. మరి అంతటి శ్రీకృష్ణుడు సైతం రాధ మీద ఆధారపడడం ఏమిటి?

శ్రీకృష్ణుడు అజేయుడు అయినప్పటికీ... ఆయనలో ఒక అద్భుతమైన గుణం ఉంది. అదే భక్తుల ప్రేమకు వశం కావడం. ఆయన తన భక్తుల విశుద్ధమైన సేవలకు మాత్రమే బద్ధుడు. ఎలాంటి స్వలాభాపేక్షా



లేకుండా, నిస్వార్థంతో చేసే సేవ భగవంతుణ్ణే కట్టిపడేసేటంత గొప్పది. శ్రీకృష్ణుడు సర్వాకర్షకుడు. అయితే ఆయనను ఆకర్షించే శక్తి మరేదైనా ఉందా అంటే... అవుననే చెప్పాలి. ఆ శక్తే శ్రీకృష్ణుడి ఆంతరంగిక శక్తి స్వరూపిణి అయిన శ్రీరాధికాదేవి.

దేవీ కృష్ణమయీ ప్రోక్తా రాధికా పరదేవతా
సర్వలక్ష్మీమయీ సర్వకాన్తిః సమ్మోహినీ పరా

"దివ్య దేవతా స్వరూపిణి అయిన రాధారాణి శ్రీకృష్ణుని అర్ధాంగి. సర్వలక్ష్ములలో ఆమే ప్రధానురాలు. సర్వాకర్షకుడైన భగవంతుణ్ణి సైతం ఆకర్షించగలిగే ఆకర్షణ ఆమెలో ఉంది. ఆమే దేవదేవుని ఆది అంతరంగిక శక్తి" అని 'శ్రీచైతన్య చరితామృతం' చెబుతోంది. అత్యుత్తమ భక్తికి ఆమె నిదర్శనం. శ్రీకృష్ణుడికి చేసే సకల సేవలు ఆమె ద్వారానే స్వామికి చేరుతాయి. రాధిక అంటే 'అత్యున్నత ఆరాధన' అని అర్థం. ఆమె విశుద్ధ భక్తితత్త్వం కలిగినది కనుకనే... శ్రీకృష్ణుడు ఆమె పట్ల ఆకర్షితుడవుతాడు.

"బృందావనధామంలో విశుద్ధ భక్తులందరూ రాధారాణి కృప కోసం ప్రార్థిస్తారు. పూర్ణత్వం తాలూకు శక్తితత్త్వానికి ఆమె ప్రతిరూపం. ఈ భౌతిక ప్రపంచంలో పరిపూర్ణమైన స్త్రీ రూపాన్ని ఆమె పోలి ఉంటుంది. అటువంటి తల్లి అయిన రాధ కృప... భక్తి శ్రద్ధలు కలిగిన వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది. ఆమె కృప పొందిన భక్తులను శ్రీకృష్ణుడు తక్షణమే స్వీకరిస్తాడు. కాబట్టి భక్తులు ముందుగా రాధ కృప కోసం ప్రార్థించాలి. తద్వారా భక్తియుత సేవల పట్ల మనలో నిద్రాణమై ఉన్న సహజమైన ప్రేమను తిరిగి మేల్కొలపగలుగుతాము" అని హరే కృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీల ప్రభుపాదులు తన 'శ్రీమద్భాగవత' వ్యాఖ్యానంలో తెలిపారు. రాధ ఆవిర్భవించిన పవిత్రమైన రోజు రాధాష్టమి. ఇది కృష్ణాష్టమికి పదిహేను రోజుల తరువాత వస్తుంది. ఈ పర్వదినాన రాధాకృష్ణులకు పుష్పాంజలి సమర్పిస్తూ "ఓ రాధారాణీ! దీనుడినైన నాపై దయచూపమని... దయచేసి నీ కృష్ణుడికి తెలియజేయి" అని ప్రార్థించాలి.

శ్రీచైతన్యుల పరంపరలో ఆచార్యులైన శ్రీల ప్రభుపాదులు... ఆ భగవత్ప్రేమను లోకానికి అందజేసిన మహనీయులు. భగవంతుడితో జీవుడు తన అనుబంధాన్ని పునఃస్థాపించుకోవడానికి ఆయన అందించిన అత్యంత సరళమైన మార్గమే హరినామ సంకీర్తన. 'హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే... హరే రామ హరే రామ రామ రామ హరే హరే' అనే మహామంత్రాన్ని జపిస్తూ... శ్రీ చైతన్య మహాప్రభువును ఆశ్రయించినవారు.... అజ్ఞానాంధకారమయమైన ఈ కలియుగాన్ని సులభంగా దాటగలరు. జీవితంలో పరిపూర్ణత సాధించగలరు.

(11న రాధాష్టమి)

శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984



'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/34DdJyVతో
చదవండి.

విశేషం

ఆకారం, ఆహార్యం...
అన్నిట్లోనూ మర్మాలే!

ఏకదంతం శూర్పకర్ణం గజవక్త్రం చతుర్భుజం
పాశాంకుశధరం దేవం ధ్యాయేత్ సిద్ధి వినాయకం...

అంటూ శ్రీగణేశ చతుర్థి రోజున శ్రీ సిద్ధి వినాయక వ్రతం చేసుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. పై శ్లోకం ఆ మహా గణపతి రూపాన్ని వర్ణిస్తుంది. ఆయన రూపంలోని ప్రతి అంశంలో ప్రతీకాత్మకత ఉంది. మంత్ర, జ్యోతిష శాస్త్రాల్లో, వేదాంతంలో గణపతి అవయవాల నుంచి ఆహార్యం వరకూ ప్రతిదానికీ ఒక నిర్వచనం ఉంటుంది. అవేమిటో తెలుసుకుందాం:



గజాననం: వినాయకుడిది ఏనుగు తల. అది అనంతమైన జ్ఞానానికీ, యోగశక్తికీ, మేధస్సుకూ, పరిపూర్ణతకూ చిహ్నం.

చిన్న కళ్ళు: చిన్నవిగా ఉండే ఆయన నేత్రాలు ఏకాగ్రతకు చిహ్నాలు. మాయామయమై, తప్పుదోవ పట్టించే లోకాన్ని నిశితంగా పరిశీలించి, ఏది వాస్తవమో దాన్నే పరిశీలించమని చెబుతాయి.

త్రినేత్రం: వినాయకుడి మూడో కన్ను ఆధ్యాత్మిక జ్ఞానానికి ప్రతీక.

వక్రతుండం: వంపు తిరిగిన తొండం ఓంకారానికి సంకేతం. మానవాళికి భ్రాంతి కలిగించే మాయకు వక్రమని పేరు. చెడు సంస్కారాలకు కూడా అది చిహ్నం. వాటిని నిర్మూలించేవాడు గణపతి.

శూర్పకర్ణం: గణపతి చెవులు పెద్దవిగా, నోరు చిన్నదిగా ఉంటుంది. ఎక్కువ వినాలి, తక్కువ మాట్లాడాలి. అప్పుడే మనిషి పరిపూర్ణుడవుతాడన్నది దీని వెనుక పరమార్థం. లోకంలోని ఆర్తుల ప్రార్థనలను తన పెద్ద చెవులతో గణపతి ఆలకిస్తాడు. అలాగే 'శూర్ప' అంటే చేట. వ్యర్థాలను తొలగించడం చేట చేసే పని. అజ్ఞానాన్ని తొలగించి, కేవలం జ్ఞానాన్ని మాత్రమే అందించే దైవం గణపతి అని ఇది సూచిస్తుంది.

లంబోదరం: విఘ్నేశ్వరుడి పొట్ట విశ్వానికి చిహ్నం. విశ్వాన్ని తనలో భరించే సామర్థ్యం, సర్దుబాటు తత్త్వాన్ని లంబోదరుడు ప్రదర్శిస్తున్నాడు. అలాగే, జీవితంలో ఎన్నో విషయాలు ఎదురవుతూ ఉంటాయి. అవి మంచివైనా, చెడువైనా సమానంగా, ప్రశాంతంగా స్వీకరించాలని అది సూచిస్తుంది.

నాగబంధం: విఘ్నేశుడి ఉదరానికి ఉండే నాగబంధం కుండలినీ శక్తికి ప్రతీక.

ఏకదంతం: ఏకదంతుడిగా వినాయకుడు విఖ్యాతుడు. ఎందుకంటే ఆయన రెండు దంతాల్లో ఒకటి విరిగి ఉంటుంది. పూర్తిగా ఉన్న దంతం వివేకానికీ, విరిగిన దంతం భావోద్వేగాలకూ సూచికలు. భావోద్వేగాలను వివేకంతో గెలవాలని అవి చెబుతాయి.

అభయహస్తం: గణేశుడి నాలుగు చేతుల్లో ఒకటి అభయహస్తం. లోకానికి ఆయన రక్షకుడని అది చెబుతుంది.

అంకుశం: వినాయకుడి రెండో చేతిలో గొడ్డలి ఉంటుంది. అది అజ్ఞానాన్ని ఖండిస్తుంది.

పాశం: విఘ్నేశుని మూడో చేతిలో ఉండే పాశం విఘ్నాలను తొలగిస్తుంది. కోరికలను నిర్మూలిస్తుంది.

జపమాల, మోదకం, పద్మం: గజాననుడి నాలుగో చేతిలోని వస్తువులు అలంకారాన్ని బట్టి మారుతూ ఉంటాయి. వాటిలో జపమాల జ్ఞాన సంపదకు సంకేతం. సాధన చేస్తే ఫలం లభిస్తుందని మోదకంతో ఉన్న హస్తం చెబుతుంది. తామర పువ్వు మానవ జీవితంలో అత్యంత ఉన్నత స్థితిగా చెప్పే ఆత్మ వివేకానికీ, మోక్షానికీ చిహ్నం.

మూషిక వాహనం: సమదర్శనానికి చిహ్నం. అలాగే ఎలుకను కోరికలకు ప్రతీకగా చెబుతారు. కోరికలను అదుపులో పెట్టాలి తప్ప అవి మనమీద స్వారీ చేయకూడదనేది మూషికవాహనంలోని సందేశం.


శ్రీగణేశ తత్త్వం

శ్రీగణేశుణ్ణి వినాయకచవితి రోజున పూజ చేసుకోవడం, ఆ రోజు ఆయన జన్మ వృత్తాంతాన్ని 'వినాయక వ్రతకల్పం'లో చదవడం, ఇళ్ళలో జరిగే శుభకార్యాలల్లో ముందుగా విఘ్నేశ్వర పూజ చేసుకోవడం... ఇవి అందరూ అనుసరిస్తున్నవే. పార్వతీదేవి నలుగుపిండితో (భూతత్త్వంతో) వినాయకుణ్ణి సృష్టించడం, తను స్నానానికి వెళ్ళినప్పుడు వినాయకుణ్ణి కాపలాగా పెట్టడం, శివుడు లోపలికి ప్రవేశించకుండా అతను అడ్డుకోవడం, కోపోద్రిక్తుడైన శివుడు అతని తలను ఖండించడం, తదనంతరం ఏనుగు తలను అతనికి శిరస్సు స్థానంలో అతికించడం, త్రిమూర్తులు, ఇతర దేవతలు తమ శక్తులను, ఆయుధాలను గణేశుడికి ప్రసాదించడం... ఇవన్నీ పురాణగాథగా మనకు ఇంతకుమునుపే తెలుసు. కానీ గణేశుణ్ణి గురించి తెలుసుకోవలసింది ఎంతో ఉంది. గణేశతత్త్వం ఒక మహా విజ్ఞాన సర్వస్వం. గణేశతత్త్వం గురించి సహజయోగ ప్రదాత శ్రీమాతాజీ నిర్మలాదేవి అనేక ప్రవచనాలలో ప్రస్తావించారు.

విశ్వ సృష్టి ఆరంభంలో... అంతా అంధకారం, శూన్యం. ఉన్నది ఒక్క సదాశివుడే. ఆయన తనలో భాగమైన ఆదిశక్తిని తననుంచి వేరు చేశాడు. తన అభీష్టం మేరకు చరాచర సృష్టి చెయ్యాలని దూరంగా పంపించాడు. ఆ క్రమంలో ఏర్పడిన భీకర శబ్దమే... ప్రప్రథమ నాదం... ఓంకారం. ఆ ఓంకారమే ఆదిదంపతుల ప్రథమ సృష్టి అయింది. అదే మంగళకరం, శుభప్రదం అయిన పవిత్రతామూర్తిని... శ్రీగణేశుణ్ణి సృష్టించింది. ఆ విధంగా పవిత్రతకు ప్రతీకగా, నిరాకారుడిగా శ్రీగణేశుడు ఆవిర్భవించాడు. ఓంకారం కూడా శ్రీగణేశుడి నిరాకారరూపమే. ఓంకార స్వరూపుడైన శ్రీగణేశుడు... చైతన్య రూపంలో విశ్వమంతటా వ్యాపించి ఉన్నాడు.

మానవ శరీరంలో అంతర్గతంగా ఏడు శక్తికేంద్రాలు... అంటే చక్రాలు, మూడు నాడులతో సూక్ష్మశరీర వ్యవస్థ భగవంతుడి శక్తితో నిర్మితమైన ఉంది. ఒక్కొక్క చక్రం, నాడి ఒక్కొక్క అధిష్ఠాన దేవత ఆధీనంలో ఉంటాయి. అన్నిటికన్నా ప్రప్రథమమైన మూలాధార చక్రంలో శ్రీగణేశుడు అధిష్ఠించి ఉంటాడు. అందుకే ఆయనకు ప్రథమ పూజ నిర్వహిస్తారు. గణేశుణ్ణి ఆరాధించడానికి ముందు ఆయన తత్త్వాన్ని, గుణాలను, లక్షణాలను తెలుసుకుందాం.

ఎవరైతే పవిత్రమైన నడవడికను కలిగి ఉంటారో.. వారిపట్ల గణేశుడు అత్యంత ప్రసన్నుడిగా ఉంటాడు. అందుకే ప్రాచీన భారతీయ సంస్కృతి సంప్రదాయాలన్నిటినీ శ్రీగణేశుణ్ణి ప్రసన్నం చేసుకొనే విధంగా... పవిత్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఋషులు రూపొందించారు. మూలాధార చక్రం పంచభూతాలలోని భూతత్త్వంతో నిర్మితమయింది. కాబట్టి మనం భూమాతను ఎంతగా గౌరవిస్తే... గణేశుడు అంతగా అనుగ్రహిస్తాడు. సామరస్య ధోరణి కూడా ఆయన తత్త్వమే. మన కుటుంబ సభ్యుల మధ్య వ్యక్తుల పట్ల ఆహ్లాదకరమైన సామరస్య దృష్టిని ఏర్పరచుకోవడానికి ఈ తత్త్వం ఉపయోగపడుతుంది. బలమైన కుటుంబ వ్యవస్థకు, ఆరోగ్యకరమైన సమాజానికి ఈ తత్త్వం అత్యవసరమని శ్రీమాతాజీ నిర్మలాదేవి స్పష్టం చేశారు.



సహజయోగ

గణేశుడిలోని మరొక విశిష్టత... ఆయనలోని జ్ఞాన సంపద. మనలోని జ్ఞానబీజం ఎదిగేకొద్దీ అప్రయత్నంగానే మనల్ని ధార్మికతలోను, ధర్మనిరతిలోను ఉంచుతుంది. ఈ తత్త్వం మనలో పెంపొందినప్పుడు... ఇతరులతో అకారణంగా దూకుడుతో వ్యవహరించం. పరులను హింసించం. మనది కానిది ఏదీ ఉచితంగా ఆశించం. ఇటువంటి వ్యక్తిత్వం కలిగిన జ్ఞానం శ్రీగణేశుడి వల్లనే వస్తుంది. అప్పుడు మనలో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. చదువులో మంచి ఫలితాలను సాధించగలం. అంతే కాదు, ఇది పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తుంది. అయితే... శ్రీగణేశుడు మనలోనే ఉన్నాడనే స్పృహ, సమర్పణభావం మనలో ఉండాలి. తద్వారా సమాజంలోని వాతావరణం పవిత్రంగా, నిర్మలంగా ఉంటుంది.

మనలోని కుండలినీశక్తి ఉత్థానం శ్రీగణేశుడి అనుమతితోనే జరుగుతుంది. ఆత్మసాక్షాత్కారం పొందుతున్న సమయంలో.. కుండలిని జాగృతం చెందినప్పుడు... ఆ గణేశుని జ్ఞానమే మన మెదడులోకి చేరుతుంది. ఎందుకంటే కుండలినిలో ఉన్న శక్తి ఆయనే. ఆ జ్ఞానాన్ని గనుక పొందితే... అన్ని చెడు అలవాట్లను, తప్పుడు ఆలోచనలను, అధర్మమైన, అనైతికమైన పనులను అప్రయత్నంగా మీరు విడిచిపెడతారు. అది జరగాలంటే.. గణేశతత్త్వం మీలో పెంపొందాలంటే... పసిపిల్లల్లో ఉండే అమాయకత్వం మీలో ఉండాలి. దాన్నే 'అబోధిత తత్త్వం' అంటారు. దాన్ని అనుసరిస్తే మనిషి ఆత్మసాక్షాత్కారం పొందుతాడు. భగవత్ సామ్రాజ్యంలోకి ప్రవేశించడానికి అనుమతి లభిస్తుంది.

గణేశుడు సర్వశక్తిమంతుడు. ఆదిశక్తి అయిన జగదంబ సృష్టించిన గణాలకు ఆయనే అధిపతి. మూలాధార చక్రంలోని అసమతుల్యత, లోపాలే మనలో కలిగే అనేక శారీరక, మానసిక అనారోగ్య సమస్యలకు, రుగ్మతలకు కారణం. గణేశుణ్ణి ప్రసన్నం చేసుకోవాలంటే... కేవలం పూజించడం మాత్రమే కాకుండా.. ఆయన తత్త్వాన్ని అర్థం చేసుకోవాలి. సమతుల్యత, సామరస్యం, అబోధిత తత్త్వం, సచ్ఛీలత, నిర్మలచిత్తం, సమర్పణ భావం, వినయ విధేయతలు, ఆత్మవిశ్వాసం, వివేకం, నిర్భయత్వం, ధర్మనిరతి లాంటి సద్గుణాలను గ్రహించి, మనలో స్థిరపరుచుకోవాలి. అదే నిజమైన ఆరాధన. ఇవన్నీ గణేశుని అనుగ్రహంవల్లే ప్రాప్తిస్తాయి. శ్రీమాతాజీ నిర్మలాదేవి ప్రవేశపెట్టిన సహయోగ సాధన దీనికి దోహదపడుతుంది.

డాక్టర్ పి. రాకేష్ 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి,
సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



గీతాసారం


విషాదం నుంచి జ్ఞానోదయం దాకా

"సమస్త దిశల నుంచి పొంగి ప్రవహిస్తూ నదులన్నీ వచ్చి సముద్రాన్ని చేరుతాయి. ఆ ప్రవాహ జలాలన్నిటినీ సముద్రం కలుపుకొంటుంది. కానీ తన హద్దులను ఏమాత్రం దాటిపోదు. అదే విధంగా సమస్త విషయాలను తెలుసుకుంటున్నా, సమస్త భోగాలు కళ్ళకు కనిపిస్తున్నా స్థితప్రజ్ఞుడు ఎటువంటి వికారానికి లోనుకాడు. అటువంటి వ్యక్తే శాంతిని పొందగలడు. భోగాల పట్ల ఆసక్తి ఉన్నవాడు మోక్షాన్ని పొందలేడు. ఏ వ్యక్తి అయితే సమస్తమైన కోరికలను విడిచిపెడతాడో, దేనిమీదా ఆశలేకుండా, అహంకార మమకారాలు లేకుండా ఉంటాడో... అతనే బ్రహ్మానందస్థితిని పొందుతాడు" అని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు చెప్పాడు. ఈ సందర్భంగా... శాశ్వతమైన స్థితిని (మోక్షాన్ని) పోల్చడానికి సముద్రాన్ని ఆయన ఉదాహరణగా తీసుకున్నాడు. దీనిద్వారా కొన్ని విషయాలు స్పష్టం చేశాడు. మొదటిది... ఇంద్రియాల ద్వారా నిరంతరం ప్రేరణలు, ప్రలోభాలు, కోరికలు తనలో ప్రవేశించినా... గంభీరమైన సముద్రంలా... శాశ్వతమైన స్థితిని పొందిన మనిషి స్థిరంగా ఉంటాడు. రెండోది... సముద్రంలో కలిసినప్పుడు నదులు తమ ఉనికిని కోల్పోతాయి. అదే విధంగా శాశ్వతమైన స్థితిని చేరుకున్న వ్యక్తిలో ప్రవేశించిన కోరికలు కూడా తమ ఉనికిని పోగొట్టుకుంటాయి. మూడోది... మనకు ఏదైనా దుఃఖదాయకంగా మారితే.. దానికి కారణం బాహ్య ప్రపంచం మనలో కలిగించే ఉద్రేకాలను నియంత్రించలేకపోవడమే. అందుకే... సముద్రంలా మనం కూడా అటువంటి అస్థిరమైన, అనిత్యమైన



ఉద్వేగాలను, ఉద్రేకాలను విస్మరించడం నేర్చుకోవాలని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు.

మనకు ఉన్న అవగాహన ప్రకారం... ప్రతి కర్మకు కర్త, కర్మఫలం ఉంటాయని అనుకుంటాం. మొదట... కర్మను, కర్మ ఫలాలను వేరుచేసే మార్గాన్ని శ్రీకృష్ణుడు బోధించాడు. ఆ తరువాత... కర్తను, కర్మను వేరు చేయడం కోసం అహంకారాన్నీ, కర్తృత్వ భావాలను వదిలెయ్యాలని సూచించాడు. ఈ శాశ్వతమైన శాంతి స్థితిని చేరుకున్నాక తిరిగి వెనక్కు వచ్చే ప్రసక్తే లేదు. అప్పుడు ఏ కర్మ అయినా... ఈ బ్రహ్మాండంలోని కోటానుకోట్ల చర్యలలో ఒకటిగా మిగిలిపోతుంది. కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడు విషాదంలో మునిగిపోయాడు. అది అర్జున విషాదయోగం. ఆ విషాదాన్ని సానుకూలంగా ఉపయోగించినప్పుడు... దానికి మోక్షాన్ని అందించే సామర్థ్యం ఉంటుందని 'భగవద్గీత'లోని రెండో అధ్యాయమైన 'సాంఖ్యయోగం'లో శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించాడు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

ఆలయదర్శనం

ఆదిత్యం గణనాథంచ దేవీ రుద్రంచ కేశవమ్... పంచదైవత మిత్యుక్తమ్

సూర్యుణ్ణి, గణపతిని, శక్తిని, రుద్రుణ్ణి, విష్ణువును పంచభూతాత్మకులని అంటారు. ఒక్కొక్క దైవానికి ఒక్కో విధమైన శక్తి ఉంటుంది. ఈ దైవాలు అందరినీ ఏకకాలంలో పూజించిన ఫలం ఒక్క గణపతిని పూజిస్తే లభిస్తుందనేది శ్రుతి వాక్యం. పంచాయతనంలో పరబ్రహ్మ స్వరూపుడైన గణపతి ముఖ్యుడు. తొలిపూజను అందుకొనే దైవం. గణపతిని సంతృప్తిపరచి, అనుగ్రహం పొందితే... అన్నీ సానుకూలం అవుతాయి. గణపతినే ప్రధానంగా ఉపాసించేవారిని 'గాణపత్యులు' అంటారు. గాణపత్య సంప్రదాయానికి పట్టుకొమ్మ... మరాఠా ప్రాంతం.

భారతీయులకు తొలి పండుగ వినాయక చవితి. భాద్రపద శుద్ధ చవితిని వినాయక చవితిగా... దేశమంతటా ఇంటింటా, వాడవాడలా జరుపుకొంటారు. సామూహికంగా నవరాత్రి ఉత్సవాలను ఎంతో ఆడంబరంగా నిర్వహిస్తారు. ఆయా ప్రాంతాల ప్రజలు వైదిక సంప్రదాయానుసారం స్వామిని పూజిస్తారు. గణపతి తత్త్వాన్ని 'క్షిప్రప్రసాద తత్త్వం' అంటారు. అంటే కోరిన వెంటనే కోరిక తీర్చే దయాగుణం. గణపతి రూపాలు అనేకం. అలాగే నామాలు కూడా. ప్రతి నామానికీ తనదైన ప్రత్యేకత ఉంది. శాస్త్రప్రకారం 108 నామాలున్నాయి. 'ముద్గల పురాణం'తో సహా పలు పురాణాలు 32 నామాలను, శిల్పశాస్త్రం 16 నామాలను చెప్పాయి. వాటిలో ఎనిమిది నామాలకు ప్రతీకగా... గాణపత్య సంప్రదాయానికి చెందిన అష్ట వినాయక క్షేత్రాలు మహారాష్ట్రలో ఏర్పాడ్డాయి. ఈ క్షేత్రాల్లో వినాయకుడు స్వయంభువుగా వెలిశాడని ప్రతీతి. అవి:

అష్ట గణపతి క్షేత్రాలు

మయూరేశ్వరుడు, మోర్గావ్

ఈ ప్రాంతంలో ఎక్కువగా నెమళ్ళు ఉండేవట. అందుకే అక్కడ వెలసిన గణపతికి 'మయూరేశ్వరుడు' అనే పేరు వచ్చింది. ఇది సింధు అనే రాక్షసుణ్ణి వినాయకుడు వధించిన ప్రదేశం. గర్భాలయంలో గణపతి... నెమలిపై ఆసీనుడై దర్శనమిస్తాడు. మూలవిరాట్టుకు ఎదురుగా... పెద్ద మూషికం కాళ్ళతో మోదకాన్ని పట్టుకొని ఉంటుంది. ఆలయానికి ఎనిమిది దిక్కుల్లో గణపతి విగ్రహాలు, వాటికి ఇరుపక్కలా ఆయన పత్నులైన సిద్ధి, బుద్ధి విగ్రహాలు ఉంటాయి. గణపతి శిరస్సుపై పాము పడగ ఉంటుంది.



శ్రీ సిద్ధి వినాయకుడు, సిద్ధిటెక్



మధు, కైటభులనే రాక్షసుల సంహార సమయంలో శ్రీహరికి గణపతి సిద్ధి కలుగజేసిన ప్రాంతంగా దీన్ని పరిగణిస్తారు. అందుకే దీన్ని 'సిద్ధిటెక్' అంటారు. ప్రసిద్ధమైన ఇతిహాసం కలిగిన క్షేత్రం ఇది. తమ జీవితంలో ఒక్కసారైనా ఈ గణపతిని దర్శించుకొని... సిద్ధిని పొందాలని మహారాష్ట్రీయులు ఆకాంక్షిస్తారు. ఇక్కడ వినాయకుడి తొండం కుడివైపు తిరిగి ఉండడం విశేషం. భీమా నదీతీరంలో... చిన్న కొండమీద, చుట్టూ కనువిందు చేసే ప్రకృతి మధ్య ఈ ఆలయం ఉంది.

మహాగణపతి, రంజన్‌గావ్

త్రిపురాసుల సంహారానికి వెళ్ళే ముందు గణపతి కోసం శివుడు ఇక్కడ తపస్సు చేశాడట. ఉత్తరాయణ, దక్షిణాయన సంధి కాలంలో సూర్యకిరణాలు నేరుగా స్వామిపై ప్రసరించేలా ఈ ఆలయ నిర్మాణం జరిగింది. గర్భాలయంలో రెండు మూలవిరాట్టులుంటాయి. ఒకటి చాలా పెద్దది. రెండోది దాని కింద ఒక అరలో ఉంటుంది. ఈ రెండిటినీ భక్తులు దర్శించుకోవచ్చు. వేరే మతాలకు చెందిన రాజులు సాగించిన విధ్వంసానికి గురికాకుండా... ఆ విగ్రహాన్ని అరలో దాచి ఉంచారనేది చారిత్రక కథనం.



విఘ్నహర గణపతి, ఓజర్



పూర్వం అభినందనుడనే రాజు గణపతి కోసం చేస్తున్న తపస్సును భంగం చెయ్యడానికి... విఘ్నాసురుణ్ణి ఇంద్రుడు సృష్టించాడు. ఇది తెలిసిన గణపతి ఆ అసురుణ్ణి ఇక్కడ సంహరించి, విఘ్నహర గణపతిగా వెలిశాడు. ఈ ఆలయం కుకుడీ నదీ తీరంలో.. తూర్పుకు అభిముఖంగా ఉంటుంది.

చింతామణి గణపతి, తేయూర్

మోరయా గోసావీ అనే భక్తుడి తపస్సుకు మెచ్చిన విఘ్నేశ్వరుడు... వ్యాఘ్ర (పులి) రూపంలో ఇక్కడ దర్శనమిచ్చాడట. దానికి చిహ్నంగా... ఈ ఆలయం ముందు వ్యాఘ్ర రూపం కనిపిస్తుంది. కపిలముని ఈ ఆలయాన్ని నిర్మించాడనీ, గణపతికి చింతామణిని సమర్పించాడనీ స్థలపురాణం చెబుతోంది. దేవేంద్రుడు, అంగారకుడు తదితర గ్రహాలు, దేవతలు... గణపతిని అర్చించిన క్షేత్రం ఇది. ఇక్కడ విఘ్నేశ్వరుడు నిత్యం అనేక దివ్యాలంకారాలతో భక్తులకు దర్శనమిస్తాడు.



గిరిజాత్మక గణపతి, లేన్యాద్రి



వినాయకుడి తలని శివుడు ఖండించినప్పుడు పార్వతి తీవ్ర దుఃఖంలో మునిగిపోయింది. ఆ దుఃఖాన్ని తొలగించడం కోసం శివుడు గజముఖాన్ని అమర్చి, వినాయకుణ్ణి తిరిగి బతికించాడు. అది జరిగిన ప్రాంతం ఇదేననీ, దానికి సంకేతంగా.. గణపతి ఇక్కడ కొండ మీద గజముఖుడిగా, గిరిజాత్మకుడిగా కొలువు తీరాడనీ స్థలపురాణం వివరిస్తోంది. 'గణేశ పురాణం'లోనూ ఈ ఆలయ ప్రశస్తి ఉంది. ఆలయం ఉన్న కొండ చుట్టూ గుహలు, బౌద్ధుల ఆరామాలు ఉన్నాయి.

భల్లాలేశ్వర గణపతి, పాలీ

భల్లాలుడు అనే బాలుని కోరిక మేరకు భల్లాలేశ్వరుడిగా గణపతి ఇక్కడ వెలిశాడు. ప్రతిరోజూ ఉదయం సూర్యుడి తొలికిరణాలు సభామండపం మీదుగా వచ్చి, గణపతి పాదాలను స్పృశిస్తాయి. ప్రధానమందిరం వెనుక వైపు శ్రీడుండి వినాయక మందిరం ఉంది. ఈ ఆలయం గొప్పతనాన్ని 'ముద్గల పురాణం', 'గణేశ పురాణం' విశదంగా వివరించాయి.



వరద వినాయకుడు, మహడ్



ఇక్కడ వేదకాలం నుంచి గణపతి ఉన్నాడనీ, కొలనులో కొలువైన గణేశుణ్ణి గృత్సమద మహర్షి 'గణానాం త్వామ్...' అనే వేద మంత్రం ఉపాసించి సాక్షాత్కరింపజేసుకున్నాడనీ, అనంతరం కొలను నుంచి గణపతి విగ్రహాన్ని వెలికి తీసి ప్రతిష్ఠించాడనీ స్థల పురాణం చెబుతోంది. గృత్సమద మహర్షిని గాణపత్య సంప్రదాయానికి తొలి ప్రవక్తగా గాణపత్యులు భావిస్తారు. గర్భాలయంలో స్వయంగా స్వామిని పూజిస్తే వరదానం అనుగ్రహిస్తాడని భక్తుల విశ్వాసం.

ఈ ఆలయాలన్నీ మహారాష్ట్ర ప్రధాన నగరాల్లో ఒకటైన పుణేకి సమీపంలో ఉన్నాయి. ఈ ఆలయాలు, మూలవిరాట్టులు... పురాణేతిహాస చరిత్ర కలిగినవి. పశ్చిమ కనుమల ప్రకృతి సౌందర్యంతో విలసిల్లుతూ ఉంటాయి. ఒకటి లేదా రెండు రోజుల్లో ఈ అష్ట వినాయకులను దర్శించుకోవచ్చు.

• ఆయపిళ్ళ రాజపాప



పదిహేనేళ్ల ప్రయాణం

అక్కినేని నాగచైతన్య తెలుగు చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి పదిహేనేళ్లు అయింది. ఆయన నటించిన తొలి చిత్రం 'జోష్' 2009 సెప్టెంబర్ 5న విడుదలైంది. ఈ పదిహేనేళ్ల ప్రయాణంలో విలక్షణమైన పాత్రలు ఎన్నో పోషించి, మంచి నటుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం నాగచైతన్య 'తండేల్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆ చిత్ర యూనిట్ ప్రత్యేకమైన పోస్టర్ విడుదల చేసింది. సముద్రం దగ్గర ఫిషింగ్ బోట్ మీద నిల్చుని చిరునవ్వు చిందిస్తున్న చైతు లుక్ ఆకట్టుకుంది. అల్లు అరవింద్ సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. బన్నీ వాస్ నిర్మాత.

ఎలాంటి సాయం కావాలన్నా చేస్తాం

డి.సురేశ్‌బాబు



తెలుగు రాష్ట్రాల్లో వరద ముప్పు బారిన పడిన బాధితుల కోసం ఇప్పటికే తెలుగు సినీ ప్రముఖులు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధికి భారీ మొత్తంలో విరాళాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. వరద బారిన పడిన కుటుంబాలను ఆదుకోవడానికి తెలుగు చలన చిత్రసీమ ప్రముఖులు గురువారం ఓ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిల్మ్ చాంబర్ గౌరవ కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడుతూ "ఫిల్మ్ చాంబర్ తరపున రూ.25 లక్షలు.. నిర్మాతల తరపున రూ.10 లక్షలు.. ఫెడరేషన్ తరపున రూ.5 లక్షలు రెండు తెలుగు రాష్ట్రాలకు విరాళంగా ఇస్తున్నాం" అని చెప్పారు. "మా దగ్గుబాటి కుటుంబం తరపున బాధితుల కోసం రూ.కోటి విరాళం అందజేస్తున్నాం. కేవలం డబ్బులే కాకుండా.. నిత్యావసరాలను కూడా పంపిణీ చేస్తాం. బాధితులకు ఎలాంటి సాయం కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం" అని డి. సురేశ్‌బాబు అన్నారు. "మేమంతా ఈ స్థాయిలో ఉండటానికి కారణం.. మమ్మల్ని ఆదరించిన ప్రజలే. వరద బారిన పడిన వారందరినీ తప్పకుండా ఆదుకుంటాం" అని దర్శకుడు కె.రాఘవేంద్ర రావు తెలిపారు. "మా నిర్మాణ సంస్థ తరపున తెలంగాణకు రూ.25 లక్షలు.. ఆంధ్రప్రదేశ్‌కు రూ.25లక్షలు ప్రకటిస్తున్నాను. ఇండస్ట్రీలోని వారంతా ఈ సమయంలో ముందుకు వచ్చి విరాళాలు అందించాలి" అని నిర్మాత దిల్ రాజు కోరారు. ఈ కార్యక్రమంలో తమ్మారెడ్డి భరద్వాజ, ప్రసన్నకుమార్, జెమినీ కిరణ్, అశోక్ కుమార్, అనిల్ అవిస్మరాజు, భరత్ చౌదరి పాల్గొన్నారు.

దగ్గుబాటి కుటుంబం	రూ.కోటి
దిల్ రాజు	రూ.50 లక్షలు
ఫిల్మ్ చాంబర్	రూ.50 లక్షలు
నిర్మాతల మండలి	రూ.20 లక్షలు
ఫిల్మ్ ఫెడరేషన్	రూ.10 లక్షలు

32వ సినిమా విడుదలకు ముహూర్తం



విభిన్న కథాంశాలు ఎన్నుకొని వరుస హిట్స్‌తో దూసుకుపోతున్న నాని తన 32వ చిత్రం వివరాలు గురువారం ప్రకటించారు. 'హిట్ 3' చిత్రంలో తన లుక్‌ని, గ్లింప్స్‌ను విడుదల చేశారు. డాక్టర్ శైలేష్ కొలను ఈ సినిమాకు దర్శకుడు. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. సిగార్ తాగుతూ, కారు నడుపుతూ రక్తపు చేతులు, గొడ్డలితో ఫెరోషియస్‌గా కనిపించారు నాని. 'హిట్ 3'లో ఆయన అర్జున్ సర్కార్‌గా కనిపించబోతున్నారు. ఈ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని దర్శకుడు చెప్పారు. 2025 వేసవి సందర్భంగా మే ఒకటిన సినిమాను విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. 'హిట్ 3' చిత్రానికి సాను జాన్ వర్గీస్ ఛాయాగ్రహణాన్ని, మిక్కీ జే మేయర్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.

వినోదాన్ని పంచే సినిమా



ఫరియా అబ్దుల్లా నటించిన తాజా చిత్రం 'మత్తు వదలరా 2'. ఇది 2019 విడుదలై సూపర్ హిట్ అయిన 'మత్తు వదలరా' సినిమాకు సీక్వెల్. ఈ నెల 13న విడుదలవుతున్న సందర్భంగా ఫరియా మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమా ఒక డిఫరెంట్ థ్రిల్లర్. ఎన్నో ట్విస్ట్‌లు, సర్‌ప్రైజ్‌లతో కూడిన కథ ఇది. ఇందులో పాత్రధారుల కష్టాల నుంచే కామెడీ పుడుతుంది. ఈ సినిమాలో సన్నిధి అనే స్పెషల్ ఏజెంట్ పాత్రలో కనిపిస్తాను. నాది యాక్షన్‌తో నిండిన పాత్ర. దర్శకుడు రితేష్ రాణాకు ఫిల్మ్ మేకింగ్‌లో చాలా అవగాహన ఉంది. ప్రతీ విషయంలో క్లారిటీగా ఉంటారు. కాలభైరవ ఇచ్చిన సంగీతం సినిమాకు అదనపు ఆకర్షణ. ఈ సినిమా మొదటి భాగం కంటే మరింత వినోదాన్ని పంచుతుంది. ప్రస్తుతం తిరువీర్‌తో ఓ ప్రేమకథలో నటిస్తున్నా. త్వరలోనే ఓ తమిళ చిత్రం కూడా మొదలవ్వబోతోంది" అని ఫరియా చెప్పారు.



మహిళల భద్రతకు కమిషన్ ఏర్పాటు చేయండి

మంచు విష్ణు



తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళల రక్షణ, భద్రత మెరుగుపరచడం కోసం ఇండస్ట్రీలోని మహిళలే ప్రాతినిధ్యం వహించేలా ఒక కమిషన్ వేయాలని 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణు తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి సోషల్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.

హేమ కమిటీ నివేదికపై ప్రత్యేక ధర్మాసనం

జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో నమోదైన కేసులపై విచారణ జరిపేందుకు ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక ధర్మాసనాన్ని కేరళ హైకోర్టు ఏర్పాటు చేయనుంది. హేమ కమిటీ రిపోర్ట్‌ను బహిర్గతం చేయడానికి అనుమతిస్తూ ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ ముస్తాఖ్, జస్టిస్ ఎస్. మను మదేతో కూడిన ధర్మాసనం మహిళా న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటుపై మౌఖిక ఆదేశాలు ఇచ్చింది.

సంస్కృత టీచర్స్‌కు అంకితం



రచయిత, దర్శకుడు జనార్ధన మహర్షి 'శ్లోక' పేరుతో ఓ సంస్కృత చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రాగిణి ద్వివేది ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని జనార్ధన మహర్షి కుమార్తెలు శ్రావణి, శర్వాణి నిర్మాతలు. ఈ సినిమా గురించి జనార్ధన మహర్షి వివరిస్తూ 'సినిమాలోని కీలకమైన రుద్రభూమి సన్నివేశాలను బెంగళూరు, మైసూర్‌లో చిత్రీకరించాం. దేశంలోని పురాతనమైన అనేక శ్మశానాలలో షూటింగ్ చేశాం. సంస్కృతంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాను అనేక భారతీయ భాషల్లోకి అనువదిస్తాం. గురువారం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మా చిత్రాన్ని సంస్కృత టీచర్స్‌కు అంకితం ఇస్తున్నాం' అని చెప్పారు. ఈ సినిమాలో తనికెళ్ల భరణి కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఇన్ ప్రోగ్రెస్

రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



యువతరానికి నచ్చే అంశాలు, కుటుంబ భావోద్వేగాల మేళవింపుతో రూపొందిన రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'రోటీ కపడా రొమాన్స్' అక్టోబరు 4న విడుదల కానుంది. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, కుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటించారు. విక్రమ్‌రెడ్డి దర్శకుడు. బెక్కెం వేణుగోపాల్, సృజన్‌కుమార్ బొజ్జం నిర్మాతలు. సినిమాలో ప్రతి పాత్ర యూత్‌కు కనెక్ట్ అవుతుందనీ, రొమాన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్స్ ప్రధాన బలాలు అని దర్శకుడు తెలిపారు. కొత్త పాయింట్‌తో రూపుదిద్దుకున్న ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందనీ, అది ఏ రేంజ్ అనేది ప్రేక్షకులు నిర్ణయిస్తారనీ నిర్మాతలు చెప్పారు.


స్పీడ్‌గా..



గణేశ్, హేమంత్, ప్రీతీ సుందర్, జాహ్నవి నటించిన 'స్పీడ్ 220' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో హీరోలిద్దరూ పోటీ పడి నటించారనీ, ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా అలరించే విధంగా సినిమా ఉంటుందని దర్శకుడు హర్ష బేజాగం తెలిపారు. కె.ఫణి, ఎం.సూర్యనారాయణ, ఎం.దుర్గారావు ఈ సినిమాను నిర్మించారు.










పెగులా

స్వియాటెక్‌కు షాక్

- పెగులా చేతిలో చిత్తు
- సెమీస్‌లో సినర్
- యూఎస్ ఓపెన్

న్యూయార్క్: ఈ ఏడాది యూఎస్ ఓపెన్ సంచలనరీతిలో సాగుతోంది. అదరగొడతారనుకున్న స్టార్లంతా ఆరంభం నుంచే అనూహ్య రీతిలో వెనుదిరుగుతున్నారు. తాజాగా వరల్డ్ నెంబర్‌వన్ ఇగా స్వియాటెక్ (పోలెండ్) కూడా అదే జాబితాలో చేరింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఈ మాజీ చాంపియన్ 2-6, 4-6 తేడాతో ఆరో సీడ్ జెస్సికా పెగులా (యూఎస్ఏ) చేతిలో చిత్తుగా ఓడింది. గతంలో పెగులా ఆరుసార్లు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో క్వార్టర్స్‌కు చేరినా ఒక్కసారి కూడా గెలువలేకపోయింది. ఈసారి మాత్రం సంపూర్ణ ఆధిపత్యంతో కెరీర్‌లో తొలిసారి సెమీస్‌లో అడుగుపెట్టింది. అటు స్వియాటెక్ మాత్రం పేలవ సర్వీస్, ఫోర్‌హ్యాండ్ షాట్లతో మూల్యం చెల్లించుకుంది. ఏకంగా 41 అనవసర తప్పిదాలకు పాల్పడింది. దీంతో తీవ్ర అసహనానికి గురైన తను ఓ దశలో రాకెట్‌ను నెట్‌పైన కొట్టింది. కేవలం ఒక్కసారి మాత్రమే ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేయగలిగింది. మరో క్వార్టర్స్‌లో అన్‌సీడెడ్ మచోవా 6-1, 6-4 తేడాతో బియాట్రిజ్ హడ్డడ్ (బ్రెజిల్)పై గెలిచి ఈ గ్రాండ్‌స్లామ్‌లో వరుసగా రెండోసారి సెమీస్‌కు చేరింది. శుక్రవారం నాటి సెమీస్‌లో మచోవ-పెగులా, సబలెంక (బెలారస్)-ఎమ్మా నవారో (యూఎస్ఏ) తలపడనున్నారు.


సినర్

సినర్ సెమీస్‌కు..: పురుషుల సింగిల్స్‌లో జానిక్ సినర్ 'టాప్' షో కొనసాగుతోంది. గురువారం జరిగిన క్వార్టర్స్‌లో మెద్వెదెవ్ (రష్యా)పై 6-2, 1-6, 6-1, 6-4 తేడాతో గెలిచి సెమీస్‌లో అడుగుపెట్టాడు. తాజా గ్రాండ్‌స్లామ్‌లో సినర్ కేవలం రెండు సెట్లు మాత్రమే కోల్పోయాడు. శనివారం జరిగే సెమీస్‌లో సినర్-జాక్ డ్రేపర్ (బ్రిటన్), ఫ్రాన్స్ ద్వయం టేలర్ ఫ్రిట్జ్-ఫ్రాన్సెస్ టియాఫో తలపడనున్నారు.

అక్షర్ ఆల్‌రౌండ్ షో

'అనంత'లో దులీప్ ట్రోఫీ షురూ


అక్షర్

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): అక్షర్ పటేల్ ఆల్‌రౌండ్ షో (86, 2/16)తో అదరగొట్టడంతో ఇండియా 'సి'తో గురువారం ప్రారంభమైన నాలుగు రోజుల దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో తొలిరోజు ఇండియా 'డి' పైచేయి ప్రదర్శించింది. టాస్ కోల్పోయి బ్యాటింగ్ చేపట్టిన ఇండియా 'డి' 48/6తో దయనీయస్థితిలో నిలిచింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన అక్షర్ అద్భుతంగా బ్యాటింగ్ చేయడంతో ఇండియా 'డి' మొదటి ఇన్నింగ్స్‌లో 164 పరుగులకు ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఇండియా 'సి' ఆట ఆఖరికి 91/4తో కష్టాల్లో పడింది.

శతక్కొట్టిన ముషీర్

బెంగళూరు: ముషీర్ ఖాన్ అజేయ శతకం (105 బ్యాటింగ్)తో చెలరేగడంతో ఇండియా 'ఏ'తో ఇక్కడ మొదలైన మరో మ్యాచ్‌లో మొదటి రోజు ఆఖరికి ఇండియా 'బి' తొలి ఇన్నింగ్స్‌లో 202/7 స్కోరు చేసింది. రోడ్డు ప్రమాదం నుంచి కోలుకొన్నాక తొలిసారి రెడ్‌బాల్ క్రికెట్ బరిలో దిగిన కీపర్ పంత్ (7) నిరాశ పరిచాడు. ముషీర్‌తోపాటు నవ్‌దీప్ సైనీ (29 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

ఇప్పటికి.. 25

పాతిక పతకాలతో భారత్ అదుర్స్


కపిల్ కంచు పట్టు

జూడోలో కపిల్‌కు అనూహ్య కాంస్యం

పారాలింపిక్స్

పారిస్: గత మూడు రోజులుగా పతకాల పంట పండించిన భారత్ జోరు నెమ్మదించింది. గురువారం.. దృష్టిలోపం ఉన్న పారా జుడోకా కపిల్ పర్మార్ కాంస్యం మాత్రమే భారత్ ఖాతాలో చేరింది. దీంతో ఈ క్రీడల్లో లక్ష్యంగా పెట్టుకొన్న మొత్తం పతకాల సంఖ్య 25 (5 స్వర్ణ, 9 రజత, 11 కాంస్య)కు చేరింది. ఇంకా పలు పోటీలు మిగిలివున్న నేపథ్యంలో భారత్ ఇప్పటికే అనుకున్న టార్గెట్‌ను చేరడం అవి ంతానందాన్ని కలిగించేదే. 64 సంవత్సరాల పారాలింపిక్స్ చరిత్రలో భారత్ ఇన్ని పతకాలు ఎప్పుడూ సాధించలేదు. టోక్యో ఒలింపిక్స్‌లో 19 పతకాలు కైవసం చేసుకుంది.

పురుషుల జూడో జె-1 60 కిలోల విభాగం కాంస్య పోరులో పర్మార్ 10-0తో ఎలియల్‌టన్ డి ఒలివేరియా (బ్రెజిల్)ను మట్టికరిపించాడు. జూడోలో భారత్‌కు పతకం రావడం ఇదే తొలిసారి. సెమీస్‌లో పర్మార్ 0-10తో బనితబ ఖుర్రమ్ అబాడి (ఇరాన్) చేతిలో ఓడాడు. 2022 ఆసియా క్రీడల్లో కపిల్ రజతం సాధించాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన పర్మార్ పొలంలో ఆడుకొంటూ మోటార్‌ను ముట్టుకోగా షాక్ తగిలింది. స్పృహతప్పి పడిపోయిన అతడిని గ్రామస్థులు గుర్తించి ఆసుపత్రిలో చేర్చారు. ఆరు నెలలపాటు కోమాలో ఉన్న కపిల్ ప్రాణాలతో బయటపడినా కంటిచూపు దెబ్బతింది. కపిల్ తండ్రి ఓ టాక్సీ డ్రైవర్ కాగా.. అతడి రెండో అన్న లలిత్ జూడో నేర్చుకొనే వాడు. అతడి సహకారంతోనే పర్మార్ కూడా బ్లైండ్ జూడోను నేర్చుకొన్నాడు. కాగా, బతుకు తెరువు కోసం కపిల్ అన్నతో కలసి టీస్టాల్ నడుపుతున్నాడు. మహిళల 48 కిలోల జె-2 కేటగిరీ రెపిచేజ్ రౌండ్‌లో కోకిల 0-10తో ఇవనిత్సిక (ఉక్రెయిన్) చేతిలో ఓడింది.

హర్వీందర్‌కు 'డబుల్' మిస్..

స్వర్ణంతో అదరగొట్టిన రికర్వ్ ఆర్చర్ హర్వీందర్ సింగ్ త్రుటిలో రెండో పతకాన్ని చేజార్చుకొన్నాడు. మిక్స్‌డ్ రికర్వ్‌లో షూటా‌ఫ్‌లో తడబడిన హర్వీందర్ జంట పాయింట్ తేడాతో కంచు పతకం చేజార్చుకొంది. కాంస్య పోరులో హర్వీందర్-పూజ జోడీ 4-5తో స్లొవేనియాకు చెందిన డెజాన్ ఫాబ్‌కిక్-జివా లావ్రింక్ చేతిలో పోరాడి ఓడింది. 1, 3 సెట్లలో భారత్ జోడీ నెగ్గగా.. 2, 4 సెట్లలో స్లొవేనియా జంట గెలవడంతో స్కోరు 4-4తో సమమైంది. కానీ, షూటా‌ఫ్‌లో హర్వీందర్ (8 పాయింట్లు), పూజ (9 పాయింట్లు) మొత్తం 17 పాయింట్లు సాధించగా.. స్లొవేనియా జంట 19 పాయింట్లు స్కోరు చేసి గెలిచింది. సెమీస్‌లో హర్వీందర్-పూజ జంట 2-6తో ఇటలీకి చెందిన ఎలిజబెటా-స్టెఫనో ట్రావిశాని చేతిలో పరాజయం పాలైంది.

షూటర్ల గురి తప్పింది..

మిక్స్‌డ్ 50 మీటర్ల ప్రోన్ ఎస్‌హెచ్1లో భారత షూటర్లు ఫైనల్‌కు చేరుకోలేకపోయారు. మోనా అగర్వాల్ 610.5 పాయింట్లతో 30వ స్థానంలో, సిద్దార్థ బసు 615.5 పాయింట్లతో 22వ స్థానంలో నిలిచారు.

సిమ్రన్‌కు 4వ స్థానం



మహిళల 100 మీటర్ల టీ12 కేటగిరీలో భారత అథ్లెట్ సిమ్రన్ నాలుగో స్థానంలో నిలిచింది. ఫైనల్లో తలపడిన నలుగురిలో సిమ్రన్ 12.31 సెకన్ల టైమింగ్‌తో విఫలమైంది. ఒమారా డ్యూరాండ్ 11.81 సెకన్ల టైవింగ్‌తో స్వర్ణం సొంతం చేసుకోగా.. ఒక్సానా (ఉక్రెయిన్), కట్రీన్ మ్యూలర్ (క్యూబా) రజత, కాంస్యాలు దక్కించుకొన్నారు.

అశోక్ విఫలం..

పవర్ లిఫ్టింగ్ 65 కిలోల విభాగంలో భారత ఆటగాడు అశోక్ ఆరో స్థానంలో నిలిచాడు. మూడు ప్రయత్నాల్లో 196, 199 కిలోల బరువు ఎత్తిన అశోక్.. మూడో ప్రయత్నంలో 206 కిలోలు లిఫ్ట్ చేయలేక పోయాడు.

ధరమ్‌బీర్, ప్రణవ్‌కు స్వర్ణ, రజతాలు

క్లబ్ త్రోలో భారత ఆటగాళ్లు ధరమ్‌బీర్, ప్రణవ్ సూర్మ స్వర్ణ, రజతాలతో అదరగొట్టారు. బుధవారం రాత్రి జరిగిన పురుషుల ఎఫ్51 క్లబ్ త్రో ఫైనల్లో వరల్డ్ చాంపియన్‌షిప్స్ కాంస్య పతక విజేత ధరమ్‌బీర్ (35) ఆసియా రికార్డు 34.92 మీటర్లు విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. నాలుగు ప్రయత్నాలు ఫౌల్ కాగా.. ఐదో ప్రయత్నంలో రికార్డు ఫీట్‌తో పసిడి పట్టేశాడు. కాగా, 29 ఏళ్ల ప్రణవ్ 34.59 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు. పారాలింపిక్స్‌లో భారత ఆటగాళ్లు తొలి రెండు స్థానాల్లో నిలవడం ఇదే తొలిసారి. అయితే, 2017 వరల్డ్ చాంపియన్‌షిప్స్ రజత పతక విజేత అమిత్ కుమార్ సరోహ 23.96 మీటర్ల దూరమే విసిరి పదో, చివరి స్థానంలో నిలిచాడు. రజతం సాధించిన సూర్మది హరియాణాలోని ఫరీదాబాద్. అతడికి క్రికెట్, రోలర్ స్కేటింగ్ అంటే ఎంతో ఇష్టం. కానీ, 16 ఏళ్ల వయసులో ఓ సిమెంట్ పలక తలపై పడడంతో వెన్నెముక దెబ్బతింది. దీంతో వీల్‌చైర్‌కే పరిమితమయ్యాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ధైర్యంతో ఆటతోపాటు చదువులోనూ రాణించాడు. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ నుంచి పీజీ చేసిన ప్రణవ్ బ్యాంక్ ఆఫ్ బరోడాలో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం సాధించాడు.


ధరమ్‌బీర్


ప్రణవ్

మహిత్, అభినవ్‌కు పతకాలు

హనోవర్ (జర్మనీ): ప్రపంచ బధిర షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు మహిత్ సంధు స్వర్ణం, అభినవ్ దేశ్వాల్ రజతం కొల్లగొట్టారు. గురువారం ముగిసిన ఐదో రోజు పోటీల్లోని మహిళల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఫైనల్లో మహిత్ 247.4 స్కోరుతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో మహిత్‌కు ఇది రెండో స్వర్ణం కాగా, మొత్తంగా మూడో పతకం. ఇంతకుముందు మహిత్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్‌లో ధనుష్ శ్రీకాంత్‌తో కలిసి స్వర్ణం, 10 మీ. ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో రజతం సాధించింది. పురుషుల 25 మీ. పిస్టల్ విభాగంలో అభినవ్ దేశ్వాల్ ఒక్క పాయింట్ తేడాతో స్వర్ణం కోల్పోయి, రజతంతో సరిపెట్టుకున్నాడు. ఇక, ఈ టోర్నీలో భారత్ ఇప్పటివరకు 4 స్వర్ణాలు సహా 15 పతకాలు సాధించింది.

క్వార్టర్‌ఫైనల్లో తనీషా జోడీ

తైపీ: భారత్‌కు చెందిన తనీషా క్రాస్టో/ధ్రువ్ కపిల జోడీ తైపీ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించింది. ఇక పురుషుల సింగిల్స్‌లో భారత పోరాటం రెండో రౌండ్‌కే పరిమితమైంది. గురువారం జరిగిన రౌండ్-16 పోరులో తనీష/కపిల ద్వయం 21-13, 22-20తో తైపీ జంట కో చి చాంగ్/యెన్ యు లిన్‌ను చిత్తు చేసింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో సతీష్ కుమార్ 19-21, 19-21తో కో క్వాన్ (తైపీ) చేతిలో, సుబ్రమణియన్ 22-24, 12-21తో లిన్ చున్ చేతిలో ఓటమిపాలయ్యారు.

మార్కెట్లోకి మెర్సిడెస్ బెంజ్ మేబాక్ ఈక్యూఎస్ 680


ధర రూ.2.25 కోట్లు

న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ తొలి పూర్తి విద్యుత్ కారు మేబాక్ ఈక్యూఎస్ 680 ఎస్‌యూవీని మార్కెట్లోకి తెచ్చింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.2.25 కోట్ల నుంచి ప్రారంభమవుతుం ది. అల్ట్రా లగ్జరీ విభాగంలో డిజిటల్, ఎలక్ట్రిక్ కార్ల సెగ్మెంట్‌లో అగ్రస్థానం సాధించాలన్న తమ ఆశయానికి ఇది బలం చేకూరుస్తుందని మెర్సిడెస్-బెంజ్ ఇండియా సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్ అయ్యర్ తెలిపారు. మేబాక్ అమ్మకాలపరంగా ప్రస్తుతం తాము ప్రపంచంలోని టాప్ 10 మార్కెట్లలో ఒకటిగా చేరామని, టాప్ 5 మార్కెట్లలోకి చేరడం లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన అన్నారు.

మత్తు రహిత తెలంగాణకు పూర్తి మద్దతు

తెలంగాణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్

హైదరాబాద్: మత్తు రహిత సమాజ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలకు తెలంగాణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ (టీసీడీఏ) పూర్తి మద్దతు ప్రకటించింది. అలవాటుగా మత్తుకు దారి తీసే ఔషధాలు దుర్వినియోగం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం, ఔషధ నియంత్రణ సంస్థ (డీసీఏ) చేపడుతున్న చర్యలకూ పూర్తిగా సహకరిస్తామని తెలిపింది. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్లపై మాత్రమే ఇలాంటి మందులను కొనేలా.. తమ సభ్యుల ద్వారా రోగులకు అవగాహన కల్పిస్తోంది. పాత ప్రిస్క్రిప్షన్లకు స్వస్తి చెప్పి రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ తాజాగా ప్రిస్క్రైబ్ చేసిన మత్తుకు దారి తీసే ఔషధాలను మాత్రమే అమ్మాలని టీసీడీఏ తన సభ్యులకు విజ్ఞప్తి చేసింది. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం, డీసీఏ ద్వారా ఎప్పటికప్పుడు 33 జిల్లాల కెమిస్ట్ సంఘాలకు ఈ విషయంలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీసీడీఏ వెల్లడించింది.

ఈవీలకు సబ్సిడీ అనవసరం

న్యూఢిల్లీ: వాహన కొనుగోలుదారులు ఇప్పుడు స్వచ్ఛందంగానే ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ), సీఎన్‌జీ కార్లకు ప్రాధాన్యత ఇస్తున్నందు వల్ల విద్యుత్ వాహన తయారీదారులకు ఇక సబ్సిడీలు ఇవ్వాల్సిన అవసరం లేదని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి అన్నారు. ప్రారంభంలో విద్యుత్ వాహనాల తయారీ ఖర్చులు అధికంగా ఉండేవని, కాని ఇప్పుడు డిమాండు పెరిగి ఉత్పత్తి వ్యయాలు తగ్గాయని గడ్కరి అభిప్రాయపడ్డారు.

మహిళలు, ఎంఎస్ఎంఈలకు మద్దతు కీలకం

వీరి కోసం ప్రత్యేక పథకాలు తీసుకురండి

ఆర్థిక సంస్థలకు ఆర్‌బీఐ గవర్నర్ దాస్ సూచన



ముంబై: దేశంలో సమ్మిళిత వృద్ధి సాధనకు మహిళలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ)కు ఆర్థిక సంస్థలు గట్టి మద్దతు ఇవ్వాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ పిలుపు ఇచ్చారు. అండర్ రైటింగ్ ప్రమాణాలు నీరుగార్చకుండానే మహిళల నిర్వహణలోని వ్యాపారాలు, ఎంఎస్ఎంఈలకు మద్దతు ఇవ్వగల ఉత్పత్తులు, పథకాలు రూపొందించాలని ఆయన సూచించారు. ఫిక్కీ, ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ (ఐబీఏ) సంయుక్తంగా నిర్వహించిన ఫిబాక్-2024 సదస్సులో దాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలతో పాటు మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మద్దతు ఇవ్వగల విధంగా బ్యాంకులు కూడా సొంత పథకాలతో ముందుకు రావాలన్నారు. ప్రపంచ సగటుతో పోల్చితే కార్మిక శక్తిలో మహిళల భాగస్వామ్యం చాలా తక్కువ అన్నారు. అలాగే ఎంఎస్ఎంఈల్లో కూడా మహిళల యాజమాన్యంలోని యూనిట్లు ఐదింట ఒక వంతు మాత్రమే ఉన్నాయని అని చెప్పారు. మహిళల విద్య, నైపుణ్యాభివృద్ధి, పని ప్రదేశాల్లో రక్షణ, సామాజిక అవరోధాలు తొలగించడం ద్వారా మాత్రమే ఈ వ్యత్యాసాన్ని పూడ్చగలమని ఆయన పేర్కొన్నారు.

మూలధన సమీకరణలో సవాళ్లు

మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల వ్యాపారాలకు అవసరమైన మూలధనం సమీకరించుకోవడంలో పలు సవాళ్లు ఎదుర్కొంటున్నారని, వారికి సరసమైన రేట్లకు రుణాలు కూడా అందడంలేదని దాస్ తెలిపారు. అలాగే మహిళలకు ఉపాధి కల్పించడంపై ఆర్థిక సంస్థలు దృష్టి పెట్టాలని దాస్ సూచించారు. దేశంలో యువ జనాభా అధికంగా ఉన్న నేపథ్యంలో తగినన్ని ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తేవాలంటే ఎంఎస్ఎంఈలకు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఆర్థిక వనరుల పరంగా ఎంఎస్ఎంఈలు ఎదురీదుతున్న విషయం ఆయన గుర్తు చేస్తూ ఫిన్‌టెక్ ఇన్నోవేషన్లను ఉపయోగించుకుని ఎంఎస్ఎంఈలకు సౌకర్యవంతంగా ఉండే రుణ ఉత్పత్తులు రూపొందించడం, వర్కింగ్ క్యాపిటల్ అవకాశాలు మెరుగుపరచడం అవసరమని దాస్ నొక్కి చెప్పారు.

ఎంఎస్ఎంఈల నగదు ప్రవాహం అధికంగా ఉండి, వృద్ధి దశలో ఉన్న సమయంలో అండగా నిలిచే పాలసీలు రూపొందించాలని సూచించారు. ఇలాంటి చర్యల ద్వారా మాత్రమే ఎంఎస్ఎంఈలు విస్తరించి ఉత్పాదకతను పెంచగలుగుతాయని, తద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తేగలుగుతాయని దాస్ చెప్పారు.

సంస్కరణల జోరు పెరగాలి

భారత ఆర్థిక వ్యవస్థలో వినియోగ, పెట్టుబడుల డిమాండు పెరుగుతున్న నేపథ్యంలో వృద్ధి అవకాశాలు స్థిరంగా ఉన్నాయని, వీటిని మరింత ఉత్తేజితం చేసేందుకు సంస్కరణల జోరును పెంచాలని దాస్ అన్నారు. భూ, కార్మిక, వ్యవసాయ మార్కెట్ సంస్కరణలు చేపట్టడం కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం కీలకమైన కూడలిలో ఉన్నదని, వివిధ రంగాల్లో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ఆర్థిక వ్యవస్థలో స్థూల ఆర్థిక స్థిరత్వం, వృద్ధి-ద్రవ్యోల్బణం మధ్య సానుకూలమైన సమతూకం నెలకొన్నాయని దాస్ చెప్పారు. ప్రస్తుతం నెలకొన్న స్థూల స్థిరత్వం నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆర్‌బీఐ ప్రకటించిన జీడీపీ వృద్ధి అంచనా 7.2 శాతం అసాధ్యం ఏమీ కాదని దాస్ అన్నారు.

బిజినెస్

జియో 8వ వార్షికోత్సవ ఆఫర్లు

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద టెలికాం సంస్థ రిలయన్స్ జియో 8వ వార్షికోత్సవం సందర్భంగా వినియోగదారులకు ఎంపిక చేసిన రీచార్జ్ ప్లాన్లపై ఆఫర్లు ప్రకటించింది. జియో వెబ్‌సైట్ డేటా ప్రకారం.. ఈ నెల 5 నుంచి 10 తేదీల మధ్యలో రూ.899, రూ.999 త్రైమాసిక ప్లాన్స్‌తో పాటు రూ.3,599 వార్షిక ప్లాన్‌తో రీచార్జ్ చేసుకునేవారికి రూ.700 విలువైన మూడు ప్రయోజనాలు లభించనున్నాయి. 10 ఓటీటీలు, 28 రోజుల వ్యాలిడిటీతో కూడిన రూ.175 విలువ చేసే 10జీబీ డేటా ప్యాక్, మూడు నెలల జొమాటో గోల్డ్ మెంబర్‌షిప్ లభించనున్నాయి. ప్రస్తుతం 90 రోజుల వ్యాలిడిటీతో కూడిన రూ.899, 98 రోజుల రూ.999 ప్లాన్స్‌పై రోజుకు 2జీబీ డేటా లభిస్తోంది. 365 రోజుల వ్యాలిడిటీతో కూడిన రూ.3,599 ప్లాన్‌పై రోజుకు 2.5 జీబీ డేటా లభిస్తోంది. 2016 సెప్టెంబరులో సేవలను ప్రారంభించిన రిలయన్స్ జియో గడిచిన 8 ఏళ్లలో డేటా ట్రాఫిక్ పరంగా ప్రపంచంలోనే అతిపెద్ద టెలికాం కంపెనీగా అవతరించింది.

'రాపిడో'కు రూ.1,680 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో అతి పెద్ద రైడ్-షేరింగ్ ప్లాట్‌ఫామ్ 'రాపిడో' ఇన్వెస్టర్ల నుంచి మరిన్ని పెట్టుబడులు సమీకరించనుంది. ఇటీవల జరిగిన సిరీస్-ఈ ఫండింగ్‌లో కంపెనీకి 20 కోట్ల డాలర్లు (సుమారు రూ.1,680 కోట్లు) పెట్టుబడులు సమకూర్చేందుకు మదుపరులు హామీ ఇచ్చినట్టు తెలిపింది. వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్ వంటి ఇన్వెస్టర్ల నుంచి ఈ హామీ లభించింది. దీంతో రాపిడో ప్లాట్‌ఫామ్ విలువ 110 కోట్ల డాలర్లకు (సుమారు రూ.9,236 కోట్లు) చేరింది.

'వెల్స్ ఫార్గో'లో ట్రాన్స్‌జెండర్లకు చోటు

ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ 'వెల్స్ ఫార్గో' భారత్‌లోని తన కార్యాలయాల్లో ట్రాన్స్‌జెండర్లకే ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ప్రకటించింది. ఇందుకోసం 'ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ హైరింగ్ ప్రోగ్రామ్' పేరుతో ప్రత్యేక పథకం ప్రారంభించింది. అన్ని వర్గాల వారికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే కృషిలో భాగంగా ఈ పథకం ప్రారంభించినట్టు తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,750 ▼	66,680 ▼	91,000 ▲
ముంబై	71,875 ▲	65,838 ▲	82,971 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	470	విజయవాడ	505
వరంగల్	472	గోదావరి	500
చిత్తూరు	518	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	99	విజయవాడ	108
వరంగల్	99	గుంటూరు	105
కరీంనగర్	99	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	97
కర్నూలు	99	నెల్లూరు	97
విశాఖపట్నం	99	అనంతపురం	100
గోదావరి	108		

అల్ట్రా లగ్జరీ గృహాలకు గిరాకీ

- 8 నెలల్లో 25 ఇళ్ల అమ్మకం
- ఒక్కో ఇంటి సగటు ధర రూ.40 కోట్లు
- హైదరాబాద్‌లో రెండు ఇళ్ల అమ్మకం: అనరాక్



న్యూఢిల్లీ: దేశంలో అల్ట్రా లగ్జరీ (అత్యంత విలాసవంతమైన) గృహాలకు డిమాండ్ పెరిగిపోతోంది. గత ఎనిమిది నెల (జనవరి-ఆగస్టు)ల్లో ముంబై, హైదరాబాద్, ఎన్‌సీఆర్-గురుగ్రామ్, బెంగళూరు నగరాల్లో 25 విలాస గృహాలు అమ్ముడుపోయాయి. వీటి విలువ రూ.2,443 కోట్ల వరకు ఉంటుందని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ తెలిపింది. ఈ లెక్కన ఒక్కో ఇంటి కనీస సగటు ధర రూ.40 కోట్లు ఉంటుందని అంచనా. గత ఏడాది మొత్తానికి చూస్తే రూ.4,456 కోట్ల విలువైన 61 విలాస గృహాలు అమ్ముడుపోయాయి. ఈ ఎనిమిది నెలల్లో అమ్ముడైన 25 విలాస గృహాల్లో 20 హైరైజ్ అపార్ట్‌మెంట్లని అనరాక్ తెలిపింది. వీటి విలువ రూ.1,694 కోట్లు. మిగతా ఐదు విలాస బంగ్లాలు. వీటి విలువ రూ.748.5 కోట్లని అనరాక్ తెలిపింది.

ముంబై టాప్: రూ.40 కోట్లు అంతకంటే ఎక్కువ విలువైన విలాస గృహాల అమ్మకాల్లో దేశ ఆర్థిక రాజధాని ముంబై అగ్రస్థానంలో ఉంది. గత ఎనిమిది నెలల్లో దేశంలో అమ్ముడైన 25 విలాస గృహాల్లో 20 గృహాలు ఒక్క ముంబైలోనే అమ్ముడయ్యాయి. వీటి విలువ రూ.2,200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. విలాస గృహాల అమ్మకాల్లో ముంబై తర్వాత హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. గత ఎనిమిది నెలల్లో నగరంలో రూ.80 కోట్ల విలువైన రెండు విలాస గృహాలు అమ్ముడయ్యాయి. ఈ రెండు అమ్మకాలు నగరంలోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో చోటు చేసుకున్నాయి. మిగతా రెండు లావాదేవీలు ఢిల్లీ ఎన్‌సీఆర్ గురుగ్రామ్, బెంగళూరుల్లో జరిగినట్టు అనరాక్ తెలిపింది.

హైదరాబాద్‌లో చౌకే: ఇక అందుబాటు ధరల ఇళ్ల విషయానికి వస్తే హైదరాబాద్‌లో చౌకగానే ఉన్నాయి. తమ నెలవారీ ఆదాయంలో గృహ రుణాల ఈఎంఐల కింద ముంబై, దాని పరిసర ప్రాంతాల ప్రజలు సగటున 116 శాతం, ఢిల్లీ వాసులు 82 శాతం చెల్లిస్తుంటే హైదరాబాద్ ప్రజలు 61 శాతం మాత్రమే చెల్లిస్తున్నారు. అయితే అహ్మదాబాద్, చెన్నైలతో పోలిస్తే ఇది ఎక్కువే. ఈ రెండు నగరాల ప్రజలు తమ నెలవారీ ఆదాయంలో సగటున 41 శాతం మాత్రమే గృహ రుణాల ఈఎంఐల కింద చెల్లిస్తున్నట్టు రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ మాజిక్‌బ్రిక్స్ తెలిపింది.

రిలయన్స్, ఎయిర్‌టెల్ షేర్లు పడేశాయ్..

వరుసగా రెండో రోజూ నష్టాల్లో సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా రెండో రోజు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ బలహీన సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎయిర్‌టెల్, ఎల్ అండ్ టీ షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. దీంతో గురువారం సెన్సెక్స్ 151.48 పాయింట్లు కోల్పోయి 82,201.16 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 53.60 పాయింట్ల నష్టంతో 25,145.10 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 19 నష్టపోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 1.41 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.56 శాతం వరకు పెరిగాయి. రంగాల వారీ సూచీల్లో రియల్టీ, క్యాపిటల్ గూడ్స్ 0.95 శాతం వరకు నష్టపోయాయి.

ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 4 పైసలు పెరిగి 83.97 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 0.96 శాతం పెరుగుదలతో 73.40 డాలర్ల వద్ద ట్రేడైంది.

ఆర్ఐఎల్ బోనస్ ఇష్యూకు బోర్డు ఓకే

దేశంలో అత్యంత విలువైన కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) బోనస్ షేర్ల జారీ ప్రతిపాదనకు కంపెనీ బోర్డు గురువారం ఆమోదం తెలిపింది. ఆర్ఐఎల్ తన వాటాదారులు కలిగి ఉన్న ప్రతి షేరుకు బోనస్‌గా మరో షేరు (1:1 నిష్పత్తిలో)ను జారీ చేయనుంది. గడిచిన ఏడేళ్లలో కంపెనీకిదే తొలి బోనస్ షేర్ల జారీ కానుంది. చివరిసారి 2017 సెప్టెంబరులోనూ సంస్థ 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేసింది. అంతక్రితం 2009లోనూ బోనస్ షేర్లను ఇష్యూ చేసింది. ఆర్ఐఎల్ ఐపీఓకు వచ్చినప్పటి నుంచి ఆరో బోనస్ ఇష్యూ ఇది. 1980-81లో 3:5 నిష్పత్తిలో, 1983-84లో 6:10 నిష్పత్తిలో, 1997-98లో ఒక షేరుకు మరో షేరు జారీ చేసింది.



వరద బాధితులను పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల

బాధిత రైతులను ఆదుకుంటాం

- సర్వే పూర్తయిన వెంటనే పరిహారం పంపిణీ
- మున్నేరు బాధితులను ఆదుకుంటాం: మంత్రి తుమ్మల

ఖమ్మం, మధిర రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదలతో పంటలు కోల్పోయిన రైతులు అధైర్య పడవద్దని, నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులను ఆదుకుంటామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. మున్నేరు వరదలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేసి మెరక ప్రాంతంలో నిర్మిస్తామని చెప్పారు. ఖమ్మం జిల్లా మధిర, ఎర్రుపాలెం మండలంలో పలు గ్రామాలను, ఖమ్మం బొక్కలగడ్డలో మున్నేరు వరద ప్రాంతంలో దెబ్బతిన్న ఇళ్లను గురువారం ఉదయం మంత్రి తుమ్మల సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు మధిర మండలం చిలుకూరు, ఎర్రుపాలెం మండలం మీనవోలు గ్రామాల రైతులు తమ సమస్యలను వివరించారు. తుమ్మల మాట్లాడుతూ రైతుల సమస్యలు తెలుసుకొనేందుకే తాను వచ్చానని, ప్రభుత్వం రైతులకు అన్నివిధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. మున్నేరు వాగు బాధితులకు ఇంటింటికీ నిత్యావసరాలు, దుస్తులు, పాల ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బొక్కలగడ్డలో ప్రతి గల్లీ తిరిగి వరద నష్టాన్ని పరిశీలించారు. తాము సర్వం కోల్పోయామని మంత్రి తుమ్మలకు మహిళలు తమ గోడు వినిపించారు. వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని, నిత్యావసర వస్తువులు మీ ఇంటివద్దకే చేరతాయని భరోసా ఇచ్చారు.

అధైర్య పడొద్దు.. ఆదుకుంటాం: పొంగులేటి

ఖమ్మం రూరల్, సెప్టెంబరు 5: వరద బాధితులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అందరినీ ఆదుకుంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఖమ్మం రూరల్ మండల పరిధిలోని రాజీవ్ గృహకల్ప, కరుణగిరి, జలగంనగర్, పెద్దతండా తదితర ముంపు గ్రామాల్లో గురువారం మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడుతూ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సహాయంతో పాటు పొంగులేటి స్వరాజ్యం-రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరఫున తమ వంతు సాయం కూడా అందించనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వరద ముంపు బాధితులకు శుక్రవారం సాయంత్రం వరకు 10వేల ఆర్థిక సాయం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు.

వరద బాధితులకు అండగా నిలవండి

- బీమా కంపెనీలను కోరిన కేంద్ర ఆర్థికశాఖ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): భారీవర్షాలు, వరదలతో తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర ఆస్తి, పంట, ప్రాణ నష్టాలు సంభవించిన నేపథ్యంలో అక్కడి ప్రజలకు సాధ్యమైనంత అండగా నిలవాలని కేంద్ర ఆర్థికశాఖ బీమా కంపెనీలను కోరింది. వర్షాలు, వరదల వల్ల నష్టానికి గురైన వారు కోరిన పరిహారాన్ని వెంటనే చెల్లించాలని, అందుకోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని సూచించింది. ప్రజలు కోరిన విధంగా వెంటనే వారి క్లెయిమ్‌లను పరిష్కరించి సత్వర సహాయం అందజేయాలని నిర్దేశించింది. పాలసీదారులు సంప్రదించేందుకు వీలుగా నోడల్ అధికారుల పేర్లు, వారి ఫోన్ నెంబర్లను అందజేయాలని సూచించింది.

మహిళల మాన, ప్రాణాలకంటే.. ఒక వర్గం షాపులే ముఖ్యమా..?

- ఒవైసీ రాక్షసంగా వ్యవహరిస్తున్నారు
- ఆదివాసీపై అత్యాచారయత్నం జరిగితే.. హిందూ యువతపై కేసులా..?: సంజయ్

అడ్డగుట్ట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): "ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం, హత్యాయత్నం జరిగితే కనీసం స్పందించని ఒవైసీ.. ఒకవర్గం వాళ్ల ఫర్నిచర్, షాపులే ముఖ్యమైనట్లుగా మాట్లాడుతూ.. రాక్షసంగా వ్యవహరించడం సిగ్గుచేటు" అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. గొడవలను ఆపాలనే నెపంతో హిందూ యువతపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో ఇటీవల అత్యాచారయత్నానికి గురై.. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని గురువారం బండి సంజయ్, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నగేశ్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు పరామర్శించారు. అనంతరం సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం జరిగిన వెంటనే చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బాధితురాలి ముఖం పూర్తిగా దెబ్బతిన్నదని.. నిర్భయ, దిశ సంఘటనల మాదిరిగా ఆమెపై ఘోరంగా దాడి జరిగిందని తెలిపారు. ఆదివాసీ మహిళపై దాడి జరిగితే.. తిరిగి హిందువులపైనే దాడులు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఘటనను ఖండించాల్సిన ఒవైసీ... అందుకు భిన్నంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. మహిళపై దాడి జరిగిన వెంటనే చర్యలు తీసుకుని ఉంటే జైనూర్‌లో గొడవలు జరిగేవి కాదన్నారు.

బాచుపల్లి తహసీల్దార్‌కు ముందస్తు బెయిల్

- హైడ్రా ఫిర్యాదుతో కేసు

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్న హైడ్రా సూచనలతో కేసు ఎదుర్కొంటున్న బాచుపల్లి తహసీల్దారు పూల్‌సింగ్‌కు హైకోర్టులో ముందస్తు బెయిల్ లభించింది. నిజాంపేట్ మున్సిపాల్టీ పరిధిలోని ప్రగతి నగర్ ఎర్రకుంట బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలకు సహకరించారని పేర్కొంటూ పూల్‌సింగ్ సహా ఐదుగురు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులపై హైడ్రా ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు ఆధారంగా సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగంలో కేసు నమోదైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని తహసీల్దార్ పూల్‌సింగ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ సుజన ధర్మాసనం.. పిటిషనర్ అక్కడ విధుల్లో చేరింది గతేడాది ఆగస్టులో మాత్రమేనని, అంతకుముందే అనుమతులు ఇచ్చారని గుర్తించింది. పిటిషనర్ ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నారనే వాదనతో ఏకీభవిస్తూ ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

25న బీసీల 'చలో హైదరాబాద్'

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్క్ నుంచి ఇందిరాపార్క్ వరకు కులగణన మార్చ్‌ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా బీసీలంతా తరలి రావాలని కోరారు.

పబ్లిక్ నోటీసు ఖర్చు మార్గదర్శే భరించాలి

- హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి డిపాజిట్ల వ్యవహారంలో ఇంకా ఎవరికైనా బకాయిలు రావాల్సి ఉందా? అని తెలుసుకోవడానికి ప్రముఖ పత్రికల్లో ఇచ్చే పబ్లిక్ నోటీసు ఖర్చును ఆ సంస్థే భరించాలని హైకోర్టు డివిజన్ బెంచ్ గురువారం స్పష్టంచేసింది. మార్గదర్శి నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించిందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ పిటిషన్ నేపథ్యంలో ఆ కేసులను సుప్రీంకోర్టు తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పబ్లిక్ నోటీసు పత్రికల్లో ప్రకటన రూపంలో ఇవ్వాల్సి ఉంది. దాని ఖర్చును మార్గదర్శే భరించాలని, ప్రకటన ఇచ్చిన ఏడురోజుల్లో రిజిస్ట్రీకి ఆ మొత్తాన్ని చెల్లించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 1కి వాయిదా వేసింది.

7 గంటల పాటు ఆర్తనాదాలు!

ఉదయం లేచి చూసే సరికే జల ప్రళయం.. రెస్క్యూ బృందాలు వచ్చినా కాపాడలేని పరిస్థితి

యాకూబ్ దంపతులను బలిగొన్న పాలేరు వరద.. వారి కుమారుడిని కాపాడిన స్థానికులు

కూసుమంచి, సెప్టెంబరు 5: కనీవినీ ఎరుగని వరద.. నిమిషాల వ్యవధిలోనే ఆ ఇంటిని చుట్టుముట్టేసింది. ఇద్దరు దంపతులు, వారి కుమారుడు తేరుకొని బయటకు వచ్చే లోపే దారి కూడా కనిపించని పరిస్థితి... ఎటు చూసినా నీళ్లే.. ఇలా కాదని ధైర్యం చేసి వారందరూ ఇంటి పైకప్పు మీదకు ఎక్కారు... కాసేపట్లోనే అధికారులు, రెస్క్యూటీమ్ సభ్యులు అక్కడికి చేరుకున్నా ఏమీ చేయలేని పరిస్థితి. అందరూ చూస్తుండగానే ఆ దంపతులు, వారి కుమారుడు కొట్టుకుపోయారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో గత ఆదివారం పాలేరు జల ప్రళయానికి బలైన యాకూబ్ కుటుంబం ఎదుర్కొన్న విపత్కర పరిస్థితి ఇది. సూర్యాపేట జిల్లా మోతె మండలం కరక్కాయలగూడేనికి చెందిన యాకూబ్(50), సైదాబీ(45) దంపతులు పదేళ్ల క్రితం నాయకన్‌గూడేనికి వలస వచ్చారు. పాలేరు జలాశయం కాజ్‌వే సమీపంలో నివాసం ఉంటూ సిమెంటు ఇటుకల తయారీ కేంద్రం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వారి పెద్ద కుమారుడు యూసుఫ్ చెన్నైలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతుండగా, చిన్నకుమారుడు షరీఫ్ ఖమ్మంలో బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. ఏటా వరదలు వచ్చిన సమయంలో వారు తమ ఇల్లు ఖాళీ చేసి మెరక ప్రాంతానికి వస్తుండే వారు. కానీ, ఈ ఏడాది గతానికి భిన్నంగా పాలేరు జలాశయానికి రెండు లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తింది. దీంతో ఆదివారం ఉదయం 5.30గంటలకే వారు నివసిస్తున్న ఇంట్లోకి నీళ్లు చేరాయి. అరగంట వ్యవధిలోనే ఆరు నుంచి ఏడు అడుగుల మేర వరద చేరడంతో వారి ఇల్లు పూర్తిగా నీట మునిగింది. దీంతో యాకూబ్, సైదాబీ, చిన్న కుమారుడు షరీఫ్ ఇంటి పైకప్పు ఎక్కారు. ఏడు గంటల పాటు తమను కాపాడాలంటూ వారు ఆర్తనాదాలు చేశారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆధ్వర్యంలో రెస్క్యూ బృందాలు అక్కడికి చేరుకున్నా.. వరద చుట్టుముట్టేయడంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. చివరకు డ్రోన్ సాయంతో లైఫ్ జాకెట్లు, ట్యూబులు అందించారు. ఇంతలోనే వారు ఉంటున్న ఇల్లు కూలిపోవడంతో యాకూబ్, సైదాబీతో పాటు షరీఫ్ వరదలో కొట్టుకుపోయారు. చెట్లలో ఇరుక్కుపోయి యాకూబ్, సైదాబీ దుర్మరణం చెందగా, ఖమ్మం-సూర్యాపేట జాతీయరహదారిపై స్థానికులు, పోలీసులు షరీఫ్‌ను కాపాడి బయటకు తీశారు. 'ఆరేడు గంటలపాటు బతికేందుకు పోరాడాం. నా కళ్ల ముందే మమ్మీ, డాడీ వరదలో కొట్టుకుపోయారు. నేనూ బతుకుతాననుకోలేదు" అని ఆ నాటి ఘటనను గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమవుతున్నాడు షరీఫ్. వరదల్లో సర్వస్వం కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని అనాథలుగా మిగిలిన యూసుఫ్, షరీఫ్ కోరుతున్నారు. కాగా, ఆ రోజు హైదరాబాద్ నుంచి సహాయక చర్యలను పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి.. దంపతుల మృతి వార్త తెలుసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. అన్ని రకాల చర్యలు తీసుకున్నా వారిని కాపాడుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.



పాలేరు వరదలో మృతి చెందిన దంపతులు షేక్ యాకూబ్, సైదాబీ(ఫైల్)



యాకూబ్ కుమారులు యూసూబ్, షరీఫ్

కోలుకుంటున్న ఖమ్మం





మున్నేరు వరద ప్రాంతంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న మునిసిపల్ కార్మికులు; ప్రభుత్వ పీహెచ్‌సీని శుభ్రం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

(మొదటిపేజీ తరువాయి)

జలగం నగర్, కరుణగిరి, రాజీవ్ గృహకల్ప తదితర కాలనీలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఇవి బురదలోనే ఉన్నాయి. మిగిలిన కాలనీలు శుభ్రం కావడంతో చాలావరకు కుటుంబాలు ఇళ్లకు చేరాయి. బాధితులను ఆదుకునేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు సాగుతున్నాయి. ఇంటింటి సర్వే ముమ్మరంగా సాగుతోంది. 7,500 ఇళ్లు ముంపునకు గురైనట్లు సర్వేలో గుర్తించారు. 15వేల నిత్యావసర కిట్లు, 10వేల దుస్తుల కిట్లు అందిస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వెయ్యి మంది పారిశుధ్య సిబ్బంది బురద, చెత్తను తొలగిస్తున్నారు. పారిశుధ్య పనులు 80 శాతం పూర్తి చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన అగ్నిమాపక వాహనాలతో రోడ్లు, ఇళ్లల్లో పేరుకున్న బురదను శుభ్రం చేయిస్తున్నారు. ముంపు కాలనీల్లో 90 శాతం వరకు విద్యుత్‌ను పునరుద్ధరించారు. జిల్లాలో 15వేల కుటుంబాలు ముంపు బారిన పడ్డట్లు భావిస్తున్నారు. సర్వే తర్వాత పూర్తి లెక్క తేలనుంది. కాగా, సర్వేలో వరద బాధిత కుటుంబాలకు చెందిన బ్యాంకు ఖాతాల వివరాలను తీసుకుంటున్నారు. శుక్రవారం నుంచి వరదసాయం రూ.10వేలు జమ చేయనున్నారు.

కొత్తవారు కనిపిస్తే సాయం కోసం పరుగులు

ముంపు కాలనీల్లోకి కొత్తవారు ఎవరు వెళ్లినా.. సాయం చేసేందుకు వచ్చారేమోననే ఆశతో బాధితులు పరుగులు తీస్తున్నారు. ఏమైనా ఇస్తారేమోనని, సర్వే వారు వచ్చారేమో... తమ పేర్లు ఎక్కడ నమోదు కాకుండా పోతాయోనని కంగారు పడుతున్నారు. ఆధార్, రేషన్ కార్డులు తీసుకొచ్చి 'మాపేర్లు రాయండి' అంటూ మహిళలు అభ్యర్థిస్తున్నారు.

ఖమ్మంలో తుమ్మల, పాలేరులో పొంగులేటి

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు.. వరద ముంపునకు గురైన నాటి నుంచి తమతమ నియోజకవర్గాల్లోనే ఉంటున్నారు. సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. గోదావరి వరదలు-సహాయ చర్యలను పర్యవేక్షించిన అనుభవం ఉన్న తుమ్మల.. దానిని మున్నేరు వరద సహాయ కార్యక్రమాల్లో ఉపయోగిస్తున్నారు. అధికార యంత్రాగానికి దిశా నిర్దేశం చేస్తున్నారు. పొంగులేటి పాలేరు నియోజకవర్గ పరిధిలోని ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ సహాయ కార్యకమాలను ముమ్మరం చేస్తున్నారు.

నామరూపాల్లేని కోళ్ల ఫారం

నేలకొండపల్లి: పాలేరు వరద ఆ మాజీ సైనికుడిని నిలువునా ముంచింది.. రెండోసారి తీవ్రంగా నష్టపరిచింది. మాజీ సైనికుడు యడవల్లి ఉపేందర్ ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం పైనంపల్లిలోని సొంత భూమిలో కోళ్లఫారం ఏర్పాటు చేసుకున్నాడు. ఆర్మీలో పనిచేసినందుకు వచ్చిన పింఛను, ఇతర డబ్బుతో దీనిని నిర్మించాడు. ఇటీవలి వరదతో 2షెడ్లు, 12 టన్నుల మొక్కజొన్న, 2,400 కోళ్లు, రూ.2 లక్షల విలువైన సోలార్ సిస్టం సహా మొత్తం సామగ్రి కొట్టుకుపోయాయి. రూ.25 లక్షల దాకా నష్టపోయాడు. గత వరదల్లోనూ భారీగా దెబ్బతిన్నానని.. సాయం చేసి ఆదుకోవాలని ఉపేందర్ అధికారులను కోరుతున్నాడు. ఖమ్మం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశాడు.

ధ్వంసమైన కోళ్ల ఫారం



ఒకరిని వెదికేందుకు వెళ్లి..

- కిన్నెరసానిలో చిక్కుకున్న ఐదుగురు
- కలెక్టర్ చొరవ.. రక్షించిన ఎన్డీఆర్ఎఫ్
- లభ్యం కాని.. గల్లంతైన వ్యక్తి ఆచూకీ

పాల్వంచ రూరల్: ఒకరి ఆచూకీ కోసం వెళ్లి ఐదుగురు వ్యక్తులు కిన్నెరసాని వాగులో చిక్కుకున్నారు. దీంతో అందరి ప్రాణాలు ముప్పులో పడ్డాయి. చివరకు ఐదుగురిని రక్షించినా.. మొదటి వ్యక్తి ఆచూకీ దొరకలేదు. భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం దంతెలబోర వద్ద కిన్నెరసానిలో మంగళవారం ఏడుగురు చిక్కుకోగా ఆరుగురిని రక్షించారు. జారె సాయి అనే వ్యక్తి వాగు తగ్గిందని భావించి బుధవారం రాత్రి దాటే ప్రయత్నం చేస్తూ గల్లంతయ్యాడు. అతడిని వెదికేందుకు గురువారం ఉదయం ఐదుగురు వెళ్లారు. అదే సమయంలో కిన్నెరసాని గేట్లు ఎత్తడంతో చిక్కుకున్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచనతో వారందరికీ ముందుగా డ్రోన్ ద్వారా ఆహారం, తాగు నీరు అందజేశారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపారు. కిన్నెరసాని, కేటీపీఎస్ అధికారులతో మాట్లాడి గేట్లు దించడంతో.. ఐదుగురినీ రాత్రి 7 గంటల సమయంలో క్షేమంగా బయట పడ్డారు.



సూర్యాపేట జిల్లాలోని పాతర్లపహాడ్‌లో మిరప తోటలో ఇసుక మేట

పంట పోయింది.. ఇసుక మేట మిగిలింది

- సూర్యాపేట జిల్లా రైతును కదిలిస్తే కన్నీరే

కోదాడ రూరల్, ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 5: వారం రోజుల పాటు సూర్యాపేట జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా పెద్దఎత్తున పంటలు దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో పత్తి, మిర్చి, వరి పొలాల్లో పూర్తిగా ఇసుక మేట వేసింది. దీంతో పంటలు నామరూపాలు లేకుండా పోయాయి. అయ్యావారి కుంట అలుగు పోయడంతో ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపహాడ్‌లో అరేంపుల రాజుకు చెందిన రెండు ఎకరాల మిరప తోట కొట్టుకుపోయింది. మిద్దనపల్లి గ్రామంలో సామ నారాయణరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సైదులు, బిక్షం, లక్ష్మారెడ్డి, రామిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలకు చెందిన పొలాలు ఏటి వరదతో మునిగిపోయాయి. మక్తా కొత్తగూడెంలో బద్దం లింగమల్లారెడ్డి, బద్దం ధర్మారెడ్డి, గుండాల గురువయ్య, సామా వెంకట్‌రెడ్డి వరి పొలాలు కొట్టుకుపోయాయి. కోదాడ మండలంలో తొగర్రాయి, కూచిపూడి గ్రామాలు నీట మునిగాయి. అధికారులు తమ వద్దకు వచ్చి వివరాలు తీసుకోలేదని తొగర్రాయి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ గ్రామంలో పర్యటించినా.. ఇతర అధికారులు ఎవరూ నష్టం అంచనాకు రాలేదని బాధితులు తెలిపారు. చిలుకూరు మండలం నారాయణపురం, సీతారాంపురం, చిలుకూరు చెరువులు తెగి వరద తొగర్రాయి గ్రామం మీదుగా వెళ్లింది. మోకాలు లోతు బురదలో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇంటికన్నె వద్ద రెండో ట్రాక్ సిద్ధం

- సికింద్రాబాద్-విజయవాడ మార్గంలో.. నెమ్మదిగా నడుస్తున్న రైళ్లు

కేసముద్రం/హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 5: భారీ వర్షాలతో సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్‌లోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కేసముద్రం-ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య 418 కి.మీ వద్ద ట్రాక్ ధ్వంసమైన ప్రాంతంలో మరమ్మతు పనులు దాదాపు పూర్తయ్యాయి. గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో డౌన్‌లైన్ మరమ్మతులను పూర్తి చేసిన అధికారులు.. ట్రయల్‌రన్ పూర్తిచేశారు. దీంతో ఈ ప్రాంతంలో రెండు మార్గాలూ అందుబాటులోకి వచ్చాయి. ఉదయం నుంచి గోల్కొండ, కృష్ణా, ఈస్ట్‌కోస్ట్, అండమాన్, పద్మావతి ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లను అప్ అండ్ డౌన్ నడిపించారు. అయితే, మహబూబాబాద్-కేసముద్రం మార్గంలో సుమారు 10కి.మీ. మేర 15 ప్రాంతాల్లో ట్రాక్‌లకు మరమ్మతులు చేసినందున ఆయా ప్రాంతాల్లో రైళ్లను 5-30 కి.మీ వేగంతో నడిపిస్తున్నారు. దీంతో ఇటు సికింద్రాబాద్‌కు, అటు విజయవాడకు వెళ్లాల్సిన రైళ్లు కనిష్ఠంగా అరగంట, గరిష్ఠంగా గంటన్నర ఆలస్యంగా చేరుకుంటున్నాయి. శుక్రవారం నుంచి మరికొన్ని రైళ్లను అనుమతించే అవకాశం ఉంది. కాగా, రేక్‌ల కొరతతో న్యూఢిల్లీ-చెన్నై సెంట్రల్, గూడూరు-సికింద్రాబాద్, మణుగూరు-సికింద్రాబాద్ రైళ్లను గురువారం రద్దు చేసినట్లు రైల్వే ప్రకటించింది.

రైల్వే ఏజీఎంగా నీరజ్ అగర్వాల్

దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్(ఏజీఎం)గా నీరజ్ అగర్వాల్ నియమితులయ్యారు. గురువారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.



కేసముద్రం మండలం ఇంటికన్నె వద్ద సిద్ధమైన డౌన్ లైన్

సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళాల వెల్లువ

- ఎస్బీఐ ఉద్యోగుల ఒక రోజు వేతనం రూ.5 కోట్లు అందజేత
- అరబిందో ఫార్మా నుంచి రూ.5కోట్లు
- నెల వేతనం విరాళంగా ఇచ్చిన మల్లు రవి
- ఒక రోజు మూలవేతనం ఇచ్చేందుకు ముందుకొచ్చిన విద్యుత్ ఉద్యోగులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి), ఖమ్మం టౌన్, సెప్టెంబరు 5: వరద బాధితులను ఆదుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుతో దాతలు పెద్దఎత్తున ముందుకొస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ కంపెనీలు, సినీ ప్రముఖులు, వైద్యులు, ప్రభుత్వ, బ్యాంకు ఉద్యోగులు సహా వివిధ రంగాల వారు సీఎంఆర్ఎఫ్‌కు విరాళాలు అందిస్తున్నారు. గురువారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఉద్యోగులు తమ ఒక రోజు వేతనం రూ.5కోట్లను సీఎంఆర్ఎఫ్‌కు విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ నివాసంలో ఆయన్ను బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్.. డిప్యూటీ సీఎం భట్టి, పలువురు బ్యాంకు ఉద్యోగులతో కలిసి చెక్కును అందించారు.

అరబిందో ఫార్మా సంస్థ సీఎంఆర్ఎఫ్‌కు రూ.5కోట్లు విరాళంగా ప్రకటించింది. సంబంధిత చెక్కును కంపెనీ వైస్ ప్రెసిడెంట్, ఎండీ కె.నిత్యానంద రెడ్డి, డైరెక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టితో కలిసి సీఎం రేవంత్‌కు అందించారు. ఏఐజీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి ఆస్పత్రి తరఫున సీఎంఆర్ఎఫ్‌కు రూ.కోటి చెక్కును సీఎంకు అందించారు.

కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఒక నెల వేతనాన్ని విరాళంగా ఇచ్చారు. ఈమేరకు రూ.1.90 లక్షల చెక్కును సీఎంఆర్ఎఫ్‌కు విరాళంగా అందించారు.

రాష్ట్ర విద్యుత్ సంస్థల్లోని ఇంజనీర్లు, ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లు ఒక రోజు మూలవేతనాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందించాలని నిర్ణయించిన మేరకు గురువారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ప్రతినిధులు కలిసి సమ్మతి పత్రాన్ని అందించారు. ఒక రోజు మూలవేతనం దాదాపు రూ.15కోట్లు ఇచ్చేందుకు ముందుకొచ్చారు.

హెటిరో సంస్థలు, సింధు ఆస్పత్రుల అధినేత, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి... ఖమ్మం, పాలేరులో వరద బాధితుల సహాయార్థం గురువారం ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు రూ.కోటి చెక్కును అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో వరద బాధితులకు సహాయంగా రూ.కోటి విరాళం ఇస్తానన్నారు. వరద బాధితులకు వైద్యసేవల కోసం సింధు ఆస్పత్రుల తరఫున వైద్యబృందాలను, మందులను అందుబాటులో ఉంచారు. అందుకు సంబంధించిన అంబులెన్స్‌లను పార్థసారథిరెడ్డి, కలెక్టర్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యతో కలిసి ప్రారంభించారు.

రెండు, మూడ్రోజుల్లో సీఎంఆర్ఎఫ్‌కు రూ.150కోట్లకుపైగా విరాళాల ప్రకటనలు వచ్చినట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

గురుపూజోత్సవానికి హాజరయ్యే తీరిక లేదా?

(మొదటిపేజీ తరువాయి)

విద్యా రంగం లేకపోవడం శోచనీయమంటూ గురువారం ఓ ప్రకటన చేశారు. విద్యా శాఖను తన ఆధీనంలో ఉంచుకున్న ముఖ్యమంత్రి ఆ రంగం పురోభివృద్ధిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని విద్యా వ్యవస్థ ధ్వంసమైందని, ఉపాధ్యాయులు లేక పాఠశాలలు మూతబడుతున్నాయని హరీశ్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులను ఇష్టమొచ్చినట్లు విధుల నుంచి తొలగిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. విద్యా వ్యవస్థను సక్రమంగా పట్టించుకోని ప్రభుత్వం సమీకృత గురుకులాలు, విద్యా కమిషన్ అంటూ భ్రమలు కల్పిస్తోందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పతనమవుతున్న విద్యా వ్యవస్థ గురించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఏం సమాధానం చెబుతారని ముఖ్యమంత్రిని నిలదీశారు. కాగా, ఖమ్మం వరద బాధితుల కోసం హరీశ్‌రావు సిద్దిపేట నుంచి మూడు లారీల్లో నిత్యావసర సరుకులను గురువారం పంపించారు. సిద్దిపేటలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జెండా ఊపి ఆ లారీలను ప్రారంభించారు. రెండు, మూడు రోజుల్లో మహబూబాబాద్ జిల్లాకు కూడా సాయం అందిస్తామని చెప్పారు. ఖమ్మం వరద బాధితులకు సాయం చేసేందుకు వెళుతుండగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రోద్బలంతోనే తమపై దాడులు జరిగాయని హరీశ్ ఈ సందర్భంగా ఆరోపించారు. వరద బాధితులకు సకాలంలో సహాయం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని మండిపడ్డారు. ప్రభుత్వం ముందే మేల్కొని ఉంటే ప్రాణ నష్టం తగ్గేదన్నారు. వరద ముంపు వల్ల నీట మునగిన ఇళ్ల వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు బీజేపీ కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే, అధికారం చేపడితే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద రూ.లక్ష తోపాటు తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందని కాంగ్రెస్ పార్టీని హరీశ్ రావు ప్రశ్నించారు.

భద్రాద్రి వద్ద ఉధృతంగా గోదావరి

- 45.5 అడుగులకు చేరిన నీటి మట్టం
- శ్రీశైలానికి లక్ష క్యూసెక్కులకుపైగా వరద

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం స్వల్పంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రం 45.5అడుగులకు చేరింది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీకి 5.29 లక్షల క్యూసెక్కులు, మేడిగడ్డ బ్యారేజీకి 8.19లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఆయా బ్యారేజీల్లోని గేట్లన్నీ ఎత్తి.. వచ్చిన వరదను వచ్చినట్టే దిగువకు పంపిస్తున్నారు. ఇక, కృష్ణాబేసిన్‌లో కురుస్తున్న వర్షాల కారణంగా వరద స్వల్పంగా పెరిగింది. జూరాల ప్రాజెక్టుకు 82 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఆరు గేట్లు ఎత్తి 41,742, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 36,624 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి 1,22,062క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. గేట్ల ద్వారా 27,937 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 67,824 క్యూసెక్కులు వదులుతున్నారు. నాగార్జున సాగర్‌లో ప్రస్తుతం 587.70 అడుగుల మేర నీరు ఉంది. విద్యుదుత్పత్తితోపాటు కాలువల ద్వారా మొత్తం 40,810 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఏఐ విప్లవానికి హైదరాబాద్ రెడీ!


ఏఐ గ్లోబల్ సమ్మిట్ 2024 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రి దుద్దిళ్ల

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. నాస్కామ్ భాగస్వామ్యంతో చేపడుతున్న తెలంగాణ ఏఐ మిషన్(టీ-ఏఐఎం) ద్వారా రాష్ట్రంలో కృత్రిమ మేధ ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేస్తామన్నారు. కృత్రిమ మేధ రంగంలోని నిపుణులతో కలిసి ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్తామని ప్రకటించారు. హైదరాబాద్‌ను కృత్రిమ మేధ కేంద్రంగా తీర్చిదిద్దబోతున్నామనేందుకు ఈ సదస్సే నిదర్శనమని చెప్పారు. ముచ్చర్లలో నిర్మించబోయే భవిష్య నగరాన్ని గొప్ప ఏఐ హబ్‌గా తీర్చిదిద్దే సంకల్పంలో అందరూ భాగస్వాములు కావాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. భవిష్య నగరం అందరికీ స్వాగతం పలుకుతోందన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానం వచ్చినపుడల్లా కొంత భయం నెలకొనడం సహజమేనని, అది మన జీవితాన్ని మెరుగు పరుస్తుందా? లేక ఉద్యోగాలు పోతాయా? అనే భయాలు తలెత్తుతాయని చెప్పారు. కృత్రిమ మేధ ప్రపంచ సాంకేతిక రంగంలో ఇప్పటివరకు వచ్చిన అత్యుత్తమ ఆవిష్కరణ అన్నారు. గతంలో వచ్చిన పారిశ్రామిక విప్లవాన్ని భారతదేశం అందిపుచ్చుకోలేకపోయిందని, కొత్తగా వచ్చిన ఏఐ విప్లవాన్ని అయినా అందుకోవడానికి దేశం సిద్ధంగా ఉంటే అందుకు నాయకత్వం వహించడానికి హైదరాబాద్ సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఈ సదస్సుతో ఏఐ ఆవిష్కరణల్లో సరికొత్త ప్రమాణాలను సృష్టించేందుకు హైదరాబాద్ తన సన్నద్ధతను ప్రకటించిందని చెప్పారు. టెలివిజన్, కంప్యూటర్లు, ఇంటర్నెట్, మొబైల్ ఫోన్‌లను చూడడం మనతరం చేసుకున్న అదృష్టమని వ్యాఖ్యానించారు. కరెంటు బల్బు, టీవీ, కెమెరా, కంప్యూటర్ ఇవన్నీ ప్రపంచ గతిని మార్చడంలో కీలకపాత్ర పోషించాయని చెప్పారు. రైలు ఇంజిన్, విమానం ఆవిష్కరణలతో ప్రపంచ స్వరూపమే మారిపోయిందన్నారు. సాంకేతిక, ఆవిష్కరణ లేకుండా సమాజంలో ఏ మార్పు జరగదని చెప్పారు. ఏఐ సదస్సులో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను రేవంత్‌రెడ్డి సందర్శించారు. సదస్సులో పాల్గొనడానికి వచ్చిన యొట్టా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సొల్యూషన్స్ ఎల్ఎల్‌పి సీఈవో సునీల్‌గుప్తా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో జీపీయూ ఆధారిత ఏఐ క్లౌడ్ ఏర్పాటులో భాగస్వామ్యంపై చర్చించారు. ఐబీఎం వైస్ ప్రెసిడెంట్ డానియల్ కాంబ్, జె-పిఏయల్ గ్లోబల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇక్బాల్‌సింగ్ దలివాల్ కూడా రేవంత్‌తో భేటీ అయ్యారు. కృత్రిమ మేధలో భవిష్యత్తు అవకాశాలు, కొత్త ఆవిష్కరణలు, ఏఐ రంగం అభివృద్ధిపై చర్చించారు. అందరికోసం కృత్రిమ మేధ అంశంపై అంతర్జాతీయ సదస్సు హైదరాబాద్‌లో నిర్వహించడం ఇదే తొలిసారి. వివిధ దేశాల నుంచి రెండు వేల మంది ప్రతినిధులు హాజరవుతున్నారు.

ఏఐ స్టార్టప్‌లకు రూ. 2 వేల కోట్లు

ఐదేళ్లలో రూ.10వేల కోట్లు ఖర్చు చేస్తాం

ఏఐ రంగంలో తెలంగాణది అగ్రస్థానం

'ఆంధ్రజ్యోతి'తో కేంద్ర ఐటీశాఖ అదనపు కార్యదర్శి అభిషేక్ సింగ్

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ(ఏఐ) రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులను కేటాయించిందని కేంద్ర ఐటీ శాఖ అదనపు కార్యదర్శి అభిషేక్ సింగ్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ రంగంలో అనేక ఆవిష్కరణలు వచ్చాయని గుర్తుచేశారు. ఆవిష్కరణల్లో ప్రపంచంతో పోటీపడేలా ఇక్కడి యువతను ప్రోత్సహించడం కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తున్న ఇంటర్నేషనల్ ఏఐ సమ్మిట్‌లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన అభిషేక్ సింగ్.. భవిష్యత్‌లో రాబోయే ఏఐ విప్లవంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా తన అభిప్రాయాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

కృత్రిమ మేధ రంగంలో దేశం వెనకబడకూడదన్న లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ఇప్పటికే ఏఐ మిషన్‌ను ఏర్పాటు చేసింది. దీనికి వచ్చే ఐదేళ్లకు గాను రూ.10వేలకు కోట్లకు పైగా మంజూరుచేసింది. దేశం, రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్యలకు ఏఐ సాంకేతికతతో స్టార్టప్‌లు పరిష్కారం చూపించాల్సి ఉంటుంది. ఆ దిశగా పనిచేసే స్టార్టప్‌లను గుర్తించేందుకు హాకథాన్ నిర్వహించాం.

వైద్య రంగంలో..

రోగాలను ముందస్తుగా గుర్తించడమే అత్యంత కీలకం. ఆ దిశగా ఏఐ టెక్నాలజీతో ఇప్పటికే అనేక ఆవిష్కరణలు అందుబాటులోకి వస్తున్నాయి. రొమ్ము క్యాన్సర్ లాంటి తీవ్రమైన సమస్యలను ముందస్తుగా గుర్తించే టెక్నాలజీ ఏఐ ద్వారా అందుబాటులో ఉంది. ఇతర అనారోగ్య సమస్యలనూ ఏఐ కచ్చితత్వంతో గుర్తిస్తోంది. దేశ వైద్య రంగంలో ఇది కీలకమైన పరిణామం.

సమాచార గోప్యతే కీలకం..

ఏఐతో లాభాలతోపాటు నష్టాలూ ఉన్నాయి. ముఖ్యంగా వ్యక్తిగత సమాచార భద్రత అత్యంత కీలకం. ఏఐ పరిశోధకులు ఈ విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. ఏఐతో డీప్‌ఫేక్‌ను అడ్డుకోవడం కూడా ఇప్పుడు పెద్ద సమస్య. తప్పుడు సమాచార వ్యాప్తిలోనూ ఏఐని విపరీతంగా వినియోగిస్తుండడం ఆందోళన కలిగిస్తున్న విషయం. దీనిపైనా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది.

ఏఐ సదస్సు నిర్వహణ భేష్..

ఐటీ రంగంలో హైదరాబాద్ ఎప్పటినుంచో ముందంజలో ఉంది. ఏఐ రంగంలోనూ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అగ్రస్థానంలో ఉంది. అంతర్జాతీయ ఏఐ సదస్సును గొప్పగా నిర్వహిస్తోంది. ఈ సదస్సుతో ప్రపంచ వ్యాప్తంగా రాష్ట్రం పేరు మార్మోగనుంది. కేంద్రం అమలుచేస్తున్న ఏఐ మిషన్‌లో భాగంగా తెలంగాణతో కలిసి పనిచేసేందుకు సిద్ధం. ఈ రంగంలో హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిలో పేరు సాధిస్తుంది.

అందరికీ ఏఐ!



మూడేళ్లలో కోటి మందికి కృత్రిమ మేధ అవగాహన

15-18 ఏళ్ల విద్యార్థులకు సిలబస్‌లో ఏఐ.. వచ్చే విద్యాసంవత్సరం నుంచే పాఠాలు


హైదరాబాద్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు.. ఉద్యోగులు.. వృద్ధులు.. ఇలా రాష్ట్రంలోని ప్రతీ పౌరుడిపై కృత్రిమ మేధ తన ప్రభావం చూపించబోతోంది.. వీరందరికీ ఏఐలో కనీస ప్రాథమిక శిక్షణ తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఏఐ విధానాన్ని ప్రకటించింది. కృత్రిమ మేధ అంతర్జాతీయ సదస్సులో వచ్చే మూడేళ్లకు సంబంధించిన ఏఐ మార్గదర్శ ప్రణాళికను(రోడ్ మ్యాప్) విడుదల చేసింది. 2027 నాటికి ఈ రంగంలో సాధించాల్సిన లక్ష్యాలను నిర్దేశించుకుంది. ప్రభుత్వ పాలన, పౌర సేవలు, టెక్నాలజీ వినియోగంలో సింగపూర్, మలేషియాల్లో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను అధ్యయనం చేసిన ప్రభుత్వం రాష్ట్ర అవసరాలు, ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేసి రోడ్ మ్యాప్‌ను రూపొందించింది. వచ్చే మూడేళ్లలో కోటి మంది జనాభాకి ఏఐ ఆధారిత పౌర సేవలు అందించడం, వచ్చే రెండేళ్లలో ప్రభుత్వ ఉద్యోగుల్లో 20 ఉత్పాదకత పెంచడం రోడ్ మ్యాప్‌లో కీలకాంశాలు.

బడుల్లో ఏఐ పాఠాలు

వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఉన్నత పాఠశాలల్లో ఏఐ పాఠాలు ఉంటాయి. ఈ మేరకు పాఠ్యాంశాల్లో మార్పు చేస్తారు. 15-18 వయస్సుగల ప్రతీ విద్యార్థికి ఏఐపై పూర్తి అవగాహన కల్పించడం దీని లక్ష్యం. రాష్ట్రవ్యాప్తంగా 5 వేల ప్రభుత్వ పాఠశాలల్లోని 20 వేల ఉపాధ్యాయులకు ఏఐ శిక్షణ అందిస్తారు. 5 లక్షల విద్యార్థులకు ఏఐపై పూర్తి అవగాహన కల్పిస్తారు. 2027 నాటికి అన్ని పాఠశాలలకు చెందిన మొత్తం విద్యార్థులకు ఏఐ పాఠ్యాంశాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటాయి. ఈ రంగంపై ఆసక్తిని పెంచేందుకు పాఠశాలల్లో ఏఐ టూల్స్, సాఫ్ట్‌వేర్‌పైనా ప్రాథమిక శిక్షణ ఉంటుంది. ఏఐ విషయంపై పరీక్షలు, ప్రాజెక్టు రిపోర్టులు ఉంటాయి. ఇంటర్ స్థాయిలో ఏఐ పాఠ్యాంశాలు పారిశ్రామిక అవసరాలు, ఉపాధి కల్పనకు అనుగుణంగా రూపొందిస్తారు.

అందరికీ ఏఐ

స్మార్ట్ ఫోన్, ఇంటర్‌నెట్ పరిజ్ఞానంపై ఏ మాత్రం



అవగాహన లేని వారికి కూడా కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానం సులభంగా అర్థమయ్యేలా అందరికీ ఏఐ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇందులో 15-60 మధ్య వయస్కుల వారికి ఏఐ ప్రాథమిక శిక్షణ ఉంటుంది. దైనందిక జీవితంలో, ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగంపై అవగాహన కల్పిస్తారు. మూడేళ్లలోనే ఈ వయసు వారందరికీ ఏఐపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

తెలుగులో ఏఐ

తెలంగాణ అవసరాలు, సేవలకు తగినట్టుగా కృత్రిమ మేధ విధానాలు, పరికరాలను రూపొందించడంపై దృష్టి సారిస్తారు. దీనికోసం తెలంగాణ సలహా మండలి, పరిశోధనా కేంద్రాల ఏర్పాటు చేస్తారు. స్థానిక పరిస్థితులకు తగినట్టుగా వ్యవసాయం, ఆర్థిక, సేవా రంగాల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ఏఐ సలహాలు తెలుగులో అందిస్తారు.

ఏఐ సిటీ

కొత్త సాంకేతిక పరిజ్ఞానాలన్నింటినీ అందిపుచ్చుకోవడం, విస్తరించడం, అమలు చేయడానికి సిద్ధంగా ఉండేలా ఏఐ సిటీని ఏర్పాటు చేస్తారు. ప్రపంచానికే గ్లోబల్ హబ్‌గా ఇది సేవలందిస్తుంది. రాష్ట్రంలోని అన్ని రంగాల్లోనూ ఏఐ సేవలను ప్రవేశపెట్టేందుకు ఇది ఒక కేంద్రంగా పనిచేస్తుంది. అంతర్జాతీయ ఏఐ కంపెనీలు ఈ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. విద్యాసంస్థలు, పరిశోధనా కేంద్రాలు కూడా ఉంటాయి. కోవర్కింగ్ స్పేస్, కన్వెన్షన్ సెంటర్లు, సహకార జోన్లు, స్కిల్ యునివర్సిటీ, బిగ్ డేటా సెంటర్స్ ఏఐ సిటీలో భాగంగా ఉంటాయి. జిల్లా కేంద్రాల్లో ఏర్పాటుచేయబోయే ఏఐ నోడ్స్‌ను ఏఐ సిటీకి అనుసంధానిస్తారు.

ఏఐ ఆధారిత కార్యక్రమాలు

- పౌరసేవలు - కృత్రిమ మేధ ఆధారిత అప్లికేషన్‌గా టీ-యాప్. లక్ష్యం: 80 లక్షల మంది.
- రోగ నిర్ధారణ- అత్యధిక ముప్పు(హైరిస్క్) ఉన్న రోగుల గుర్తింపు. వారి ఆరోగ్య పరిరక్షణకు సమయానుకూల సూచనలు, ప్రభుత్వ సహకారం. లక్ష్యం: 70 లక్షలు.
- ప్రాథమిక విద్య- ప్రాథమిక విద్యలో వెనకబడిన విద్యార్థులను ఏఐ మొబైల్ యాప్ ద్వారా గుర్తించడం. లక్ష్యం: 12 లక్షలు.
- ట్రాఫిక్ - రియల్ టైం డేటాతో ట్రాఫిక్ నిర్వహణ. లక్ష్యం: 40 లక్షలు
- టెలీ మెడిసిన్ - ఏఐ రహిత టెక్నాలజీతో టెలీ మెడిసిన్ సేవలు. లక్ష్యం: 21 లక్షలు
- ఇంటర్ విద్య - జేఈఈ, నీట్ లాంటి పోటీ పరీక్షల్లో వెనకబడిన ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ. లక్ష్యం: 8 లక్షలు
- వ్యవసాయం: భూసార పరీక్షల ఆధారంగా వేయదగ్గ పంటలకు సంబంధించి రైతులకు సూచనలు. లక్ష్యం: 30 లక్షలు.
- ముందస్తు నివారణ: అంటువ్యాధులు, ఇతర రోగాలు ప్రబలే అవకాశం ఉన్న ప్రాంతాల గుర్తింపు. ముందస్తు నియంత్రణ చర్యలు. లక్ష్యం: 10 లక్షలు.

ఏఐ కళాక్షేత్ర

ఏఐ సిటీలో 'సెంటర్ ఫర్ ది ఫ్యూచర్' ఏర్పాటు చేస్తారు. నిజజీవిత సేవలను అనుసంధానించే అన్ని కార్యక్రమాలు ఇక్కడ నిర్వహిస్తారు. ఏఐ కళాక్షేత్ర కూడా ఇందులో ఉంటుంది. కళలు, సాంస్కృతిక అంశాలకు సంబంధించి సృజనాత్మకతతో కూడిన సరికొత్త సాంస్కృతిక అనుభవాన్ని అందిస్తారు.

ఏఐ నోడల్ ఆఫీసర్

అన్ని ప్రభుత్వ శాఖల్లో ఏఐని విస్తృతంగా వినియోగించడం, పౌరులకు సంబంధించి సేకరించిన వ్యక్తిగత సమాచార భద్రత, శాఖ పరిధిలో పౌర సేవలను మరింత వేగవంతంగా అందించేందుకు ప్రతీ ప్రభుత్వ శాఖలో ఏఐ నోడల్ ఆఫీసర్ నియామకం.

ఏఐ సలహా మండలి

వివిధ రంగాల్లోని ఏఐ నిపుణులతో తెలంగాణ ఏఐ సలహా మండలిని ఏర్పాటు చేస్తారు. ఏఐ రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలు, వివిధ సంస్థలతో ఒప్పందాలు, ఏఐ రంగంలో యువతకు ప్రోత్సాహం, ఏఐ సిటీ ఏర్పాటుపై సూచనలు ఈ సలహా మండలి బాధ్యత. దీనిపై ఏ శాఖ ఆజమాయిషీ ఉండదు. నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికే రిపోర్ట్ చేస్తుంది.

ఏఐ సిటీలో పరిశోధనలు

200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటుచేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఇందులో ప్రభుత్వానికి సహకారం అందించేందుకు అమేజాన్, మైక్రోసాఫ్ట్, మెటా, ఇతర కార్పొరేట్ సంస్థలు ముందుకు వచ్చాయి. ఐఐటీ హైదరాబాద్, ట్రిపుల్ ఐటీ హైదరాబాద్, జెఎన్‌టీయు, ఎన్ఐటి వరంగల్, ఐఎస్‌బి, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్య సంస్థలుగా ఉండనున్నాయి.

5 లక్షల మందికి ఏఐ నైపుణ్య శిక్షణ

ఏఐ సాఫ్ట్‌వేర్, సేవల విభాగంలో భారీగా ఏర్పడనున్న ఉద్యోగాలను రాష్ట్ర యువతకు అందించడం లక్ష్యంగా ప్రత్యేక శిక్షణను ప్రభుత్వం అందిస్తుంది. మూడేళ్లలో 18-45 వయస్సులో ఉన్న 5 లక్షల మందికి ఏఐ రంగంలో ప్రభుత్వం శిక్షణ అందిస్తుంది. వెనకబడిన వర్గాలకు ఉపకార వేతనాలు కూడా ఉంటాయి. ఏఐ ప్రభావంతో ఉద్యోగాలు కోల్పోయిన వారూ ఈ శిక్షణతో ఉపాధి పొందవచ్చు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఉంటుంది. ఉపాధి ఇవ్వాలని ప్రభుత్వం కంపెనీలకు సిఫారసు చేస్తుంది.



ఏఐతో ఆయుర్దాయం పెంపు!

పదేళ్లలో సాధ్యమే.. ఒక్క ఏడాది పెరిగినా రూ.వేల కోట్ల సంపద సృష్టి

- ఏఐతో తలెత్తే సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలి
- డాక్టర్ పీటర్ డియెమాండిస్ కీలకోపన్యాసం

కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)తో మనిషి ఆయుర్దాయాన్ని పెంచే సాంకేతిక పరిజ్ఞానం పదేళ్లలో అభివృద్ధి చెందే అవకాశం ఉందని అమెరికాకు చెందిన పారిశ్రామికవేత్త, రచయిత డాక్టర్ పీటర్ డియెమాండిస్ తెలిపారు. సాంకేతిక రంగంలో మానవాళి గత వందేళ్లలో సాధించిన అభివృద్ధి.. ఏఐతో వచ్చే పదేళ్లలో సాధించినా ఆశ్చర్యం లేదన్నారు. హైదరాబాద్‌లో గురువారం ప్రారంభమైన ఏఐ సదస్సులో పీటర్ కీలకోపన్యాసం చేశారు. 'ఏఐతో ఎన్నో అద్భుతాలు జరుగుతున్నాయి. నాలుగేళ్ల వయసున్న పిల్లలు కూడా చాట్ జీపీటీ ఉపయోగించి చదువుకునే రోజులు ఎంతో దూరంలో లేవు. డ్రోన్లతో వ్యవసాయం చేస్తామని ఎప్పుడైనా ఊహించామా? డ్రైవర్ రహిత వాహనాలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. వైద్య రంగంలో ఏఐ అద్భుతాలు చేస్తోంది. సమస్త విజ్ఞానం సెల్‌ఫోన్‌లోకి వచ్చేసింది. ఏఐతో ఇన్ని అద్భుతాలు జరుగుతున్నప్పుడు మనిషి ఆయుర్దాయాన్ని పెంచే టెక్నాలజీని ఎందుకు అభివృద్ధి చేయకూడదనే ఆలోచన శాస్త్రవేత్తల్లో మొదలైంది. ఈ దిశగా మా సంస్థ కూడా కృషి ప్రారంభించింది' అని పీటర్ డియెమాండిస్ వెల్లడించారు. వచ్చే పదేళ్లలో మనిషి ఆయుర్దాయాన్ని పెంచే సాంకేతికతను తీసుకురాగలమని శాస్త్రవేత్తలు బలంగా నమ్ముతున్నారన్నారు. జీవిత కాలాన్ని ఒక ఏడాది పెంచగలిగినా రూ.వేల కోట్ల విలువైన అదనపు సంపదను సృష్టించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఏఐతో తలెత్తే సమస్యల గురించి ప్రస్తావిస్తూ.. ఏ సాంకేతిక పరిజ్ఞానంతోనైనా కొన్ని సమస్యలు ఉంటాయని, ఆహార ఉత్పత్తిలో కొత్త ఆవిష్కరణలు జరగకపోతే ప్రపంచ మానవాళికి అవసరమైన ఆహారాన్ని అందించగలిగే వాళ్లమేనా? అని ప్రశ్నించారు. ఏఐతో తలెత్తే సమస్యలను ఎలా అధిగమించాలనే దానిపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

వయోధికుల అనుభవాలను పదిలపర్చాలి

భారత్‌లో అపారమైన మానవ వనరులు ఉన్నాయని, లక్షలాది మంది సాంకేతిక నిపుణులున్నారని పీటర్ డియెమాండిస్ గుర్తు చేశారు. 'ఏఐ రంగంలో భారత్ వేగంగా పురోగమిస్తోంది. దేశంలో కోట్ల సంఖ్యలో ఉన్న 70 ఏళ్లకు పైబడిన వయోధికుల మనసుల్లో ఏముంది? వారి ఆలోచనలు, పూర్వీకుల నుంచి వారు అందిపుచ్చుకున్న సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన వివరాలను భద్రపరచాలి. వాటిని ముందుతరాలకు అందించేలా ఏఐ సహకారంతో కృషి చేయాలి' అని సూచించారు. ఏఐపై యువతలో ఆసక్తి పెంచేలా తెలంగాణ ప్రభుత్వం అంతర్జాతీయ సదస్సును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పీటర్ డియెమాండిస్ తాజాగా 'లాంగివిటీ' అనే పుస్తకాన్ని రచించారు. కొత్త ఆవిష్కరణలు చేసే వారిని ప్రోత్సహించటం కోసం ఎక్స్‌ప్రైజెస్ ఫౌండేషన్ అనే సంస్థను స్థాపించారు. - స్పెషల్ డెస్క్

పౌరసేవల్లో ఏఐ వినియోగం

మెటాతో రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల ఒప్పందం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: రాష్ట్ర ప్రభుత్వంతో సోషల్ మీడియా దిగ్గజ సంస్థ మెటా రెండేళ్ల భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఏఐ టెక్నాలజీల వినియోగంతో ఈ-గవర్నెర్స్‌ను, పౌర సేవలను మరింత విస్తృతపర్చటమే లక్ష్యంగా ఈ ఒప్పందం కుదిరింది. ఈ మేరకు లామా 3.1 మాడల్‌తోపాటు ఇతర ఒపెన్‌సోర్స్ ఏఐ టెక్నాలజీలను ఈ-గవర్నెర్స్‌లో వినియోగిస్తామని మెటా గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. 'స్థానిక అవసరాలను తీర్చటానికి వినూత్న పరిష్కారాలను ఆవిష్కరించేలా, రాష్ట్రంలోని సామాజిక, ఆర్థిక అవకాశాలను పూర్తి స్థాయిలో వినియోగించేలా ఈ భాగస్వామ్య ఒప్పందం కృషి చేస్తుంది' అని తెలిపింది. మరోవైపు, రాష్ట్రంలో 'ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు లక్ష్యంగా గేమింగ్ అండ్ ఈ-స్పోర్ట్స్ కంపెనీ నాజారా టెక్నాలజీస్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. గేమింగ్, ఇంటరాక్టివ్ మీడియా, గేమిఫైడ్ లెర్నింగ్, డిజిటల్ టెక్నాలజీల్లో పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణలపై దృష్టి పెడతామని ఈ సందర్భంగా ఆ కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా అభివృద్ధి వైపు.. అనే తెలంగాణ ప్రభుత్వ విధానం కారణంగానే ఈ ఒప్పందం సాధ్యమైందని నాజారా సీఈఓ నితీశ్ మిట్టర్‌సెయిన్ పేర్కొన్నారు. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి డీ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఏఐ ఆధారిత డిజిటల్ ఇన్నొవేషన్‌లో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా నిలబెట్టే దిశగా ఇది కీలక ఒప్పందమన్నారు.

ఏఐ డెస్టినేషన్‌గా హైదరాబాద్

గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో మంత్రి దుద్దిళ్ల



హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) హబ్‌గా తీర్చిదిద్దడం తమ విజన్ అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరుగుతున్న 'గ్లోబల్ ఏఐ సమ్మిట్ 2024' ప్రారంభ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌ను ఏఐ డెస్టినేషన్‌గా మార్చడానికి తమ వద్ద అన్ని హంగులూ ఉన్నాయని, 200 ఎకరాలలో ఏఐ సిటీని రూపొందిస్తున్నామని చెప్పారు. ఇది ఏఐ రంగంలోని మేధావులు, కంపెనీలు, పరిశ్రమలు, స్టార్టప్‌లకు వేదికగా ఉంటుందన్నారు. ఏఐ పాలసీ రూపకల్పనకు నిపుణులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఏఐ కోసం ఒక స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని కూడా నెలకొల్పుతామని చెప్పారు. ఏఐ సిటీ నిర్మాణం పూర్తయ్యే లోపున తాము శంషాబాద్ వద్ద విశాలమైన స్థలంలో ఏఐ కంపెనీలు, ఇన్నోవేషన్ సెంటర్‌లకు వేదిక కల్పిస్తామన్నారు. వాళ్లు అక్కడి నుంచి తమ కార్యకలాపాలు కొనసాగించవచ్చునన్నారు. డీప్ ఫేక్, తప్పుడు సమాచారం ద్వారా వ్యక్తులను, సంస్థలను తప్పుదోవ పట్టించే చర్యలను నియంత్రిస్తామన్నారు. డేటా ప్రైవసీ విషయంలో కూడా కఠినమైన నిబంధనలు రూపొందిస్తామని చెప్పారు. తమ కార్యాచరణలో భాగంగా ఏఐ నైపుణ్యం కలిగిన వర్క్‌ఫోర్స్‌ను తయారుచేస్తామనీ, ఏఐ లిటరసీని ప్రోత్సహిస్తామని చెప్పారు. దేశంలో తెలంగాణ ఆర్థికంగా పరిపుష్టమైన రాష్ట్రంగా ఎదిగిందని శ్రీధర్ బాబు అన్నారు. సంవత్సరానికి 11.3 శాతం ఆర్థిక వృద్ధిని సాధించడంతోపాటు రాష్ట్ర స్థూల ఉత్పత్తి 176 మిలియన్ డాలర్లకు చేరుకుందని చెప్పారు. రాష్ట్రాన్ని త్వరలో ట్రిలియన్ డాలర్ ఎకానమీగా మార్చే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్న ఆయన దశాబ్ద కాలంలో మూడు ట్రిలియన్లకు చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ గ్లోబల్ ఏఐ సమ్మిట్‌కు తమ రాష్ట్రం వేదికగా మారడం సంతోషంగా ఉందన్నారు.

నేరాల భవిష్యవాణి.. ఏఐ చిలక!

అంధులకు 'సేవా' కళ్లజోడు.. కరెంటు ఆదాచేసే ప్లగ్

రోజువారీ సమస్యలకు కృత్రిమ మేధతో పరిష్కారం

హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగిన ఏఐ సదస్సులో

సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్న ఆవిష్కరణలు

నిత్యం మనం ఎదుర్కొనే రకరకాల సమస్యలకు కృత్రిమ మేధ సాయంతో పరిష్కారం చూపుతున్నారు పరిశోధకులు! రాజధాని హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఏఐ సదస్సులో అలాంటి పలు ఆవిష్కరణలు.. సందర్శకులను ఎంతగానో ఆకట్టుకు న్నాయి. అందులో మచ్చుకు కొన్ని..

ఆంధ్రజ్యోతి, హైదరాబాద్ సిటీ

అంధులకు 'సేవ' చేసే కళ్ల జోడు



అంధులకు ఎంతగానో ఉపయోగపడే "సేవా" కళ్లజోడును పుర్‌వ్యూఎక్స్ సంస్థ రూపొందించింది. ఈ కళ్లజోడు ఏఐ సాయంతో అంధులకు దారిచూపుతుంది. అంతేకాదు.. దారిలో ఉండే అడ్డంకుల గురించి, పరిచయస్తులు ఎవరైనా ఎదురైతే వారి గురించి చెబుతుంది. ఎదురుగా జరుగుతున్న సన్నివేశాన్ని వివరిస్తుంది. కుటుంబ సభ్యులను, కరెన్సీ కాగితాలను గుర్తిస్తుంది. దీని ద్వారా.. వాయిస్ కమాండ్‌తో ఫోన్ చేయొచ్చు. వార్తలు, సంగీతం వినొచ్చు. ఈ సంస్థ రూపొందించిన బ్లేడ్ 2 అనే కళ్లజోడు ద్వారా లైవ్ రికార్డింగ్‌లను పంపే అవకాశం ఉంటుంది. విధుల్లో ఉండే పోలీసులు ఈ కళ్లజోడును ధరిస్తే.. వారు చూస్తున్న దృశ్యాలను స్టేషన్‌లో ఉన్న స్క్రీన్‌పై ఉన్నతాధికారులు చూడవచ్చు.

బిజిలీ ఆడిటర్

నిత్యం ఇంట్లో వినియోగిస్తున్న ఉపకరణాలు ఎంత కరెంట్ వినియోగిస్తున్నాయో గుర్తించడంతోపాటు, కరెంట్ ఆదా చేసేందుకు తెలంగాణ స్టార్టప్ 'భారత్ స్మార్ట్ సర్వీసెస్'.. బిజిలీ ఆడిటర్, ఏఐ పవర్డ్ స్మార్ట్ ప్లగ్‌లను అందుబాటులోకి తెచ్చింది. ఈ సంస్థ రూపొందించిన యాప్ ద్వారా బిజిలీ ఆడిట్ నిర్వహించి ఇంటిలో వినియోగించే విద్యుత్ ఉపకరణాలు ఎంత కరెంట్‌ను వినియోగిస్తున్నాయో తెలుసుకోవచ్చు. ఇక, ఏఐ స్మార్ట్ పవర్డ్ ప్లగ్ ద్వారా కరెంట్ బిల్లుతోపాటు కర్బన ఉద్గారాలను కూడా తగ్గించ్చని నిర్వాహకులు తెలిపారు.





జాతకం చెప్పే ఏఐ చిలక.. డెస్టినీ!


పుట్టిన తిథి, వారం, నక్షత్రాలను బట్టి జ్యోతిషం చెప్పే యాప్‌ను డెస్టినీ సంస్థ రూపొందించింది. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, అందులో వివరాలను నమోదు చేస్తే.. మన జీవితంలో జరగబోయే విషయాల గురించి ఒక రోజు ముందు అలర్ట్‌లను అందిస్తుందని దీని రూపకర్తలు చెబుతున్నారు. దాదాపు 4 కోట్ల మందితో కూడిన డేటాబేస్ విశ్లేషించి.. జరగబోయే విషయాలను అంచనా వేసి చెబుతామని, తమ అంచనాలు 80% దాకా నిజమవుతున్నాయని వారు చెబుతున్నారు.

ఖనిజాన్వేషణకు..



భూగర్భంలోని ఖనిజాలను గుర్తించేందుకు జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఏఐ ఆధారిత సేవలను వినియోగిస్తోంది. జియోలాజికల్, జియో కెమికల్, జియో ఫిజికల్ డేటాను కలిపి విశ్లేషించడం ద్వారా ఏయే ఖనిజాలు ఎక్కడ లభ్యమవుతాయో తెలుసుకునే వీలుంటుంది.

నేరాలపై ముందే హెచ్చరిక



ఒక ప్రాంతంలో నమోదైన నేరాలన్నింటినీ విశ్లేషించి.. అక్కడ తరచుగా జరుగుతున్న నేరాలేంటో క్రోడీకరించి, అవీ ఏయే ప్రాంతాల్లో జరుగుతున్నాయో తరచిచూసి.. భవిష్యత్తులో అలాంటి నేరాలు జరిగే ప్రమాదాన్ని ముందే గుర్తించి అప్రమత్తం చేసే యాప్ ఒకటి ఉంటే? ఇగ్నీషియా ఏఐ అనే సంస్థ అలాంటి యాప్‌నే అభివృద్ధి చేసింది. ప్రస్తుతం దుబాయ్ పోలీసులు ఈ యాప్‌ను వినియోగిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ యాప్ వల్ల అక్కడ చిన్నపాటి నేరాలు 25 శాతం వరకు తగ్గాయని.. తెలంగాణ పోలీస్ శాఖ కూడా దీని పనితీరును పరిశీలిస్తోందని వెల్లడించారు.

చేతిరాతను డిజిటలైజ్ చేసే రినోట్ ఏఐ

పుస్తకంలో మనం రాసిన విషయాలను డిజిటలైజ్ చేయడంతోపాటు అందులో ఉన్న సమాచారాన్ని అవసరానికి తగిన విధంగా అందించే ఏఐ ఆధారిత యాప్‌ను రినోట్ ఏఐ సంస్థ అభివృద్ధి చేసింది. ఏదైనా సమాచారాన్ని నోట్‌బుక్‌పై రాసి.. దాన్ని రినోట్ ఏఐ యాప్‌తో స్కాన్ చేస్తే చాలు. ఆ సమాచారాన్ని మనం కోరుకున్న ఫార్మాట్లలో నిల్వ చేస్తుందది.


కోదండరాంను సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం

టీచర్ల సమస్యలను పరిష్కరిస్తాం: భట్టి

» రవీంద్రభారతిలో ఘనంగా గురు పూజోత్సవం

రవీంద్రభారతి/హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచితంగా విద్యుత్తును అందిస్తామని, ఇందుకు సంబంధించి ఉత్తర్వులను జారీ చేసినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. తెలిపారు. గురువారం రవీంద్రభారతిలో విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. విద్యతో పాటు గురువులకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గత పదేళ్లలో విద్యావ్యవస్థకు ప్రాధాన్యత ఇవ్వలేదని, తమ ప్రభుత్వం విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు.

దొంగల ధర్మారం ప్రగతి ధర్మారమైంది

» ఊరి పేరు మార్పుపై ఎట్టకేలకు గెజిట్ విడుదల

రామాయంపేట, సెప్టెంబరు 5: ఆ ఊళ్లో దొంగలు లేరు కానీ ఊరి పేరులో మాత్రం దొంగలు ఉండేవారు. ఫలితంగా ఆ ఊరి ప్రజలు ఎన్నో హేళనలు ఎదుర్కొనేవారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం దొంగల ధర్మారం గ్రామ ప్రజలు పడిన అవస్థ ఇది. ఈ సమస్యకు పరిష్కారంగా తమ ఊరి పేరు మార్చాలని గ్రామ ప్రజలు ఏడేళ్లు పోరాటం చేశారు. ఎమ్మెల్యే నుంచి ముఖ్యమంత్రి వరకు అందరికీ విజ్ఞప్తులు ఇచ్చారు. ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం దొంగల ధర్మారం పేరును 'ప్రగతి ధర్మారం'గా మార్పు చేసింది. ఇందుకు సంబంధించిన గెజిట్‌ను గురువారం విడుదల చేసింది. ఇంతకీ ఆ ఊరికి దొంగల ధర్మారం అనే పేరు ఎలా వచ్చిందంటే... పూర్వం ధర్మారం సమీపంలోని అడవిలో దొంగలు ఉండేవారు. దీంతో ఆ ప్రాంతం పేరు దొంగల ధర్మారంగా పిలువబడుతూ ప్రభుత్వ రికార్డులకి ఎక్కింది. ఇప్పుడు ప్రభుత్వం పేరు మార్చడంతో తాము ప్రగతి ధర్మారం వాళ్లమని ఆ గ్రామ ప్రజలు గర్వంగా చెప్పుకోనున్నారు.

నా ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారు: కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 5: అధికార కాంగ్రెస్ ప్రభుత్వం తన ఫోన్‌ను ట్యాప్ చేస్తోందని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. తనతో పాటు కరీంనగర్ సీపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, అధికారుల ఫోన్లను కూడా ప్రభుత్వం ట్యాప్ చేస్తోందని ఆయన ఆరోపణలు చేశారు. మానకొండూర్ సీఐని కరీంనగర్ సీపీ టెలీకాన్ఫరెన్స్‌లోకి తీసుకోవడం లేదని ఎమ్మెల్యే సత్యనారాయణ చెప్పారని, టెలీకాన్ఫరెన్స్ అనేది ఒక అంతర్గత వ్యవహారమని.. అలాంటి విషయం ఎమ్మెల్యేకు ఎలా తెలిసిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సంజయ్ స్పందించి సీబీఐ విచారణ చేపట్టాలని కోరారు.

28న పంచాయతీ ఓటరు జాబితా!

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా ఓటరు జాబితా తయారీ షెడ్యూల్‌ను పొడిగిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ సి.పార్థసారథి తెలిపారు. గత నెలలో జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం ముసాయిదా ఓటరు జాబితాను శుక్రవారం ప్రకటించాల్సి ఉంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ శాఖలోని ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండి పనిచేయాల్సి వస్తోంది. దీంతో ఓటరు జాబితా తయారీ షెడ్యూల్‌ను పొడిగించినట్లు ఎస్ఈసీ పార్థసారథి తెలిపారు.

సీట్ల పెంపుపై ఇంజనీరింగ్ కాలేజీలకు ఎదురుదెబ్బ

» ప్రవేశాల ప్రక్రియ పూర్తయినందున పిటిషన్‌ల కొట్టివేత

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) ఇప్పటికే తమకు అనుమతులు ఇచ్చిన నేపథ్యంలో పెంచిన సీట్లు, కొత్త కోర్సులను నోటిఫై చేస్తూ 2024-25 విద్యా సంవత్సరానికి మాప్-అప్ రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అవకాశం కోరుతూ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌లను గురువారం కొట్టివేసింది. తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ సెక్షన్ 20 అమలు చేసే విధానం చట్టబద్ధతను సవాల్ చేస్తూ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, విద్యాజ్యోతి, సీఎంఆర్, కేఎంఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, మల్లారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ, మర్రి ఎడ్యుకేషనల్ సొసైటీ తదితర ఇంజనీరింగ్ కాలేజీలు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశాయి. వీటిపై గురువారం జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం వీటిపై విచారణ చేపట్టింది. ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిందని, ఆగస్టు 19 నుంచి తరగతులు సైతం ప్రారంభమయ్యాయని తెలిపింది. ఈ పరిస్థితుల్లో జోక్యం చేసుకోలేమని పేర్కొంటూ పిటిషన్‌లను డిస్మిస్ చేసింది.

శాశ్వత నివాసితులు స్థానిక కోటాకు అర్హులే!

(మొదటిపేజీ తరువాయి)

కేవలం రెండేళ్లు ఇతర రాష్ట్రాల్లో చదువుకుంటే.. స్థానికులు కాకుండా పోబోరని అభిప్రాయపడింది. శాశ్వత నివాసులైన విద్యార్థులను గుర్తించి, వారికి మెడిసిన్ కౌన్సెలింగ్‌లో అవకాశం కల్పించాలని ఆదేశించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. తెలంగాణలో వైద్యవిద్యలో అడ్మిషన్లకు ప్రభుత్వం 2017లో నిబంధనలను రూపొందించింది. అయితే.. విభజన చట్టంలో పేర్కొన్న పదేళ్ల గడువు ఈ ఏడాది జూన్ 2తో ముగియడంతో.. ఆ నిబంధనలకు సవరణలను తీసుకొస్తూ.. సర్కారు జూలై 19న జీవో 33ని తీసుకువచ్చింది. దీని ప్రకారం.. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు వరుసగా తెలంగాణలో చదివిన వాళ్లే స్థానికులు అని రూల్ 3(ఏ)లో నిర్వచించింది. అయితే.. ఇంటర్‌తో పాటు నీట్ కోచింగ్, ఇతరత్రా కారణాల వల్ల వేరే రాష్ట్రాల్లో చదివిన తెలంగాణ శాశ్వత స్థానికులైన విద్యార్థుల పాలిట ఈ నిర్వచనం శరాఘాతంగా మారింది. సొంత రాష్ట్రంలో స్థానికులు కాకుండా పోవడంపై 130 మందికి పైగా విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. 53 వేర్వేరు పిటిషన్లను దాఖలు చేశారు. "తెలంగాణ స్థానికులమే అయినా.. కేవలం ఒకట్రెండేళ్లు ఇతర రాష్ట్రాల్లో చదివినంత మాత్రాన ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు కాంపిటెంట్ కోటాలో 85% సీట్లకు మమ్మల్ని అనర్హులుగా ప్రకటించడం చెల్లదు" అని కోర్టుకు వివరించారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావుల ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం, కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఎ.ప్రభాకర్‌రావు వాదనలను వినిపించారు. "ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్న పదేళ్ల గడువు ముగియడంతో.. తెలంగాణ లోకల్ ఏరియాగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ స్థానికులకు స్థానిక కోటా సీట్లు దక్కేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దాంతో రూల్స్ సవరించాం. తెలంగాణ శాశ్వత నివాసితులకే స్థానిక రిజర్వేషన్ దక్కడం రాష్ట్ర ప్రభుత్వ విధాన నిర్ణయం" అని పేర్కొన్నారు. వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. "ప్రభుత్వం సవరణ ద్వారా తీసుకొచ్చిన రూల్ 3(ఏ) ముఖ్యఉద్దేశం స్థానికులకు రిజర్వేషన్ కల్పించడం. ఈ నిబంధనను కొట్టివేస్తే.. తెలంగాణ రాష్ట్రంలో వైద్య విద్య ప్రవేశాలకు దేశంలోని ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా అర్హులవుతారు. ఇక్కడి శాశ్వత నివాసితులకు స్థానిక రిజర్వేషన్ దక్కకుండా పోతోంది. అందుకే.. ఈ నిబంధనను పునర్నిర్వచిస్తున్నాం. తెలంగాణ శాశ్వత నివాసులకు నాలుగేళ్లు వరుసగా తెలంగాణలో చదివి ఉండాలన్న నిబంధన వర్తించదని అన్వయిస్తున్నాం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 డీ(2), బీ(2)లో పేర్కొన్న ముఖ్య ఉద్దేశానికి అనుగుణంగానే.. ప్రభుత్వం తెచ్చిన నిబంధన 3(ఏ)ని నిర్వచిస్తున్నాం" అని వ్యాఖ్యానించింది. నీట్ విద్యార్థులు తెలంగాణలో శాశ్వత నివాసితులు అయితే.. ఆ మేరకు నివాస ధ్రువీకరణ పత్రాలుంటే.. వారు వైద్యవిద్య ప్రవేశాల్లో స్థానిక కోటాకు అర్హులేనని స్పష్టం చేసింది. శాశ్వత నివాసితులను గుర్తించేందుకు ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టమైన మార్గదర్శకాలు లేవని గుర్తుచేసింది. ఒక విద్యార్థిని ఏయే పరిస్థితుల్లో శాశ్వత స్థానికుడిగా పరిగణనలోకి తీసుకుంటారనే అంశాన్ని నిర్వచిస్తూ.. కొత్తగా నిబంధనలు లేదా మార్గదర్శకాలను రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి స్వేచ్ఛనిస్తున్నట్లు ప్రకటించింది. కొత్త మార్గదర్శకాల మేరకు ప్రవేశాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది.

రూ.84 లక్షల కోట్లు!

2036 నాటికి అంత విలువైన ఆర్థిక వ్యవస్థ

భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్న ప్రభుత్వం

'గ్లోబల్ ఏఐ సమ్మిట్'లో 'తెలంగాణ గ్రోత్ స్టోరీ' పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక పురోగతి దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. 2036 నాటికి రూ.83,98,305 (1 ట్రిలియన్ డాలర్స్) కోట్ల ఆర్థిక వ్యవస్థను సృష్టించాలని నిర్ణయించింది. ప్రస్తుతమున్న రాష్ట్ర స్థూల ఉత్పత్తికి(జీఎస్‌డీపీ) ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాల ద్వారా దన్ను కల్పిస్తూ ఈ లక్ష్యాన్ని సాధించనుంది. హైటెక్స్‌లో గురువారం ప్రారంభమైన 'ప్రపంచ కృత్రిమ మేధ సదస్సు'లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'తెలంగాణ గ్రోత్ స్టోరీ - 2036 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇందులో రాష్ట్ర ప్రగతి ఆకాంక్షలు, ఆర్థిక వృద్ధికి సహకరిస్తున్న ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాలు, ఉత్పత్తులు, ఐటీ ఆధారిత సేవలు, ఫార్మాస్యూటికల్స్, లైఫ్‌సైన్సెస్, వ్యవసాయాధారిత ప్రాసెసింగ్ యూనిట్లు తదితర అంశాల గురించి ప్రభుత్వం వెల్లడించింది. దాని ప్రకారం.. 2014లో ఆవిర్భవించిన నాటి నుంచి ఆర్థిక వృద్ధిని సాధిస్తూ వస్తున్న తెలంగాణ.. 2023-24 ఆర్థిక సంవత్సరం నాటికి ప్రస్తుత ధరల వద్ద రూ.14,78,100 కోట్ల (176 బిలియన్ డాలర్లు) జీఎస్‌డీపీని సాధించింది. ఇదే 2023-24లో స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ) రేటుతో పోలిస్తే జీఎస్‌డీపీ 2.4 శాతం అధికం. రాష్ట్ర తలసరి ఆదాయం కూడా దేశంలోనే అత్యధికంగా రూ.3,49,389 (4160 డాలర్లు)గా నమోదైంది. రంగారెడ్డి జిల్లా అత్యధికంగా రూ.9,46,862 తలసరి ఆదాయంతో రాష్ట్రంలోనే మొదటి స్థానాన్ని ఆక్రమించగా... రూ.4,94,033 తలసరి ఆదాయంతో హైదరాబాద్ ఆ తర్వాతి స్థానంలో నిలిచింది.

పిట్ట కొంచెం.. ఏఐ ఘనం

కృత్రిమ మేధలో బాల మేధావి.. సిద్ధార్థ్ నంద్యాల

పద్నాలుగేళ్లకే.. రెండు వేల మందికి ఏఐలో శిక్షణ

సీఎం ఆహ్వానంతో హాజరు.. సదస్సులో ఆకర్షణ!


తండ్రి మహేష్, సోదరి సౌమ్యతో సిద్ధార్థ్

హైదరాబాద్, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): రాజధానిలో జరుగుతున్న ఏఐ సదస్సులో ఓ బాల మేధావి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాడు. అతడి పేరు సిద్ధార్థ్ నంద్యాల (14). అమెరికాలోని టెక్సాస్‌లో 9వ తరగతి చదువుతున్న సిద్ధార్థ్.. ఏఐపై వ్యక్తిగత ఆసక్తితో యూట్యూబ్ వీడియోలతో శిక్షణ పొంది, అద్భుతమైన ప్రావీణ్యాన్ని సంపాదించాడు. రెండేళ్ల క్రితం స్టెమ్ ఐటి టెక్ అనే కంపెనీని ప్రారంభించి.. ఇద్దరు ఉద్యోగులను కూడా నియమించుకున్నాడు. ఇప్పటిదాకా 2 వేల మందికిపైగా యువతకు ఏఐలో శిక్షణ అందించాడు. ఒరాకిల్ కంపెనీ ఇతడికి 'వరల్డ్ యంగెస్ట్ ఏఐ సర్టిఫైడ్ ప్రొఫెషనల్' పురస్కారాన్ని అందించింది. ఇతడి నైపుణ్యాన్ని ప్రశంసిస్తూ.. టెక్సాస్‌లోని ఫ్రిస్కో నగర మేయర్.. సెప్టెంబరు-19ని 'సిద్ధార్థ్ నంద్యాల డే'గా ప్రకటించడం విశేషం. ఇతడి గురించి అమెరికా పర్యటనలో తెలుసుకున్న సీఎం రేవంత్.. ఏఐ సదస్సుకు ఆహ్వానించారు. దీంతో అతడు తన తండ్రి మహేష్, సోదరి సౌమ్యతో కలిసి సమిట్‌లో పాల్గొన్నాడు.

దక్షిణ ఆర్ఆర్ఆర్ భూముల విలువ డబుల్!

(మొదటి పేజీ తరువాయి)

భూముల విలువను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. 3వ తేదీన 'రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగంలో పెంచనున్న భూముల విలువపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. పెంచిన విలువలు సెప్టెంబరు 1నే ధరణి పోర్టల్‌లో అందుబాటులో ఉంచారు. ఎన్‌హెచ్ అధికారులు ఇచ్చిన అలైన్‌మెంట్ పరిధిలో భూసేకరణకు తీసుకునే భూముల వరకే రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ధరలు పెంచారు.

భూ సేకరణ పరిధిలో జిల్లాల వారీగా పెంపు ఇలా.. (ఎకరా చొప్పున)

సిద్దిపేట జిల్లాలో: గజ్వేల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని బేగంపేట్‌లో సర్వే నంబరు 285 నుంచి 390 మధ్యలో ఉన్న కొన్ని సర్వే నంబర్లలో ఎకరం భూమి విలువ రూ.2,62,500గా ఉండగా రూ.5,82,750కి పెంచారు. యాక్తల్‌లో సర్వే నంబరు 122 నుంచి 148 మధ్యలో ధర రూ.2,25,000 ఉండగా రూ.4,99,500 వరకు పెంచారు. బంగా వెంకటాపూర్‌లో సర్వే నంబరు 265 నుంచి 276 మధ్య రూ.3,37,500 ఉండగా, రూ.8,30,250కు పెంచారు. మక్తా మాసాన్‌పల్లిలో సర్వే నంబరు 39 నుంచి 111 మధ్య రూ.3,37,500 ఉండగా రూ.8,30,250కు పెంచారు. ముతరాజ్‌పల్లిలో సర్వే నంబరు 326, 331లో రూ.6,75,000 ఉండగా రూ.14,98,500 వరకు పెంచారు. ప్రజ్ఞాపూర్ పరిధిలో సర్వే నంబరు 253లో రూ.7,87,500 ఉండగా రూ.17,48,250 దాకా పెంచారు. ఇదే గ్రామంలో ఉన్న సర్వేనంబర్లు 356, 2578 పరిధిలో రూ.21 లక్షలు ఉండగా రూ.22,05,000 వరకు పెంచారు. వర్గల్ మండలం జబ్బాపూర్ పరిధిలో సర్వే నంబరు 14 నుంచి 206 మధ్య రూ.4,50,000 ఉండగా రూ.8,32,500 వరకు పెంచారు. ఇదే మండలం మైలారమ్ గ్రామంలో సర్వే నంబర్లు 74,75,78,79,80 పరిధిలో రూ.5,25,000 ఉంటే దాన్ని రూ.9,71,250కు పెంచారు. నెమ్‌టూర్ పరిధిలో సర్వే నంబరు 69 నుంచి 1131 మధ్య ఉన్న సర్వే నంబర్లలో రూ.4,50,000 ఉండగా రూ.8,32, 500 పెంచారు.

సంగారెడ్డి జిల్లాలో: సంగారెడ్డి సమీపంలోని నాగపూర్‌లో సర్వే నంబరు 171, 181 మధ్య ఎకరా ధర రికార్డు విలువ రూ. 7,50,000గా ఉంది. దీన్ని రూ.18,75,000 పెంచారు. ఇరిగిపల్లిలోనూ సర్వే నంబరు 69 నుంచి 77 మధ్యలో భూములకు ఇదే పెంపు వర్తింపజేశారు. కలాబ్‌గుర్‌లో సర్వే నంబరు 479 నుంచి 589 మధ్య రూ.7,50,000 నుంచి రూ.18,75,000కు పెంచారు. తాడ్లపల్లిలో సర్వే నంబరు 141 నుంచి 409 మధ్య ఉండే భూముల విలువను కలాబ్‌గుర్ పెంపునే వర్తింపజేశారు. సంగారెడ్డి మండలం చింతపల్లిలో సర్వే నంబరు 12 నుంచి 208 మధ్య రూ.7,50,000 నుంచి 25,41000 వరకు ఉండగా ఈ ప్రాంతంలో అన్ని భూముల విలువలను రూ.25,41,000 చేశారు.

మెదక్ జిల్లాలో: మెదక్ జిల్లా వట్టూర్ పరిధిలో సర్వే నంబరు 17 నుంచి 84 మధ్య సేకరించే వ్యవసాయ భూములకు సంబంధించి రికార్డు విలువ ఎకరం రూ. 5,62,500 ఉండగా దాన్ని రూ.16, 50,000కి పెంచారు. ఇక్కడ వ్యవసాయేతర భూములకు ప్రస్తుతం గజం విలువ రూ.1100 ఉండగా రూ.1500 పెంచారు. తూప్రాన్ మండలం నాగులపల్లిలో సర్వే నంబరు 88 నుంచి 191 మధ్య సుమారు 105.02 ఎకరాల పట్టా భూమిని రహదారి నిర్మాణానికి సేకరించనున్నారు. ఇక్కడ రెండు పంటలు పండే భూములు ఉన్నాయి. తుప్రాన్ మునిసిపాలిటీకి 500మీటర్ల దూరంలో ఉండటంతో ఈ ప్రాంతంలో గజం విలువ గరిష్ఠంగా రూ.20, 300, కనిష్ఠంగా రూ.3,100 ఉంది. నాగులపల్లిలో సర్వే నంబరు 88 నుంచి 194 మధ్య ఎకరం రూ.7,87,500 ఉండగా దాన్ని రూ.20 లక్షలకు పెంచారు. ఇదే గ్రామంలో సర్వే నంబరు 185, 189, 178, 179, 192, 190, 191 పరిధిలో రూ.42 లక్షలు ఉండగా దీన్ని రూ.50 లక్షలకు పెంచారు. వ్యవసాయేతర భూమి విలువ గజం రూ.1100 ఉండగా దాన్ని రూ.1500 పెంచారు. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌లో సర్వే నంబరు 183 నుంచి 375 మధ్య 100 ఎకరాల పట్టా భూమి భూసేకరణలో ఉంది. ఇక్కడ ఎకరా విలువ రూ.5,25,000 ఉండగా దాన్ని రూ.19 లక్షలకు పెంచారు. ఇదే గ్రామంలో సర్వే నంబరు 374, 375 పరిధిలో రూ.19,69,000 ఉండగా రూ.50 లక్షలకు పెంచారు. దాత్రపల్లిలో సర్వే నంబరు 111, 112, 113లో రూ.4,25,000 ఉండగా దాన్ని, రూ.16,50,000కు పెంచారు. ఇక్కడ వ్యవసాయేతర భూమి గజం విలువ రూ.1100 ఉంటే దాన్ని రూ.1500 పెంచారు. గుండ్రెడ్డి పల్లి గ్రామంలో సర్వే నంబరు 472 నుంచి 288 మధ్య రూ.5,62,500 ఉండగా రూ.16,50,000 పెంచారు. కిష్టాపూర్‌లో సర్వే నంబరు 98, 100 పరిధిలో ఎకరా రూ.5,62,500 ఉండగా దాన్ని రూ.16,50,000 పెంచారు.

కేసీఆర్ ఫాంహౌస్ ఉన్న ఎర్రవెల్లిలో

సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలం అనగాడి కిష్టాపూర్‌లో సర్వే నంబరు 88, 89, 92 పరిధిలో సేకరించే భూములకు సంబంధించి ప్రస్తుతం ఎకరా రికార్డు విలువ రూ.2,25,000 ఉండగా దాన్ని రూ. 4,99,500 పెంచారు. కేసీఆర్ ఫాంహౌస్ ఉన్న ఎర్రవెల్లిలో సర్వే నంబరు 111, 112 పరిధిలో రూ.2,70,000 ఉండగా దాన్ని రూ.5,99,400 పెంచారు. ఇదే మండలం చెబర్తిలో సర్వే నంబరు 31 నుంచి 458 మధ్య రూ.3,15,000 ఉండగా రూ.6,99,300 పెంచారు. పాములపర్తిలో సర్వే నంబరు 230 నుంచి 925 మధ్య రూ.5,25,000 ఉండగా రూ.11,65,500 వరకు పెంచారు. జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల పరిధిలో సర్వే నంబరు 76 నుంచి 366 మధ్య రూ.2,70,000 ఉండగా రూ.5,99,000 వరకు పెంచారు. పీర్లపల్లి పరిధిలో సర్వే నంబరు 185 నుంచి 399 మధ్య రూ.2,25,000 ఉండగా రూ.4,99,500 వరకు పెంచారు.

వరంగల్ హెల్త్ సిటీ.. అంచనాలు ఎలా పెరిగాయి..?

» ఆస్పత్రిపై ఎన్ని మీటింగ్‌లు పెట్టారు

» టెండర్లు సహా సమగ్ర వివరాలివ్వండి

» డీఎంఈ ఆఫీస్‌లో విజిలెన్స్ విచారణ

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ హెల్త్ సిటీ అంచనాలు అమాంతం ఎలా పెరిగాయని విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. దీనిపై వివరాలు సేకరించేందుకు విజిలెన్స్ బృందం గురువారం డీఎంఈ కార్యాలయానికి వెళ్లింది. "హాస్పిటల్ ప్లాన్ ఎప్పుడు రూపొందించారు..? టెండర్లు ఎప్పుడు ఇచ్చారు..? అంచనా ఎలా పెరిగింది..? గతంలో హెల్త్ సిటీపై ఎన్ని మీటింగ్‌లు నిర్వహించారు..? వినిట్స్ కాపీలు ఉన్నాయా..?" వంటి ప్రశ్నలు వేసి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. మూడు నాలుగు రోజుల్లో మిగతా సమాచారాన్ని కూడా అందజేస్తామని అధికారులు విజిలెన్స్‌కు తెలిపారు. కాగా, విజిలెన్స్ అధికారులు అడిగిన వివరాల్లో కొన్ని అందజేశామని, మిగతావి సిద్ధం చేస్తున్నామని ఓ అధికారి తెలిపారు. కాగా, బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ హాస్పిటళ్ల నిర్మాణాలు మొదలయ్యాయి. గత ప్రభుత్వంలో సుదీర్ఘకాలం డీఎంఈగా పనిచేసిన డాక్టర్ రమేశ్ రెడ్డి కనుసన్నల్లోనే నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. మొదలయ్యాయి.

ఉస్మానియా మెడికల్ కాలేజీ హాస్టళ్లకు నేడు శంకుస్థాపన

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా మెడికల్ కాలేజీ విద్యార్థుల కోసం నిర్మించనున్న రెండు కొత్త హాస్టల్ భవనాలకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా రెండు హాస్టల్ భవనాలను నిర్మించేందుకు రూ.115 కోట్లు, దంత వైద్య(డెంటల్) విద్యార్థుల హాస్టల్ భవన విస్తరణ కోసం రూ.6 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఏడాదిలోగా నిర్మాణాలను పూర్తి చేయాలని భావిస్తున్నారు.

నెహ్రూ నుంచి రాహుల్ వరకు విద్యను ప్రోత్సహించిన వారే

» ఐఐటీలను తీసుకొచ్చిన చరిత్ర కాంగ్రెస్‌దే

» సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్, నాతో సహా అందరం ప్రభుత్వ స్కూళ్లలో చదివినోళ్లమే

» కేసీఆర్ సైతం ప్రభుత్వ స్కూల్లోనే చదివారు

» ఆ సంగతి ఆయన మరిచినా మేం మరవలేదు

» పదేళ్ల కేసీఆర్ పాలనలో పేదలు విద్యకు దూరం

» పాఠశాలల్లో వసతుల కల్పన కోసమే విద్యా కమిషన్

» ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల కట్టడికీ దోహదం: జగ్గారెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, విద్యా కమిషన్ ఏర్పాటును స్వాగతిస్తూ ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న విద్యార్థులు, నాయకులు

హైదరాబాద్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకొని ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా.. ఇప్పుడు రాహుల్ గాంధీ వరకూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యను ప్రోత్సహిస్తూనే వచ్చారని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధి చెందిందంటే.. కాంగ్రెస్ ప్రభుత్వాలు వేసిన పునాదులే కారణమని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత కాలం.. పేదలకు విద్యను అందించే కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిందని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి సైతం రాష్ట్రంలో విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. ఐఐటీ వంటి విద్యాసంస్థలను తీసుకొచ్చిన చరిత్ర కాంగ్రెస్‌దన్నారు. ఈ ఐఐటీల్లో చదివిన విద్యార్థులకు విదేశాల్లోనూ ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయని గుర్తు చేశారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అని చెప్పి అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. ఆ మాట నిలుపుకోలేదని దుయ్యబట్టారు. ఈ నాటికీ ప్రభుత్వ స్కూళ్లలో చదివే వారు ఉన్నారని, కానీ వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూళ్లలో ప్రస్తుతం ఉన్న వసతులు కూడా కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో కల్పించినవేనని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తనతోపాటు మరెందరో ప్రభుత్వ స్కూళ్లలో చదువుకున్న వారిమేనని జగ్గారెడ్డి గుర్తు చేశారు. ప్రభుత్వ స్కూల్లో చదివిన ఉత్తమ్.. ఏకంగా పైలెట్ కూడా అయ్యారన్నారు. కేసీఆర్ సైతం ప్రభుత్వ స్కూల్లోనే చదివారని, కానీ ఆయన ఆ విషయాన్ని మరిచి పోయారని ఎద్దేవా చేశారు. తాము మాత్రం ప్రభుత్వ స్కూల్లో చదువుకున్నామన్న సంగతి మరువలేదన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో పేదలు విద్యకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే సీఎం రేవంత్ విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. కమిషన్ ద్వారా గ్రామాల్లోని ప్రభుత్వ స్కూళ్లలో వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. పాఠశాలల్లో మళ్లీ పేరెంట్స్ కమిటీలు రానున్నాయన్నారు. ప్రైవేటు స్కూళ్ల ఫీజులనూ ఈ కమిషన్ కట్టడి చేయనుందని వివరించారు.

మానవ తప్పిదాలతో నష్టం జరిగితే సీఈలదే బాధ్యత!

» ప్రతి ప్రాజెక్టు గేట్లు, కాలువలను తనిఖీ చేయండి

» మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేయండి

» అధికారులతో మంత్రి ఉత్తమ్ ఆదేశం



హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వరదల కారణంగా తెగిన చెరువులు, కాలువలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మరమ్మతులకు స్వల్పకాలిక టెండర్ విధానం అనుసరించి, శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేయాలని చెప్పారు. దెబ్బతిన్న చెరువులు, కాలువలతో పాటు జలాశయాలు, చెరువుల్లో నీటి నిల్వలపై గురువారం జలసౌధలో క్షేత్రస్థాయి అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ సలహాదారుడు ఆదిత్యనాథ్ దాస్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఉత్తమ్ ఆదేశించారు. మానవ తప్పిదాలతో నష్టం జరిగితే ఉపేక్షించే ప్రసక్తే లేదని, సంబంధిత చీఫ్ ఇంజనీర్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వరద నష్టంపై సమగ్ర నివేదికను అందించాలన్నారు. మరోవైపు వరదల సమయంలో అప్రమత్తంగా ఉన్న ఉద్యోగులు, అధికారులను అభినందించారు. ప్రతి ప్రాజెక్టు గేట్లతో పాటు కాలువల షట్టర్లను, రెగ్యులేటర్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, నిరంతర పర్యవేక్షణతోనే ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలోని వట్టెం రిజర్వాయర్ ముంపునకు కారణాలపై నివేదిక అందించాలని చెప్పారు. సర్జ్‌పూల్, పంప్‌హౌస్‌లో చేరిన నీటిని తొలగించడానికి అదనంగా మోటార్లు పెట్టాలని, అందుకు అవసరమైన కరెంట్‌ను అందించాలని డిస్కమ్ అధికారులను ఆదేశించారు.

10 నెలలుగా బిల్లులు పెండింగ్: అధికారులు

ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పనుల కోసం రూ.1100 కోట్లతో ప్రతిపాదనలు పంపిస్తే రూ.350 కోట్లే మంజూరు చేశారని, పనులకు చెల్లింపులు చేయకపోవడంతో ఎవరూ ముందుకు రావడం లేదని అధికారులు మంత్రికి తెలిపారు. రూ.150 కోట్లకు పైగా బిల్లులు పది నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. 1800 నీరడీ పోస్టులు మంజూరైనా.. నియామకాలు లేకపోవడంతో కాలువల నిర్వహణ కష్టంగా మారిందని తెలిపారు. భారీ వరదలతో 544 చోట్ల చెరువులు/ కాలువలు/ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయని నివేదించారు. వరదలతో దెబ్బతిన్న వనరులకు శాశ్వత మరమ్మతులు చేయడానికి రూ.900 కోట్లు కావాలని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇక ఓఅండ్ఎం నిధులపై ఆందోళన అక్కర్లేదని, బిల్లులు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటానని, మంత్రి హామీ ఇచ్చారు.

వానలు తగ్గగానే నీటిపారుదల శాఖలో పదోన్నతులు

వానలు తగ్గుముఖం పట్టగానే నీటిపారుదల శాఖలో పదోన్నతుల ప్రక్రియను పూర్తిచేసి, బదిలీలు చేపడతామని మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. ఆయన విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పదేళ్లుగా పదోన్నతులు లేక నీటిపారుదల శాఖ అస్తవ్యస్తంగా మారిందని, ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ అధ్యక్షతన కమిటీ వేశామని గుర్తుచేశారు. పదోన్నతులు కల్పించిన తర్వాత బదిలీలు చేపడతామన్నారు. బోర్డు నిర్వహణకు నిధులు ఇవ్వాలంటూ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్ జైన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసి, నిధుల విడుదలపై నివేదించారు. స్పందించిన మంత్రి.. నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

భూకంప జోన్‌లో మల్లన్నసాగర్!

అధ్యయనాలు లేకుండానే నిర్మాణం:కాగ్..సుమోటోగా ఎన్జీటీ విచారణ

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి పరిశోధనలు, అధ్యయనాలు చేయకుండానే భూకంప జోన్‌లో మల్లన్నసాగర్ ప్రాజెక్టును నిర్మించారంటూ ప్రచురితమైన కథనాన్ని జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) సుమోటోగా విచారణకు స్వీకరించింది. సమగ్ర అధ్యయనాలు చేయకుండానే భూకంప జోన్‌లో మల్లన్నసాగర్‌ను నిర్మించారంటూ తప్పుపట్టిన కాగ్ నివేదికను ఉటంకిస్తూ ఓ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైంది. దాన్ని సుమోటోగా స్వీకరించిన ఎన్జీటీ.. నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ, జిల్లా కలెక్టర్, కేంద్ర పర్యావరణ శాఖ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. చెన్నైలోని ఎన్జీటీ ధర్మాసనానికి కేసును బదిలీ చేసింది. గత నెల 7న విచారణ జరిపిన చెన్నై ధర్మాసనం.. మల్లన్నసాగర్ ప్రాజెక్టును సందర్శించి నివేదిక సమర్పించాలని కలెక్టర్, నీటిపారుదల శాఖను ఆదేశించింది. తదుపరి విచారణను 11న చేపట్టనుంది. గత ఏడాది సిక్కింలోని లోహ్నక్ వాగుకు గండిపడడంతో తీస్తా నదిపై చుంగ్తాంగ్ వద్ద నిర్మించిన హైడ్రో పవర్ ప్రాజెక్టు కమ్ డ్యామ్ కొట్టుకుపోయి ప్రాణ, ఆస్తినష్టం సంభవించింది. దీన్ని ఎన్జీటీ డిల్లీ ధర్మాసనం సుమోటోగా విచారణకు స్వీకరించింది. మల్లన్నసాగర్ సైతం ఇదే తరహాలో ఉందని, దానిపైనా విచారణ నిర్వహిస్తామని ఎన్జీటీ తేల్చిచెప్పింది. భూకంపాలకు సంబంధించిన అధ్యయనాలు లేకుండా మల్లన్నసాగర్ నిర్మించడంతో పాటు ఏదైనా విపత్తు జరిగితే అమలు చేయాల్సిన అత్యవసర కార్యాచరణను సైతం రూపొందించకపోవడం ద్వారా ప్రభుత్వం రిజర్వాయర్‌తో పాటు ప్రజల ప్రాణాలనూ ప్రమాదంలో నెట్టేసిందంటూ కాగ్ ఆందోళన వ్యక్తం చేసిందని ఈ సందర్భంగా ఎన్జీటీ గుర్తు చేసింది. మల్లన్నసాగర్ నిర్మాణం ప్రారంభించడానికి ముందే ఈ ప్రదేశంలో భూకంపాలపై జాతీయ భూభౌగోళిక అధ్యయన సంస్థతో అధ్యయనం జరిపించాలని షరతు విధిస్తూ ప్రాజెక్టు ప్రాథమిక డ్రాయింగ్స్‌ను 2016లో సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ సీఈ ఆమోదించారు. ఈ అధ్యయనాలు నిర్వహించాలంటూ నీటిపారుదల శాఖ 2016 డిసెంబరు, 2017 ఆగస్టు, అక్టోబరులో ఎన్జీఆర్ఐ డైరెక్టర్‌కు లేఖలు రాసింది. అధ్యయన నివేదిక వచ్చేదాకా ఆగకుండానే 2017లో నీటిపారుదల శాఖ మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించింది. మరోవైపు మల్లన్నసాగర్‌ను ప్రతిపాదించిన ప్రాంత భూగర్భంలో అత్యంత లోతు వరకు నిలువునా 3 జతల పగుళ్లు, వాటిలో కదలికలు ఉన్నట్లు ఎన్‌జీఆర్ఐ 2017 మార్చిలో ఇచ్చిన ప్రాథమిక నివేదికలో పేర్కొందని కాగ్ స్పష్టం చేసింది. వీటి ప్రభావంపై సమగ్ర సర్వే, పరిశోధనలు చేయాలని సిఫారసు చేసింది. ఈ సిఫారసులను రాష్ట్ర నీటిపారుదల శాఖ విస్మరించిందని కాగ్ ఆక్షేపించింది. తాజాగా ఎన్జీటీ ఇవే అంశాలపై దృష్టి సారించనుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

కాలికట్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో పలు టెక్నికల్ ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. పీజీ ప్రోగ్రామ్‌లు, సర్టిఫికెట్ కోర్సులు ఉన్నాయి. ఆఫ్‌లైన్ ప్రోగ్రామ్‌లకు క్వాలిఫయింగ్ ఎగ్జామ్, కౌన్సెలింగ్‌ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. దరఖాస్తు ఫీజు రూ.1000.
వెబ్‌సైట్: nielit.gov.in

నీలిట్‌లో టెక్నికల్ ప్రోగ్రామ్‌లు

పీజీ ప్రోగ్రామ్స్

ఇన్ వీఎల్ఎస్ఐ & ఎంబెడెడ్ సిస్టమ్ డిజైన్

ఇది ఆఫ్‌లైన్ ప్రోగ్రామ్. దీని వ్యవధి 24 వారాలు. ఇందులో అడ్వాన్స్‌డ్ డిజిటల్ డిజైన్, సీఎంఓఎస్ లాజిక్ డిజైన్, ఎంబెడెడ్ సీ అండ్ ఏఆర్ఎం కార్టెక్స్, ఎంబెడెడ్ లీనక్స్, ఎంబెడెడ్ ఆర్‌టీఓఎస్, హెచ్‌డీఎల్ లాంగ్వేజ్ అండ్ కోడింగ్ ఫర్ సింథసిస్, ఎఫ్‌పీజీఏ డిజైన్ మెథడాలజీ అండ్ ప్రొటోటైపింగ్, ఎంబెడెడ్ ప్రొడక్ట్ డిజైన్ మాడ్యూల్స్‌తోపాటు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. మొత్తం 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: (ఎంఈ/ ఎంటెక్/ బీఈ/బీటెక్) (ఈసీఈ/ ఈఈఈ/ ఏఈఐ/ సీఎస్ఈ/ ఐటీ/ బయోమెడికల్/ ఎలక్ట్రానిక్స్/మెకట్రానిక్స్)/ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/సీఎస్) ఉత్తీర్ణులు/చివరి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.70,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 9
- **కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 23

ఇండస్ట్రియల్ ఆటోమేషన్ సిస్టమ్ డిజైన్

ఇది 24 వారాల వ్యవధి గల ఆఫ్‌లైన్ ప్రోగ్రామ్. ఇందులో డేటా అక్విజిషన్ సిస్టమ్స్, ప్రాసెస్ ప్లాంట్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ సిస్టమ్ డిజైన్, పీఎల్‌సీ అండ్ పీఐడీ కంట్రోలర్స్, స్కాడా/హెచ్ఎంఐ సిస్టమ్ డెవలప్‌మెంట్, ఇండస్ట్రియల్ నెట్‌వర్కింగ్ అండ్ ఇండస్ట్రియల్ ఐఓటీ, డిస్ట్రిబ్యూటెడ్ కంట్రోల్ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ డ్రైవ్స్ మాడ్యూల్స్‌తోపాటు ప్రాజెక్ట్‌వర్క్‌లు ఉంటా యి. సోమవారం నుంచి శుక్రవారం వరకు తరగతులు నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిదిన్నర నుంచి పన్నెండున్నర వరకు థియరీ తరగతులు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు ప్రాక్టికల్ తరగతులు ఉంటాయి. మొత్తం 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: (బీఈ/బీటెక్)(ఎలక్ట్రికల్/ ఈఈఈ/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్/మెకట్రానిక్స్/కెమికల్ ఇంజనీరింగ్/ కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణులు/చివరి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.59,000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 18



సర్టిఫికెట్ కోర్సులు

కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్ యూజింగ్ సీఆర్ఈఓ

ఇది నాలుగు వారాల వ్యవధి గల ఆఫ్‌లైన్ ప్రోగ్రామ్. ఇందులో క్యాడ్ ఇంట్రడక్షన్, మోడలింగ్, డిటెయిలింగ్, డిజైన్ అసెంబ్లీ, డేటా ఎక్స్ఛేంజ్ మాడ్యూల్స్‌తోపాటు ఇంటర్నల్ టెస్ట్ ఉంటాయి. థియరీ తరగతులు, ల్యాబ్ సెషన్స్ ఉంటాయి. వారాంతాలు మినహా అన్ని రోజుల్లో ఉదయం పదకొండు గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. ఈ కోర్సులో మొత్తం 16 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సు పూర్తిచేసినవారు క్యాడ్ డిజైనర్లు, ప్రొడక్ట్ డిజైనర్లు, క్యాడ్ టెక్నీషియన్లుగా రాణించవచ్చు.

అర్హత: (బీఈ/బీటెక్/డిప్లొమా)(మెకానికల్/ప్రొడక్షన్/ఆటోమొబైల్/టూల్ అండ్ డై/ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్/ మెకట్రానిక్స్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు/చివరి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.10,000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** అక్టోబరు 2
- **కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 7

సైబర్ సెక్యూరిటీ

ఇది ఆరు వారాల వ్యవధి గల ఆన్‌లైన్ ప్రోగ్రామ్. ప్రతిరోజూ రెండు గంటలు ఆన్‌లైన్ సెషన్స్, మరో రెండు గంటలు ప్రాక్టికల్ సపోర్ట్ ఉంటాయి. ఆన్‌లైన్ సెషన్స్‌కు అటెండ్ కాలేనివారి కోసం రికార్డెడ్ లెక్చర్స్ అందిస్తారు. ఈ కోర్సుని బిగినర్స్ కోసం ఉద్దేశించారు. ఇందులో లీనక్స్ అండ్ నెట్‌వర్కింగ్ బేసిక్స్, ఇంట్రడక్షన్ టు వర్చువలైజేషన్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఫండమెంటల్స్, నెట్‌వర్క్ సెక్యూరిటీ, యాక్సెస్ మేనేజ్‌మెంట్, ప్రివెన్షన్ అండ్ ప్రొటెక్షన్-క్రిప్టోగ్రఫీ, క్లవుడ్ కాన్సెప్ట్స్, సెక్యూరిటీ స్కానింగ్ అండ్ స్టాండర్డ్స్ తదితర అంశాలు బోధిస్తారు.

అర్హత: ఇంటర్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులకు బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్, ఆపరేటింగ్ సిస్టమ్ అండ్ నెట్‌వర్కింగ్ అంశాలపై పరిజ్ఞానం ఉండాలి.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.9500.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **కోర్సు ప్రారంభం:** సెప్టెంబరు 23 నుంచి

టిస్‌లో డ్యూయెల్ డిగ్రీ

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టిస్)- 'మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ ఇన్ పబ్లిక్ పాలసీ అండ్ లా-మాస్టర్ ఆఫ్ లా(ఎల్ఎల్ఎం) ఇన్ లా అండ్ సోషల్ పాలసీ' అనే డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. దీని వ్యవధి రెండేళ్లు. మొదటి ఏడాది కోర్సును హైదరాబాద్ క్యాంపస్‌లో, రెండో ఏడాది కోర్సును ముంబై క్యాంపస్‌లో చదవాల్సి ఉంటుంది. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: మొదటి ఏడాది ప్రోగ్రామ్‌ను హైదరాబాద్ క్యాంపస్‌కు చెందిన స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ అండ్ గవర్నెన్స్ నిర్వహిస్తుంది. ఇందులో పబ్లిక్ పాలసీ అండ్ గవర్నెన్స్ సంబంధిత అంశాలు ఉంటాయి. దీనికి 46 క్రెడిట్లు నిర్దేశించారు.

- రెండో ఏడాది ప్రోగ్రామ్‌ను ముంబై క్యాంపస్‌కు చెందిన స్కూల్ ఆఫ్ లా-రైట్స్-కానిస్టిట్యూషనల్ గవర్నెన్స్ నిర్వహిస్తుంది. ఇందులో లీగల్ ఎడ్యుకేషన్, ఇంటర్‌సెక్షన్స్ ఆఫ్ లెజిస్లేషన్, లా, పబ్లిక్ పాలసీ అంశాలు ఉంటాయి. దీనికి 41 క్రెడిట్లు నిర్దేశించారు.

అర్హత: డ్యూయెల్ డిగ్రీలో ప్రవేశానికి గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్ ఆఫ్ లా(ఎల్ఎల్‌బీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి మాత్రం ప్రోగ్రామ్ పూర్తయిన తరవాత ఎంఏ(పబ్లిక్ పాలసీ అండ్ లా) డిగ్రీని అందిస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 15
- **వెబ్‌సైట్:** admissions.tiss.edu

రిలయన్స్ ఫౌండేషన్ యూజీ స్కాలర్‌షిప్



రిలయన్స్ ఫౌండేషన్-డిగ్రీ చదువుతున్న అభ్యర్థులకు ఉద్దేశించిన అండర్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మొత్తం 5000 స్కాలర్‌షిప్‌లు ఉన్నాయి. స్కాలర్‌షిప్ కింద ప్రోగ్రామ్ మొత్తానికి రూ.రెండు లక్షలు ఇస్తారు. అభ్యర్థులు ఈ మొత్తాన్ని ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ల్యాప్‌టాప్ కొనుగోలు, అకడమిక్ బుక్స్ కొనుగోలు నిమిత్తం వినియోగించుకోవచ్చు. దరఖాస్తు ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024-25 విద్యా సంవత్సరంలో మూడేళ్లు/అంతకన్నా ఎక్కువ వ్యవధిగల ఏదేని రెగ్యులర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొంది ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.15 లక్షలకు మించకూడదు. కుటుంబ వార్షికాదాయం రూ.రెండున్నర లక్షల కంటే తక్కువగా ఉన్నవారికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు. వివాహితులు కూడా అర్హులే.


- ఆన్‌లైన్/రిమోట్/డిస్టెన్స్/నాన్ రెగ్యులర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో చేరినవారు; ప్రస్తుతం డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నవారు; విదేశాల్లో చదివినవారు దరఖాస్తుకు అనర్హులు.

ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్: దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో వెర్బల్ ఎబిలిటీ, అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ అనే మూడు సెక్షన్లు ఉంటాయి. ఒక్కో సెక్షన్ నుంచి 20 చొప్పున మొత్తం 60 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. పరీక్ష సమయం గంట. అభ్యర్థి సాధించిన స్కోర్‌ను వెంటనే సంస్థకు పంపుతారు. అభ్యర్థులకు తెలపరు. ఈ టెస్ట్ రాస్తేనే దరఖాస్తును పరిగణనలోకి తీసుకుంటారు. ప్రాక్టీస్ టెస్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు ఈ టెస్ట్‌ను ఒకసారి మాత్రమే రాయడానికి వీలుంది.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** అక్టోబరు 6
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సినవి:** అభ్యర్థి ఫొటో, అడ్రస్ ప్రూఫ్, పదోతరగతి సర్టిఫికెట్, ఇంటర్ సర్టిఫికెట్, బోనఫైడ్ సర్టిఫికెట్, డిగ్రీ అడ్మిషన్ లెటర్, కుటుంబ వార్షికాదాయ ధ్రువీకరణ పత్రం, వైకల్యానికి సంబంధించిన ధృవీకరణ పత్రం
- **వెబ్‌సైట్:** www.scholarships.reliancefoundation.org

కాన్పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీకే) ఆధ్వర్యంలోని ఇండస్ట్రియల్ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఫర్ ఎగ్జిక్యూటివ్స్ ఫర్ విజనరీ లీడర్‌షిప్ ఇన్ మాన్యుఫాక్చరింగ్(పీజీపీఈఎక్స్-వీఎల్ఎం)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనిని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ), జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ(జేఐసీఏ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రామోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్, ఎంహెచ్ఆర్‌డీ-ఇండియా ఉమ్మడిగా రూపొందించాయి. దీనికి ఐఐఎం కోల్‌కతా, ఐఐటీ మద్రాస్ సహకారం అందిస్తున్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా 36 వారాల క్లాస్ రూం స్టడీ, కేస్ స్టడీస్, ల్యాబ్ సెషన్స్, ఇండివిడ్యువల్ అండ్ టీం అసైన్‌మెంట్స్, జపనీస్ ఫ్యాకల్టీ గెస్ట్ లెక్చర్స్, ఆరు వారాల ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్ ఉంటాయి. వారంపాటు జపాన్‌లో ఇండస్ట్రియల్ విజిట్ ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో 40 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులకు 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ ఫర్ ఎగ్జిక్యూటివ్స్ ఇన్ మాన్యుఫాక్చరింగ్' సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తారు. ప్లేస్‌మెంట్స్ సౌకర్యం ఉంది.

ఐఐటీ కాన్పూర్‌లో పీజీ



అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. ఇంటర్ నుంచి డిగ్రీ వరకు ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. 2025 ఫిబ్రవరి 28 నాటికి కనీసం నాలుగున్నరేళ్ల నుంచి గరిష్ఠంగా పదేళ్ల వరకు ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి.

ఎంపిక: ఐఐఎంసీ, ఐఐటీకే, ఐఐటీఎం ఉమ్మడిగా అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తాయి. రిటెన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి నిబంధనల ప్రకారం షార్ట్‌లిస్ట్ రూపొందిస్తారు. వీరిని మాత్రమే రిటెన్ టెస్ట్‌కు అనుమతిస్తారు. రిటెన్ టెస్ట్‌లో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ, ఇంజనీరింగ్ ఎబిలిటీ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేసి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.4,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 5
- **రిటెన్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** నవంబరు 19న
- **రిటెన్ టెస్ట్ కేంద్రాలు:** ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, చెన్నై
- **రిటెన్ టెస్ట్ తేదీ:** డిసెంబరు 1
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థులకు కాల్ లెటర్స్:** డిసెంబరు 6
- **ఐఐటీ మద్రాస్‌లో పర్సనల్ ఇంటర్వ్యూలు:** డిసెంబరు 22
- **ప్రవేశం పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** డిసెంబరు 31
- **వెబ్‌సైట్:** www.iitk.ac.in/ime/vlm

జాబ్ కార్నర్

పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకులో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఖాళీల సంఖ్య: 213

ఢిల్లీలోని పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు, హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్...లేటరల్ ఎంట్రీ విధానంలో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. ఆఫీసర్: **56 పోస్టులు**
2. మేనేజర్: **117 పోస్టులు**
3. సీనియర్ మేనేజర్: **33 పోస్టులు**
4. చీఫ్ మేనేజర్: **7 పోస్టులు**

విభాగాలు: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రాజ్‌భాష, హ్యూమన్ రిసోర్స్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, సైబర్ సెక్యూరిటీ, అకౌంట్స్, ఫారెక్స్, పబ్లిక్ రిలేషన్ అండ్ పబ్లిసిటీ, కార్పొరేట్, ఐఎస్ ఆడిటర్, సైబర్ ఫోరెన్సిక్స్, వెబ్ డెవలపర్, ఎస్‌క్యూఎల్ డెవలపర్, చార్టర్డ్ అకౌంటెంట్, లా మొదలైనవి.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఈ, బీటెక్, ఎంసీఏ, పీజీ, ఐసీడబ్ల్యూఏఐ, సీఎఫ్ఏ, ఎఫ్ఆర్ఎం, సీఐఐబీ, పీజీడీబీఏ, పీజీడీబీఎం ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

పే స్కేల్: నెలకు ఆఫీసర్‌కు రూ.48,480 - 85,920. మేనేజర్‌కు రూ.64,820- రూ.93,960. సీనియర్ మేనేజర్‌కు రూ.85,290-1,05,280. చీఫ్ మేనేజర్‌కు రూ.1,02,300- రూ.1,20,940 ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: విద్యార్హతలు, రాత పరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ మొదలైన వాటి ఆధారంగా

దరఖాస్తు రుసుము: జనరల్/ ఈడబ్ల్యూఎస్/ఓబీసీ కేటగిరీకి రూ.850. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.100.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15

వెబ్‌సైట్: punjabandsindbank.co.in/

నేషనల్ సీడ్స్‌లో ట్రాన్స్‌లేటర్స్

ఢిల్లీలోని వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వశాఖకు చెందిన నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్ఎస్‌సీ లిమిటెడ్)...డైరెక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ట్రాన్స్‌లేటర్-గ్రేడ్ 4(అఫీషియల్ లాంగ్వేజ్)

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, మాస్టర్ డిగ్రీ(ఇంగ్లీష్/హిందీ) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు రూ.22,000- రూ.77,000

వయోపరిమితి: 30 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తు ఫీజు: రూ.500; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

పని ప్రదేశాలు: న్యూఢిల్లీ, లఖ్‌నవూ, జైపూర్, పట్నా, సికింద్రాబాద్

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, మెరిట్ స్కోరు, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 30

వెబ్‌సైట్: https://www.indiaseeds.com/

పీడీఐఎల్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

నోయిడాలోని ప్రాజెక్ట్స్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా లిమిటెడ్.. పీడీఐఎల్ కార్యాలయాలు/ప్రాజెక్ట్ సైట్‌లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 22

పోస్టుల వివరాలు

1. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ప్రాసెస్ - కెమికల్): **10 పోస్టులు**
2. రెగ్యులర్ పోస్టులు(ఫైనాన్స్/ హెచ్ఆర్/ మెకానికల్/ సివిల్): **12 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ, గేట్-2024 స్కోరు, సీఏ/ఐసీడబ్ల్యూఏఐ, పీజీ, పీజీ డిప్లొమా, డిప్లొమా, ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు రుసుము: జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ.800. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.400.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 11

వెబ్‌సైట్: https://www.pdilin.com/

లిటిల్స్



తగ్గితే ఎందుకు మంచిది


ఒక ఊరిలో జగ్గు, రంగా అనే ఇద్దరు వ్యక్తులు ఉండేవారు వారిద్దరు మాటిమాటికీ కారణం లేకున్నా గొడవలు పడుతుండేవారు.ఎంతమంది మందలించినా, వారిద్దరూ తమ వైఖరి మార్చుకోలేదు. పొరపాటున ఒకరి వైపు మరొకరు చూసుకున్నా కూడా

'నీ మనసులో ఏదో దురుద్దేశం పెట్టుకునే నా వంక ఉరిమి చూసావు నువ్వు'అని దెబ్బలాడుకునే వారు ఇద్దరూ. ఆ ఊరివారు అంతా ఊరు చివరనున్నమంచినీటి చెరువులోనుంచి తాగడానికి నీళ్ల తెచ్చుకునే వారు.

ఆ చెరువుకు వెళ్లే దారి కొండ మీదుగా చాలా సన్నగా, ఇరుగ్గా ఉండేది. నడుస్తూ, కొంచెం పక్కకు జరిగితే కొండ మీదినుండి పడిపోయే విధంగా ఉన్న ఆ దారిలో ఒక రోజు జగ్గు నీళ్ల కోసం వెళ్లాడు. అదే సమయానికి రంగా నీళ్ల తీసుకుని వెనక్కి వస్తూ ఇద్దరూ ఒకరికొకరు ఎదురు పడ్డారు. ఇలాగే ఎవరైనా ఒకరికొకరు ఎదురు పడితే, మిగతా వారంతా ఎవరో ఒకరు వెనక్కి నడిచి ఎదుటి వారికి దారి ఇచ్చి సర్దుకుపోతారు.. కానీ వీరిద్దరిలో ఎవరూ వెనక్కి వెళ్లడానికి ఇష్టపడలేదు. అలాగే ఒకరి మొహంల్లోకి మరొకరు కోపంగా చూసుకుంటూ దారి చూసుకోకపోవడం వల్ల ఇద్దరూ పట్టు తప్పి కొండమీదనుండి కిందపడి దెబ్బలు తగిలించుకున్నారు.

కొన్నిసార్లు నెగ్గడానికి కాకుండా తగ్గడానికి ఇష్టపడితేనే మనం బాగుపడతాం.

7 తేడాలను కనిపెట్టండి



జత ఉన్న కార్డులు ఏవి ?



సరైన నీడను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 403

				6		7		1
	8			7	4	2	5	
1					2			6
								4
	9	4				6	3	
3								
8			9					5
	3	2	6	1			8	
7		1		2				

సుడోకు - 402 సమాధానం

6	7	8	9	1	3	4	2	5
3	2	9	4	5	6	1	8	7
4	1	5	8	7	2	3	9	6
1	9	6	7	4	8	2	5	3
2	5	7	3	9	1	6	4	8
8	3	4	6	2	5	9	7	1
9	4	3	5	6	7	8	1	2
5	8	1	2	3	9	7	6	4
7	6	2	1	8	4	5	3	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.